www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 20-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 34 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 3.59 తదుపరి త్రయోదశి; నక్షత్రం: చిత్త తె. 5.44 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 12.06-1.52; దుర్ముహూర్తం: మ. 12.37-1.29, మ. 3.12-4.03; అమృతఘడియలు: రా. 10.42-12.27; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీశైలం జామ్!

భక్తులతో కిటకిట.. ట్రాఫిక్‌తో ఇక్కట్లు



శ్రీశైలం క్షేత్రంలోని టోల్‌గేట్ సర్కిల్ వద్ద వాహనాల రద్దీ

3

అధికార పక్షంతో.. అంటకాగారు!





పోలింగ్ రోజు రాత్రి జరిగిన ఘర్షణలపై చంద్రగిరి నియోజకవర్గం కూచివారిపల్లిలో మహిళలను విచారిస్తున్న సిట్ సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్

పోలింగ్, తర్వాతి విధ్వంసంపై పోలీసుల్లో ఉదాసీనత

- హింసను తేలిగ్గా తీసుకున్న ఖాకీలు
- పల్నాడు, తాడిపత్రి, తిరుపతి ఎఫ్ఐఆర్‌లలో సాధారణ సెక్షన్లు
- తలలు పగిలినా కనిపించని 307
- ఊసేలేని ప్రజాప్రాతినిధ్య చట్టం
- 'సిట్' దర్యాప్తులో వెలుగులోకి.. అర్ధరాత్రి దాటాక ఈసీకి నివేదిక?
- తాడిపత్రిలో రాళ్ల దాడులపై సీఐ, ఎస్సైలను నిలదీసిన బృందం
- దాడుల తర్వాతా బందోబస్తు పెంచలేదు
- పోలీసుల వైఫల్యంపై ఆగ్రహం
- కొందరు అధికారులపై చర్యకు సిఫార్సు?

చివరి రోజు స్థానికుల నుంచీ సిట్ సమాచార సేకరణ

అమరావతి/తిరుపతి-ఆంధ్రజ్యోతి, తాడిపత్రి టౌన్/నరసరావుపేట, మే 19: రాష్ట్రంలో పోలింగ్ రోజు(ఈ నెల 13న).. ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలను రాష్ట్ర పోలీసు యంత్రాంగం చాలా తేలిగ్గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సంఘటనల తీవ్రతను బట్టి పెట్టాల్సిన సెక్షన్లు కూడా పెట్టలేదని.. కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సేకరించిన సమాచారాన్ని బట్టి తేటతెల్లమవుతోంది. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో మహిళా ఏజెంట్లపై కత్తులతో దాడులు, ప్రతిపక్ష కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పిల్లల మెడపై కత్తిపెట్టి

మిగతా 11వ పేజీలో...

పరువు పోయె

- భ్రష్టుపట్టిన రాష్ట్ర పోలీసు వ్యవస్థ
- డీజీపీ నుంచి ఎస్ఐ వరకూ వైసీపీ పక్షమే
- అధికార పార్టీ అరాచకాలకు వత్తాసు
- ఎన్నికల వేళ మరింత వికృతరూపం
- ఈసీ చర్యలతో ఒక్కొక్కటిగా వెలుగులోకి
- బదిలీలు, సస్పెన్షన్లు, విచారణ, చర్యలు
- పోలీసు శాఖకే మాయని మచ్చ
- ఏ రాష్ట్రంలోనూ ఈ దుస్థితి లేదని నిజాయితీ పోలీసు అధికారుల ఆవేదన
- చీడ తొలగిస్తేనే శాఖకు పరువు

ఒంటిపై యూనిఫామ్.. చేతిలో లాఠీ.. చేసేది పోలీసు ఉద్యోగం.. తీసుకునేది ప్రజల సొమ్ముతో జీతం. కానీ.. ప్రజల రక్షణ కోసం పనిచేయాల్సిన పోలీసులు అధికార మదంతో అరాచకాలు చేస్తున్న రూలింగ్ పార్టీ నేతలకు ఐదేళ్లుగా వంత పాడుతున్నారు. తమకు పోస్టింగ్ ఇచ్చిన అధికార పార్టీ రుణం తీర్చుకునేందుకు ఎన్నికల సమయంలో మరింత దారుణంగా, ఏకపక్షంగా ప్రవర్తించారు. ఫలితమే.. ఎస్ఐ నుంచి డీజీపీ వరకు బదిలీలు, ఐపీఎస్‌ల సస్పెన్షన్లు, శాఖాపరమైన విచారణ, ఓ పోలీసు అధికారిపైనే మరో పోలీసు అధికారి విచారణ! ఇతర రాష్ట్రాల్లో లేనివిధంగా, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పోలీసు శాఖకే మాయనిమచ్చ.

11

ఆగని అరాచకాలు.. కర్రలతో వెంటపడి కొట్టి.. ట్రాక్టర్‌తో దూసుకొచ్చి

టీడీపీలో చేరారని బాపట్ల జిల్లాలో తండ్రీకొడుకులపై వైసీపీ మూకల దాష్టీకం

ఆ ముగ్గురు ఎస్పీలపై చర్యలు

అభియోగాల నమోదుకు సీఎస్ ఆదేశాలు

ల్యాండ్ టైటిలింగ్‌పై నీతి ఆయోగ్ ఝలక్

జగన్ అండ్ కోకు మైండ్ బ్లాంక్!

ఆ చట్టం గురించి తమకేమీ తెలియదన్న నీతి ఆయోగ్

కేంద్రం, నీతి ఆయోగ్ ఒత్తిడి మేరకే చట్టం చేశామన్న ప్రచారం డొల్లే

- ఆ చట్టంలో ఏముందో మాకు తెలీదు
- ఆర్టీఐ వినతికి సమాధానం ఇచ్చిన సంస్థ
- ఇన్నాళ్లూ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే
- నీతి ఆయోగ్ జవాబుతో తొలగిన ముసుగు



రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు కర్త, కర్మ, క్రియ అంతా కేంద్రమేనని, నీతి ఆయోగ్ సిఫారసు మేరకే చట్టం చేశామని సర్కారు పెద్దలు చేస్తున్న ప్రచారం డొల్లేనని తేలిపోయింది. ఎన్నికల పోలింగ్‌కు ముందు, తర్వాత కూడా ఇదే ప్రచారం చేసిన వైసీపీ పెద్దలకు షాకిస్తూ.. అసలు ఈ చట్టం గురించి తమకు తెలియదని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వెనుక ఏం జరిగిందన్న విషయంలో ముసుగు తొలగిపోయింది. ఈ చట్టాన్ని కేంద్రం చేయాలని చెబితే చేశామని.. నీతి ఆయోగ్ సిఫారసు చేస్తే తీసుకువచ్చామని చెప్పిన సీఎం జగన్ సహా ప్రభుత్వ పెద్దల మాటలు పచ్చి అబద్ధాలేనని స్పష్టమైంది. ఏపీ తెచ్చిన చట్టంపై తమకు కనీస సమాచారం కూడా లేదని.. ఇది ఎలా ఉందో కూడా తమకు తెలియదని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. దీంతో ఈ వ్యవహారాన్ని కేంద్రంపైనా, నీతి ఆయోగ్‌పైనా నెట్టేసే ప్రయత్నం చేసిన సీఎం జగన్ సహా ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, అజేయ కల్లం రెడ్డిలు చెప్పింది బూటకమని తేలిపోయింది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం గురించి సమాచార హక్కు(ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నకు నీతి ఆయోగ్ సమాధానం ఇచ్చింది. దీనికి సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారమూ లేదని కుండబద్దలు కొట్టింది. దీంతో జగన్ సర్కారు చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలేనని స్పష్టమైంది. జగన్ సర్కారు నీతి ఆయోగ్‌తో సంబంధం లేకుండా, తన సొంత ధోరణిలోనే ఈ చట్టం తీసుకొచ్చినట్లు

మిగతా 12వ పేజీలో...

కాంగ్రెస్‌లో మమత చిచ్చు!







- కూటమిలో టీఎంసీ పాత్రపై ఖర్గే వర్సెస్ అధీర్
- అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించాల్సిందే
- లేదంటే బయటకు వెళ్లిపోవచ్చు: ఖర్గే
- పార్టీ సేవకుడిగా నా పోరాటాన్ని ఆపలేను
- మమతా బెనర్జీని సమర్థించలేను: అధీర్

కోల్‌కతా, మే 19: ఇండియా కూటమిలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ వ్యవహారం కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పశ్చిమ బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అధీర్ చౌదరి వైఖరి పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సీరియస్ అయ్యారు. ఇండియా కూటమి విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని అల్టిమేటం జారీచేశారు. ఇష్టంలేని వారు వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. టీఎంసీ విషయంలో

మిగతా 2వ పేజీలో...

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే.. 'సీబీఐ, ఈడీ'కి తాళాలు!: అఖిలేశ్

8 రాష్ట్రాలు.. 49 స్థానాలు

- నేడే సార్వత్రిక ఎన్నికల ఐదో దశ పోలింగ్.. బీజేపీకి కీలకం.. రాహుల్, స్మృతి, రాజ్‌నాథ్ తదితరులు బరిలో
- ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ.. నాలుగు కీలక రాష్ట్రాల్లోని 39 స్థానాల్లో పోరు



జార్ఖండ్‌లో ఎన్నికల విధులకు హెలికాప్టర్‌లో వెళ్తున్న సిబ్బంది

న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం మొదలై సుదీర్ఘంగా సాగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరంలో అత్యంత కీలకమైన ఐదో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. మొత్తం ఏడు దశలుగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో.. అతి తక్కువ స్థానాలకు పోలింగ్ జరిగే దశ ఇదే. ఈసారి కేవలం 49 స్థానాలకే ఎన్నికలు జరగనున్నప్పటికీ.. ఆ స్థానాలు ఎనిమిది రాష్ట్రాల్లో విస్తరించడం, పలువురు హేమాహేమీలు బరిలో ఉండడం రాజకీయ

మిగతా 2వ పేజీలో...

వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

- అరెస్టుల ద్వారా ఆప్‌ను నాశనం చేయలేరు
- ప్రధాని మోదీకి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరిక
- బీజేపీ ఆఫీసు ముట్టడికి తరలివెళ్లిన ఆప్ శ్రేణులు
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు

హెలికాప్టర్ ప్రమాదంలో.. ఇరాన్ అధ్యక్షుడు గల్లంతు

తూర్పు అజర్‌బైజాన్‌లో కూలిన చాపర్!



- ఆనకట్ట ప్రారంభానికి వెళ్లివస్తుండగా ఘటన
- జోల్ఫా అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ మిస్సింగ్
- పర్వతాలు.. భారీ వర్షాలు.. పొగమంచుతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు
- సైన్యం, ఐఆర్‌జీసీ, రెడ్ క్రెసెంట్ సహా 20 బృందాలతో గాలింపు చర్యలు
- క్షేమంగా తిరిగి రావాలంటూ ప్రార్థనలు

టెహ్రాన్, మే 19: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గల్లంతైంది. పొరుగుదేశం అజర్‌బైజాన్, ఇరాన్‌లోని తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్ సరిహద్దుల్లో ఓ డ్యామ్ నిర్మాణ పనుల ప్రారంభానికి ఆయన ఇరాన్ ఆర్థిక మంత్రి హుస్సేన్ ఆమిర్ అబ్దులాహియన్, అధికారులు, అంగరక్షకులతో కలిసి

మిగతా 2వ పేజీలో...



రోదసిలోకి గోపి తోటకూర

- తొలి భారతీయ అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు
- రాకేశ్‌శర్మ తర్వాత మళ్లీ ఇప్పుడే రోదసిలోకి..
- పది నిమిషాలపాటు సాగిన యాత్ర

12



ఈసీ దెబ్బతో.. జగన్ పేరు మాయం

ఈసారి ప్రభుత్వ లోగోతోనే విద్యాకానుక కిట్లు!




- త్వరలోనే పాఠశాలలకు కిట్ల సరఫరా
- 630 కోట్లతో 36.7 లక్షల మంది విద్యార్థులకు
- పాతవారికే కాంట్రాక్టు కట్టబెట్టిన సర్కారు
- ప్రభుత్వ పెద్దలకు రూ.50 కోట్ల కమీషన్లు?
- అందుకే టెండర్ల విధానానికి స్వస్తి పలికారా?
- ప్రభుత్వం మారితే విచారణకు అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'జగనన్న విద్యా కానుక' పథకం నుంచి జగన్ పేరు మాయమైంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త విద్యా సంవత్సరంలో బడి పిల్లలకు పంపిణీ చేసే విద్యా కానుక కిట్‌పై ఉన్న సీఎం జగన్ పేరును అధికారులు తొలగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ ఈ పథకం పేరును 'విద్యా కానుక'గా మార్చింది. అలాగే జగన్ పేరు లేకుండా కేవలం ప్రభుత్వ లోగోతో బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలు సిద్ధం చేశారు. ఫలితాల తర్వాత ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తెలియకుండా జగన్ పేరు పెట్టడం సరికాదని భావించిన ఈసీ.. ఆయన పేరు తొలగించాలని ఆదేశించింది. దీంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈసారి విద్యా కానుకపై జగన్ పేరు మాత్రం కనిపించదు. ప్రచార పిచ్చి పతాక స్థాయికి చేరడంతో చివరికి బడి పిల్లలకు

మిగతా 12వ పేజీలో...

ఆదివారం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కారు మబ్బులు



దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'

22న అల్పపీడనం.. తుఫాన్‌గా మారే చాన్స్!

దక్షిణ భారతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం

విశాఖపట్నం, అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతం, మాల్దీవులు, కొమరిన్ ఏరియాలో పలు ప్రాంతాలను ఆదివారం నైరుతి రుతుపవనాలు తాకాయి. సాధారణంగా మే 22న దక్షిణ అండమాన్ సముద్ర పరిసరాలను నైరుతి రుతుపవనాలు తాకాల్సి ఉండగా, ఈ ఏడాది మూడు రోజులు ముందుగానే తాకాయని భారత వాతావరణశాఖ(ఐఎండీ) ప్రకటించింది. హిందూ మహాసముద్రం మీదుగా బంగాళాఖాతం వైపు

మిగతా 6వ పేజీలో...

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం పిడుగులు

నేడూ కొనసాగే అవకాశం

పార్లమెంట్ భద్రత సీఐఎస్ఎఫ్ చేతికి

న్యూఢిల్లీ, మే 19: ఢిల్లీలోని పార్లమెంటు భద్రత బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) చేపట్టనుంది. మొత్తం 3,317 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది సోమవారం నుంచి పార్లమెంటు ఆవరణలో ఉగ్రవాద వ్యతిరేక, విధ్వంస నిరోధక భద్రత విధులు నిర్వహిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ సీఆర్పీఎఫ్కు చెందిన 1,400 మందికి పైగా సిబ్బంది పార్లమెంటు భద్రతను పర్యవేక్షించారు. సీఆర్పీఎఫ్కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్(పీడీజీ) గత శుక్రవారం తన కమాండోలను ఉపసంహరించుకుందని, డీజీ ర్యాంకు స్థాయి అధికారి పార్లమెంట్ కాంప్లెక్స్లోని అన్ని సెక్యూరిటీ పాయింట్లను సీఐఎస్ఎఫ్కు అప్పగించారని అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబరు 13న పార్లమెంట్లో భద్రతా ఉల్లంఘన ఘటన తర్వాత పాత, కొత్త పార్లమెంట్ భవనాలు, అనుబంధ నిర్మాణాల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాహుల్‌ది మావోయిస్టు భాష!

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఏ పారిశ్రామికవేత్త అయినా 50సార్లు ఆలోచిస్తాడు



జంషెడ్‌పూర్, పురూలియా, మే 19: కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ వాడుతున్న మావోయిస్టు భాష కారణంగా.. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏ పారిశ్రామిక వేత్త అయినా ఒకటికి యాభైసార్లు ఆలోచిస్తాడని ప్రధాని మోదీ విమర్శించారు. పారిశ్రామికవేత్తల నుంచి డబ్బు దోచుకోవడానికే ఆయన ఆ భాష వాడుతున్నారని ఆరోపించారు. ముస్లిం ఛాందసవాదుల ఒత్తిడితో.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ హిందూ సాధుసంతులపై విమర్శలు చేస్తున్నారని మోదీ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, పశ్చిమబెంగాల్‌లోని పురూలియా, బిష్ణుపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఝార్ఖండ్‌లో తాము నక్సల్స్ వెన్ను విరిస్తే.. డబ్బు దోచుకునే బాధ్యతను కాంగ్రెస్, ఝార్ఖండ్ ముక్తిమోర్చా తీసుకున్నాయని దుయ్యబట్టారు. పీకల్లోతు అవినీతిలో మునిగిపోయిన ఆ రెండు పార్టీలూ దేశాభివృద్ధి కోసం ఏమీ చేయలేదని వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లోని పురూలియా, బిష్ణుపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ సంఘకు చెందిన కొందరు సాధుసన్యాసులు ఢిల్లీలోని బీజేపీ నేతల ప్రభావంతో తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ ఆ రాష్ట్ర సీఎం మమత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సేవకు, నైతికతకు పేరెన్నికగన్న ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ సంఘ విషయంలో టీఎంసీ హద్దులు దాటి, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని, మమత బహిరంగంగానే ఆ సంస్థలను బెదిరిస్తూ హెచ్చరికలు జారీచేస్తున్నారని ఆరోపించారు. జూన్ 4న తాము మళ్లీ అధికారపగ్గాలు చేపట్టాక.. అవినీతిపరులందరినీ శాశ్వతంగా జైలుకు పంపుతామని హెచ్చరించారు. కాంగ్రెస్, టీఎంసీ పార్టీలు అవినీతి విషయంలో ఒకే నాణేనికి రెండు ముఖాల్లాంటివని మోదీ ఎద్దేవా చేశారు. "టీఎంసీ, కాంగ్రెస్, వామపక్షాలు.. వేర్వేరు పార్టీలుగా కనిపించినా, ఆ పార్టీలు చేసిన పాపాలు ఒకటే. అందుకే ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి" అన్నారు.

మోదీకి ఓటేయొద్దన్న ప్రభుత్వ టీచరు అరెస్టు

పట్నా, మే 19: ప్రధాని నరేంద్ర మోదీకి ఓటు వేయకూడదంటూ విద్యార్థులకు చెప్పిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడ్ని అరెస్టు చేసినట్టు బిహార్ రాష్ట్ర అధికారులు తెలిపారు. ముజఫర్‌నగర్ జిల్లా కుర్హానీ సమితి అమ్రఖ్‌లోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలలో పనిచేస్తున్న హరేంద్ర రజక్‌పై ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. ఉచిత రేషన్ పేరుతో మనుషులు తినడానికి పనికిరాని బియ్యం పంపిణీ చేస్తున్నందున మోదీకి ఓటు వేయడకూడదని ఆయన తరగతి గదిలో విద్యార్థులకు చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డీఈఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరూ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదని, ఆ టీచరు దీన్ని ఉల్లంఘించడంతో కేసు పెట్టి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

నాణ్యత లోపించిన పతంజలి సోం పాపిడి

» బాబా రామ్‌దేవ్ కంపెనీ అధికారి సహా ఇద్దరికి జైలుశిక్ష

న్యూఢిల్లీ, మే 19: ఉత్తరాఖండ్‌లోని పిథోరాఘర్‌లో నాణ్యత లేని సోం పాపిడి విక్రయిస్తున్నందుకు పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సహా మరో ఇద్దరికి పిథోరాఘర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శనివారం ఆరు నెలల జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. పిథోరాఘర్‌లోని లీలాధర్ పాఠక్ అనే వ్యాపారి దుకాణంలో విక్రయానికి ఉంచిన పతంజలి నవరత్న ఎలియాచి సోం పాపిడిలో నాణ్యత లేదని ఫిర్యాదులు రావడంతో స్థానిక ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్ 2019లో నమూనాలు సేకరించారు. వాటికి ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రయోగశాలలో పరీక్షలు జరిపి నాణ్యత లోపించినట్లు గుర్తించారు.

డ్రైనేజీ పనులు చేస్తూ మరణిస్తే రూ.30లక్షలు

న్యూఢిల్లీ, మే 19: చేతులతో డ్రైనేజీ పనులు చేస్తూ పారిశుద్ధ్య కార్మికుడు మరణిస్తే అతని కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. 2023లో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చిందని, దీన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. వారి కుటుంబానికి తగిన పునరావాసం కూడా కల్పించాల్సి ఉంటుందని పేర్కొంది. ఢిల్లీలోని లజపత్ నగర్‌లో డ్రైనేజీ పనులు చేస్తూ 2017లో మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు రూ.30 లక్షల వంతున పరిహారం చెల్లించాలని ఆదేశించింది.



స్పెయిన్, పోర్చుగల్ దేశాల గగనతలంలోకి శనివారం అర్ధరాత్రి నీలిరంగు కాంతులను వెదజల్లుతూ ఓ భారీ ఉల్క దూసుకువచ్చింది. రాత్రి సమయం కావడంతో ఈ ఉల్క స్పష్టంగా కనిపించింది. ఉల్క వెలుగు కొన్ని వందల కిలోమీటర్ల దూరం కనిపించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. అది గాల్లో దూసుకువెళ్తున్న వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అవి వైరల్ అయ్యాయి.

కాంగ్రెస్‌లో మమత చిచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

అధీర్ చౌదరి వైఖరితో అధిష్ఠానం ఏకీభవించడం లేదన్నారు. ఖర్గే ఘాటుగా హెచ్చరించినప్పటికీ అధీర్ ఏమాత్రం లెక్క చేయలేదు. మమత విషయంలో తన వైఖరి మారదని మరోసారి స్పష్టం చేశారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై తనకు నమ్మకం లేదని, ఆమె బీజేపీ వైపు వెళ్లవచ్చని కాంగ్రెస్ నేత అధీర్ చౌదరి చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందించారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది పార్టీ అధిష్ఠానమే తప్ప అధీర్ కాదని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమికి బయటి నుంచి మద్దతిస్తానని మమత బెనర్జీ చెప్పారు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు ఎదురయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనూ కమ్యూనిస్టులు బయటి నుంచి మద్దతిచ్చారు' అని ఖర్గే గుర్తుచేశారు. అయితే ఇక్కడ నిర్ణయాలు తీసుకునేది అధీర్ చౌదరి కాదని.. కూటమి విషయంలో ఏదైనా కాంగ్రెస్ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ పాటించాల్సిందేనని, అలా చేయని వారు బయటకు వెళ్లవచ్చని ఘాటుగానే హెచ్చరించారు. ముంబైలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ.. మమత ఇండియా కూటమిలో భాగమేనని అన్నారు.

ఎవరు చెప్పినా వినను: అధీర్

ఇండియా కూటమిలో మమత పాత్రపై ఖర్గే స్పష్టమైన ప్రకటన చేసినప్పటికీ.. టీఎంసీ అధినేత్రిపై కాంగ్రెస్ నేత అధీర్ చౌదరి విమర్శలు కొనసాగించారు. ఎవరు ఏం చెప్పినా.. సీఎం మమత, ఆమె పార్టీపై విమర్శలు కొనసాగిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. తనను, కాంగ్రెస్ పార్టీని అంతం చేయాలనుకున్న మమత గురించి తాను సానుకూలంగా మాట్లాడలేనని తేల్చిచెప్పారు. 'పార్టీ సేవకుడిగా నా పోరాటాన్ని ఆపలేను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. టీఎంసీకి వ్యతిరేకంగా నా ఈ పోరాటం సైద్ధాంతిక పోరాటం. బెంగాల్‌లో పార్టీని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో టీఎంసీ, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయి' అని అన్నారు.

బెంగాల్‌లో ఖర్గే పోస్టర్లు ధ్వంసం

పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ చౌదరిపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడిన మరుసటి రోజే.. ఆ రాష్ట్రంలో ఖర్గే పోస్టర్లు ధ్వంసమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఎదుట ఖర్గే పోస్టర్లు, హోర్డింగులపై నల్ల రంగు పూసిన గుర్తు తెలియని వ్యక్తులు.. వాటిపై 'తృణమూల్ కాంగ్రెస్ ఏజెంట్' అని రాశారు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగి ఉండొచ్చని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేతలు, అధీర్ చౌదరి మధ్య విభేదాలు సృష్టించాలనే ఉద్దేశంతో టీఎంసీనే ఈ పని చేసి ఉంటుందని కాంగ్రెస్ నేత ఒకరు ఆరోపించారు. ప్రస్తుతం బహరంపూర్‌లో ఉన్న అధీర్ చౌదరి కూడా ఈ సంఘటనపై అసంతృప్తి వ్యక్తం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారని పేర్కొన్నారు.



పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలో ఖర్గే ఫొటోకు నల్లరంగు పూసిన దుండగులు

'ఇండియా' అధికారంలోకి రాగానే సీబీఐ, ఈడీలకు తాళాలు!

» సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్

న్యూఢిల్లీ, మే 19: ప్రతిపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాగానే సీబీఐ, ఈడీ కార్యాలయాలకు తాళాలు వేయాలని తాను ప్రతిపాదిస్తానని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ చెప్పారు. ఒక ఆంగ్ల పత్రిక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'సీబీఐ, ఈడీ మూతపడాల్సిందే. ఎవరైనా మోసానికి పాల్పడితే నిగ్గు తేల్చడానికి ఐటీ శాఖ ఉంది. ఇక సీబీఐ ఎందుకు? ప్రతి రాష్ట్రానికీ అవినీతి నిరోధక శాఖ ఉంది. అవసరమైతే దాన్ని ఉపయోగించుకోవచ్చు. బీజేపీ రాజకీయ ప్రత్యర్థుల పైకి మాత్రమే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా, కూల్చాలన్నా వాటిని వినియోగిస్తున్నారు. సీబీఐ, ఈడీలను ప్రయోగించి బీజేపీ ఏ విధంగా దోపిడీకి పాల్పడిందో ఎన్నికల బాండ్ల వ్యవహారం బట్టబయలు చేసింది' అని అఖిలేశ్ యాదవ్ వివరించారు.

యూపీలో బీజేపీకి ఒక్క సీటే



ప్రయాగ్‌రాజ్‌లో అభిమానులతో రాహుల్ సెల్ఫీ

ప్రయాగ్‌రాజ్(యూపీ), మే 19: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఒకే ఒక్క స్థానంలో గెలుస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అలహాబాద్ లోక్‌సభ స్థానం ఇండియా కూటమి అభ్యర్థి, కాంగ్రెస్ నేత ఉజ్వల్ రమణ్ సింగ్‌కు మద్దతుగా ప్రయాగ్‌రాజ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీతోపాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'మీరు ఇది విన్నారా? నరేంద్రమోదీ బీజేపీ కోసం ఉత్తరప్రదేశ్‌లో క్యోటో(వారాణసీ) సీటును మాత్రమే గెలుస్తున్నారు' అని అన్నారు. వారాణసీని జపాన్‌లోని సుందర నగరం క్యోటోలా తీర్చిదిద్దుతానని ప్రధాని మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను రాహుల్ ఎద్దేవా చేశారు. అంతకుముందు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. కరోనా టీకాతో ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పెట్టిన బీజేపీ ఇప్పుడు రాజ్యాంగంపై దాడి చేస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ప్రయాగ్‌రాజ్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఫూల్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో తొక్కిసలాట జరిగింది. రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ ఇద్దరు ఈ సభకు హాజరవ్వగా ఇరుపార్టీల కార్యకర్తలు వేదిక దగ్గరకు వచ్చేందుకు యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. కార్యకర్తలు, అభిమానులు ప్రశాంతంగా ఉండాలని రాహుల్, అఖిలేష్ పలుమార్లు కోరినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో చేసేది లేక ఎలాంటి ప్రసంగం చేయకుండానే ఇరువురు నేతలు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని ముంగారీకి వెళ్లిన వారికి అక్కడ కూడా ఇదే అనుభవం ఎదురైంది. ముంగారీలో సభలో తోపులాట జరిగింది.



వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

» అరెస్టులతో ఆప్‌ను నాశనం చేయలేరు

» ప్రధాని మోదీకి కేజ్రీవాల్ హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 19: ఒక్క కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే భరతమాత వేలాది మంది కేజ్రీవాల్‌లకు జన్మనిస్తుందని ప్రధాని మోదీని ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరించారు. అరెస్టుల ద్వారా ఆప్‌ను నాశనం చేయలేరని, ఆప్ ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక ఆలోచనాధార అని చెప్పారు. ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో బీజేపీ ప్రధాన కార్యాలయం ముట్టడికి కేజ్రీవాల్ శనివారం పిలుపునిచ్చారు. పార్టీ కీలక నేతలను అరెస్టు చేసి జైలుకు పంపించటం ద్వారా ఆప్‌ను నాశనం చేయాలని మోదీ కుట్ర పన్నారని, అందుకే బీజేపీ హెడ్‌ఆఫీసుకు అందరమూ వస్తామని, తమలో ఎవరినైనా అరెస్టు చేసుకోవచ్చంటూ మోదీకి సవాల్ విసిరారు. ఈ మేరకు బీజేపీ ఆఫీసుకు ఆప్ నేతలు, కార్యకర్తలతో కలిసి కేజ్రీవాల్ ఆదివారం మధ్యాహ్నం తరలివెళ్లారు. వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఆప్ వేగంగా ఎదగటాన్ని చూసి మోదీ తట్టుకోలేకపోతున్నారని, పార్టీని నాశనం చేయటానికి 'ఆపరేషన్ ఝూడూ (చీపురు)'ను ప్రారంభించారన్నారు. దాంట్లో భాగంగానే తనతోపాటు పార్టీ ముఖ్య నేతలను జైలుకు పంపించారని, మరింత మంది ఆప్ నాయకులను అరెస్టు చేయనున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని తీవ్రమైన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని ఎదుర్కోవటానికి ఆప్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారని, పార్టీ ఆఫీసును కూడా లాక్కొని రోడ్డు మీదికి ఈడుస్తారని.. వాటన్నింటికీ సిద్ధంగా ఉండాలని ఆప్ శ్రేణులకు సూచించారు. నిరసన కార్యక్రమంలో ఆప్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఢిల్లీ మంత్రులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, స్వాతిమలివాల్‌పై దాడికి సంబంధించి బిభవ్‌కుమార్‌ను ఢిల్లీలోని స్థానిక కోర్టు ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు సీఎం నివాసంలోని సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సంపదలో రాజును మించిన సునాక్ జంట

» యూకే ప్రధాని దంపతుల ఆస్తులు రూ.6,867 కోట్లు



లండన్, మే 19: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, సతీమణి అక్షతా మూర్తి సంపదలో ఆ దేశ రాజు చార్లెస్-3ను అధిగమించారు. బ్రిటన్‌లో నివసిస్తున్న తొలి వెయ్యి మంది సంపన్నులు/కుటుంబాల నికర సంపద ఆధారంగా సండే టైమ్స్ వార్తా పత్రిక ధనవంతుల జాబితాను తాజాగా విడుదల చేసింది. గతేడాది ఇందులో 275వ స్థానంలో నిలిచిన సునాక్ దంపతులు.. ఈసారి 245వ స్థానానికి ఎగబాకారు. ఇక కింగ్ చార్లెస్ మాత్రం తాజా జాబితాలో 258వ స్థానంలో నిలవడం గమనార్హం. 2023లో సునాక్ దంపతుల సంపద 529 మిలియన్ పౌండ్లు ఉండగా.. ఏడాదిలో 651 మిలియన్ పౌండ్ల (రూ.6,867 కోట్లు)కు పెరిగింది. అదే చార్లెస్-3 సంపద 600 మిలియన్ పౌండ్ల నుంచి 610 మిలియన్ పౌండ్ల (రూ.6,435 కోట్ల)కు మాత్రమే పెరిగింది. తండ్రి నారాయణమూర్తి భారత కంపెనీ ఇన్ఫోసిస్‌లో అక్షతా మూర్తికి అధిక షేర్లు ఉన్న నేపథ్యంలోనే వారి సంపద గణనీయంగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

దళిత విద్యార్థుల అడ్మిషన్లు 44% పెరిగాయి!

న్యూఢిల్లీ, మే 19: షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల అడ్మిషన్లు 2014 నుంచి 2022వ సంవత్సరం నాటికి 44 శాతం పెరిగాయని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ వెల్లడించింది. అదే సమయంలో దళిత బాలికల అడ్మిషన్లు 51 శాతం, మైనారిటీ బాలికల అడ్మిషన్లు 42.3%, గిరిజన విద్యార్థుల అడ్మిషన్లు 65.2 శాతం, గిరిజన బాలికల అడ్మిషన్లు 80 శాతం, ఓబీసీ విద్యార్థుల అడ్మిషన్లు 45 శాతం, ఓబీసీ బాలికల అడ్మిషన్లు 49.3 శాతం పెరిగాయని తెలిపింది. 2014-15లో 46.1 లక్షల మంది ఎస్సీ విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చేరగా, 2021-22లో ఆ సంఖ్య 66.2 లక్షలకు చేరిందని తెలిపారు. అలాగే, 2014-15లో 10.7 లక్షల మంది మైనారిటీ బాలికలు వివిధ విద్యాసంస్థల్లో చేరగా, 2021-22లో ఆ సంఖ్య 15.2లక్షలకు పెరిగింది. 2014-15లో 16.41 లక్షలమంది ఎస్టీ విద్యార్థులు విద్యాసంస్థల్లో చేరగా, 2021-22లో వారి సంఖ్య 27.1 లక్షలకు పెరిగింది. ఇక 2021-22లో 1.63 కోట్ల మంది ఓబీసీ విద్యార్థులు విద్యాసంస్థల్లో చేరారు. 2020-21లో సెంట్రల్ స్కూళ్ల లో ఓబీసీలకు 27% రిజర్వేషన్లు అమలుతో 34,133 మంది ఓబీసీ పిల్లలు అడ్మిషన్లు పొందగలిగారు.

8 రాష్ట్రాలు.. 49 స్థానాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేఠీ నుంచి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, రాజధాని లఖ్‌నవూ నుంచి మూడోసారి బరిలోకి దిగుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, శరణ్ (బిహార్)లో బీజేపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ, హాజీపూర్‌లో రాంవిలాస్ పాసవాన్ కుమారుడు చిరాగ్ పాసవాన్ వంటివారు ఈ దశలో పోటీపడుతున్న ప్రముఖుల జాబితాలో ఉన్నారు. ఈ 49 స్థానాల్లో ఎన్డీయే, ఇండియా కూటమికి మధ్య పోటీ హోరాహోరీ సాగుతుండడంతో ఐదో దశ బీజేపీకి కీలకంగా మారింది. ముఖ్యంగా మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 39 స్థానాలు బీజేపీకి అగ్నిపరీక్షగా మారాయి. కీలక నియోజకవర్గాల వారీగా చూస్తే.. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గత ఎన్నికల్లో పోటీ చేసిన రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి ఈసారి ఆమె తనయుడు రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. రాహుల్ గతంలో పోటీ చేసిన అమేఠీ నుంచి గాంధీ కుటుంబ విధేయుడు కేఎల్ శర్మ.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఢీకొంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ-కాంగ్రెస్ కూటమి రాజకీయంగా బలం పుంజుకున్న రీత్యా ఈ రెండు నియోజకవర్గాల్లోనే కాక ఎన్నికలు జరుగుతున్న 14 నియోజకవర్గాల్లో హోరాహోరీ పోరు జరిగే అవకాశాలున్నాయి. ఇక, మహిళా అథ్లెట్లపై లైంగిక అత్యాచారాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత కుస్తీ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఈసారి కైసర్‌గంజ్ నుంచి బీజేపీ టికెట్ ఇవ్వకుండా ఆయన కుమారుడిని రంగంలోకి దించింది. అయోధ్య రామమందిరం కొలువై ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నేత లల్లూ సింగ్, ఎస్పీ నేత అవధేశ్ ప్రసాద్ మధ్య పోటీ బలంగా ఉన్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. లఖ్‌నవూలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎస్పీ నేత రవిదాస్ మెహ్రోత్రా మధ్య ప్రధానంగా పోటీ ఉంది.



రాష్ట్రం	స్థానాలు
ఝార్ఖండ్	3
ఒడిశా	5
ఉత్తరప్రదేశ్	14
బిహార్	5
మహారాష్ట్ర	13
పశ్చిమబెంగాల్	7
లద్దాఖ్	1
జమ్ముకశ్మీర్	1

మరాఠా గడ్డపై...

అయిదో దశలో బీజేపీకి అత్యంత కీలకమైన మహారాష్ట్రలో 14 స్థానాల్లో కమలనాథులకు ప్రతికూల పవనాలు వీస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోనే కనీసం ఏడు స్థానాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. రెండుగా చీలిపోయిన శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలలో ఎవరిది నిజమైన పార్టీగా ప్రజలు గుర్తిస్తారో ఈ ఎన్నికలలో తేలనుంది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సహా పలువురు బీజేపీ నేతలు ఈ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. కాగా, ఈ దశలో బిహార్‌లో 5 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య.. బీజేపీ దిగ్గజం రాజీవ్ ప్రతాప్ రూడీకి గట్టి పోటీ ఇస్తున్నారు. లోక్‌జనశక్తి నేత చిరాగ్ పాసవాన్ హాజీపూర్‌లో ఎన్డీయే తరఫున పోటీ చేస్తుండగా.. ఆయన ప్రత్యర్థిగా లాలూ కుడిభుజం శివ చంద్రరామ్ బరిలో ఉన్నారు. అలాగే.. జార్ఖండ్‌లో సోమవారం ఎన్నికలు జరగనున్న హజారీబాగ్, కొడెర్మా, చత్రా సీట్లను గత ఎన్నికల్లో బీజేపీ గెలుచుకుంది. హజారీబాగ్‌లో కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించినప్పటికీ ఈసారి బీజేపీ ఆయనకు టికెట్ కేటాయించలేదు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న గాండే అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ జేఎంఎం నుంచి పోటీ చేస్తుండగా ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ దిలీప్ వర్మ అనే స్థానికుడిని రంగంలోకి దింపింది.

తూర్పు తీరాన..

పశ్చిమబెంగాల్‌లో అత్యంత కీలకమైన హుగ్లీ, హౌరా, ఆరాంబాగ్, సేరంపూర్, బంగాన్‌లో తృణమూల్ కాంగ్రెస్- బీజేపీ మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఆ రాష్ట్రంలో 57.19 శాతం పైగా పోలింగ్ బూత్‌లను సున్నితమైనవిగా ఈసీ గుర్తించడంతో అక్కడ భారీగా కేంద్ర బలగాలను దించారు. ఇటు ఒడిసాలో ఐదో దశలో పోలింగ్ జరిగే 5 స్థానాలనూ బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఈ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న నేతల్లో 13 మంది కోట్లకు పడగెత్తినవారేనని ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది.ఇక జమ్ముకశ్మీర్‌లో బారాముల్లా నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ తరఫున మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా బరిలో ఉన్నారు.

హెలికాప్టర్ ప్రమాదంలో.. ఇరాన్ అధ్యక్షుడు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

హెలికాప్టర్‌లో బయలుదేరారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మరో రెండు హెలికాప్టర్లు కూడా ఆయన చాపర్ వెంట ఉన్నాయి. మధ్యాహ్నానికి తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని పర్వత ప్రాంతాలు, డిజ్మార్ అటవీ ప్రాంతాన్ని దాటే క్రమంలో.. జోల్ఫా గ్రామం సమీపంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఆ సమయంలో జోల్ఫాతోపాటు.. ఉజి, అర్దేషిరి, బారాజిన్ గ్రామాలతోపాటు.. డిజ్మార్ అటవీ ప్రాంతాల్లో భీకర వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు, దట్టమైన పొగమంచుతో వాతావరణం ప్రతికూలంగా మారింది. మరో రెండు హెలికాప్టర్లు గమ్యస్థానానికి చేరుకున్నా.. రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జాడ లేకపోవడంతో.. ఆదివారం సాయంత్రం నుంచి ఇరాన్ వ్యాప్తంగా టెన్షన్ నెలకొంది. కాసేపటికి తూర్పు అజర్‌బైజాన్ గవర్నర్ మాలిక్ రహ్మతి "అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయింది" అని ప్రకటించారు. అయితే.. ఇరాన్ అధికారిక మీడియా, ప్రభుత్వ అధికారులు మాత్రం.. "రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జోల్ఫా ప్రాంతంలో హార్డ్ ల్యాండింగ్ అయ్యింది" అని తెలిపారు. అధ్యక్షుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో విదేశాంగ మంత్రి, పైలట్, కోపైలట్, అధ్యక్షుడి భద్రతా బృందం అధిపతి, అంగరక్షకులు, అధికారులు ఉన్నట్లు వివరించారు.

ప్రతికూల వాతావరణంలో గాలింపు

హెలికాప్టర్ హార్డ్ ల్యాండింగ్ సమాచారం అందగానే.. సైన్యం, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ), రెడ్ క్రెసెంట్‌తోపాటు.. మొత్తం 20 బృందాలు గాలింపు ప్రారంభించాయి. భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా గాలింపులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని, కొండ ప్రాంతాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారిపోయి, వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు పేర్కొన్నారు. కాగా.. రైసీ క్షేమంగా తిరిగి రావాలంటూ ఇరాన్ వ్యాప్తంగా ప్రజలంతా ప్రార్థనలు చేయాలంటూ అధికారులు ప్రసార మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. ఇరాన్ మిత్ర దేశాలు కూడా రైసీ క్షేమ సమాచారం కోసం ప్రార్థనలు చేస్తున్నాయి. ప్రధాని మోదీ కూడా ఇరాన్ అధ్యక్షుడు రైసీ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇరాన్ వద్ద హెలికాప్టర్లన్నీ కాలం చెల్లినవని తెలుస్తోంది. 1979 నాటి ఇస్లామిక్ రివల్యూషన్ సమయంలో ఉన్న హెలికాప్టర్లే ఇప్పటికీ సైన్యంలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఇరాన్ వాటి విడిభాగాలను కూడా దిగుమతి చేసుకోలేని పరిస్థితులున్నాయి. ఆదివారం రైసీ ప్రయాణించిన హెలికాప్టర్ కూడా కాలం చెల్లిందే కావడంతో ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేక ప్రమాదం జరిగి ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



గాలింపు చర్యల్లో ఇరాన్ సైన్యం

సుప్రీంలీడర్‌కు నమ్మిన బంటు!


హెలికాప్టర్ ప్రమాదంలో గల్లంతైన రైసీ వయస్సు 63 సంవత్సరాలు. ఆయన అధ్యక్ష పదవిని చేపట్టక ముందు న్యాయశాఖకు నేతృత్వం వహించారు. 1988లో ఇరాక్-ఇరాన్ యుద్ధం సందర్భంగా చిక్కిన ఖైదీలకు సామూహికంగా మరణశిక్ష విధించి, అమలు చేశారు. వీరిలో మైనర్లు కూడా ఉండడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతూ.. రైసీపై ఆంక్షలు విధించింది. 2015 నుంచి ఇరాన్‌లో అణ్వాయుధాలకు కావాల్సిన యురేనియం(వెపన్ గ్రేడ్) తయారీలో కీలక పాత్ర పోషించారు. 2017 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 2021 ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించారు. అయితే.. 2021లో అత్యల్పంగా ఓటింగ్ జరిగి, 2.89 కోట్ల మంది పౌరులు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికలో రైసీ 62% ఓట్లను సాధించి, అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. హమాస్, హౌతీ, హిజ్బుల్లా, ఇస్లామిక్ జిహాద్ ఉగ్రసంస్థలకు అండదండలను అందజేశారనే ఆరోపణలున్నాయి. హమాస్‌కు మద్దతుగా గత నెల ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడుల్లోనూ రైసీది కీలక పాత్ర.



ఆదివారం ఉదయం అజర్‌బైజాన్ వద్ద హెలికాప్టర్ దిగిన రైసీ

లోకం తీరు





కల్యాణవేదికపై అనంతలక్ష్మీదేవితో వీరవేంకటసత్యనారాయణస్వామి

అంగరంగ వైభవంగా సత్యదేవుని కల్యాణం

అన్నవరం, మే 19: కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి దివ్య కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామి, అనంతలక్ష్మి అమ్మవారి పరిణయాన్ని వీక్షించడానికి భక్తజనం తరలివచ్చారు. ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్ దంపతులు పండితులకు దీక్షావస్త్రాలను అందజేశారు. ఈ వివాహ కార్యక్రమానికి సీతారాములు పెళ్లిపెద్దలుగా వ్యవహరించడంతో మరో వేదికపై వారిని ఆసీనులు గావించారు. సుముహూర్త వేళ భక్త రక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి,అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు ఉంచారు. రాత్రి 10.30 గంటల తర్వాత భక్తజన గోవింద నామస్మరణ మధ్య మాంగల్యం తంతునా నేనా... లోకరక్షణ హేతునా అంటూ స్వామి, అమ్మవారి మెడలో మూడుముళ్లు వేశారు. ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ వేడుక కలిగించారు. పట్టు పీతాంబ్రాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి,అమ్మవార్లు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీశైలంలో భక్తజన సందోహం

రద్దీగా ఆలయ ప్రధాన వీధులు.. ట్రాఫిక్ జామ్‌తో భక్తులకు ఇబ్బందులు



స్వామి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులు

శ్రీశైలం, మే 19: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రధాన వీధులన్నీ రద్దీగా మారాయి. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు కిక్కిరిసి కనిపించాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం నుంచే భక్తులు బారులు దీరారు. కల్యాణ కట్టలో స్వామి వారికి తలనీలాలు సమర్పించి పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, తాగునీరు అందజేశారు. దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు దర్శనం, ఆర్జిత సేవ క్యూలైన్లు, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

శ్రీశైలం క్షేత్రంలోని టోల్‌గేట్ సర్కిల్ వద్ద వాహనాల రద్దీ



వచ్చి పోయే వాహనాలన్నీ ఒకే చోటకు

వేసవి సెలవులు, పైగా ఆదివారం.. దీంతో భక్తులు వేలాది వాహనాల్లో రావడంతో క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దేవస్థానం టోల్‌గేట్ సర్కిల్ వద్ద అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. టోల్‌గేట్ వద్ద నుంచి వచ్చిన వాహనాలను రింగ్ రోడ్డు వైపు మళ్లించాల్సి ఉంది. మరో వైపు రింగ్ రోడ్డు రెండో దారి నుంచి బయటకు తిరిగి వెళ్లే వాహనాలు కూడా టోల్‌గేట్ సమీపంలోనే నిలిచిపోయాయి. వచ్చి పోయే వాహనాలన్నీ ఒకే చోటకు చేరే సరికి ట్రాఫిక్ సమస్య నెలకొంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో దేవస్థానం సెక్యూరిటీ, హోంగార్డు సిబ్బంది విఫలమయ్యారు. వేసవి సెలవుల కారణంగా శ్రీశైలంలో భక్తుల రద్దీ కొనసాగుతున్నట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి

ముగిసిన పద్మావతీ పరిణయోత్సవం

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మూడు రోజులుగా నిర్వహించిన పద్మావతీ శ్రీనివాసుల పరిణయ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. సాయంత్రం ఆలయం నుంచి శ్రీవారు గరుడ వాహనంపై, దేవేరులు పల్లకీపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపానికి వేంచేశారు. ఎదుర్కోలు, పూలచెండ్లాట, నూతన వస్త్ర సమర్పణ తదితర కల్యాణ వేడుకలు ఘనంగా ముగించిన తర్వాత కొలువు జరిగింది. వేదపారాయణం తరువాత కళాకారులు అన్నమయ్య కీర్తలను ఆలపించారు. ఉత్సవమూర్తులు తిరిగి ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవం వైభవంగా ముగిసింది.

ఏపీఈఏపీసెట్‌కు 95.12 % హాజరు

జేఎన్టీయూకే, మే 19: ఏపీఈఏపీసెట్-2024 ఇంజనీరింగ్ విభాగం ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకోసం మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 30,275 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,799మంది హాజరయ్యారని 1476 మంది గైర్హాజరు కాగా మొత్తం 95.12 శాతం హాజరు నమోదైందన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయని తెలిపారు.



కప్పస్తంభం వద్ద జస్టిస్ సందీప్ మెహతా దంపతులు

అప్పన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, మే 19: సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా సతీ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ మర్యాదదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని విశిష్ఠ కప్పస్తంభాన్ని న్యాయమూర్తి ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణగా అంతరాలయంలో పూజలు నిర్వహించుకున్నారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేద స్వస్తివచనాలతో ఆశీర్వచనాలీయగా, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత న్యాయమూర్తిని శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ ప్రవీణ్‌కుమార్

శ్రీవారి సేవలో జస్టిస్ సురేష్‌రెడ్డి

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

भारत सरकार - अंतरिक्ष विभाग / GOVERNMENT OF INDIA - DEPARTMENT OF SPACE
निर्माण एवं अनुरक्षण समूह, एसडीएससी-शार / CONSTRUCTION AND MAINTENANCE GROUP, SDSC-SHAR
श्रीहरिकोटा / नेल्लूर (जिला), आं.प्र. / SRIHARIKOTA - 524124

संक्षिप्त ई–निविदा सूचना / Brief E-TENDER NOTICE

ई–निविदा सूचना सं. / e- Tender Notice No.CMG/C/CON/248706 तिथि/ Date. 15.05.2024

भारत के राष्ट्रपति की ओर से "एसडीएससी शार की एसएमपीसी यूनिट–2 में एस200 / एस139 / पीएसओएम–एक्सएल / एस139 द्विखंड एसएसएलवी एसएस1 मोटरों के संचकन स्थायिकों के भंडारण के संचकन स्थायिक सुविधा का निर्माण (सिविल एवं सड़क कार्य)" (₹539 लाख); के लिए ई–निविदा के माध्यम से मद दर निविदाएं आमंत्रित की जाती हैं। निविदा दस्तावेज 09.06.2024 को 14:30 बजे तक डाउनलोड किए जा सकते हैं। विस्तृत सूचना हेतु इच्छुक निविदाकार हमारी वेबसाइट www.isro.gov.in या www.tenderwizard.com/ISRO पर जाएं।

On behalf of President of India, Item Rate tenders are invited through e-tendering for **"Construction of Casting Fixtures Facility for storing casting fixtures of S200/S139/PSOM-XL/S139 Twin segment/SSLV SS1 motors at SMPC Unit-2, at SDSC SHAR (Civil & Road works)"** (₹539 Lakhs); Tender documents can be downloaded up to 09.06.2024, 14:30 hrs. Interested tenderers may visit www.isro.gov.in or www.tenderwizard.com/ISRO for details.

हस्ताक्षरित- समूह प्रधान, सीएमजी / एसडीएससी शार / Sd/- GROUP HEAD, CMG / SDSC SHAR

పంచాయతీ ఆఫీసులోనే మద్యపానం

- వైసీపీ సర్పంచ్ భర్త ఆధ్వర్యంలో మందు పార్టీ
- అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో దారుణం



పంచాయతీ కార్యాలయంలో మద్యం తాగుతున్న సర్పంచ్ భర్త (కుడివైపు వ్యక్తి)

పెద్దవడుగూరు, మే 19: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే వైసీపీ సర్పంచ్ భర్త దర్జాగా మందు పార్టీ చేసుకున్నారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలకేంద్రంలో ఆదివారం జరిగిందీ దారుణం. వైసీపీ మద్దతు సర్పంచ్ వరలక్ష్మి భర్త సుంకన్న ఆధ్వర్యంలో పలువురు పంచాయతీ కార్యాలయంలోపల దర్జాగా కుర్చీల్లో కూర్చుని మద్యం సేవించారు. తాత్కాలిక సిబ్బంది వద్ద కార్యాలయ తాళాలు ఉంచడంతో, వారి నుంచి తాళాలు తీసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం ఆ కార్యాలయంలోకి ప్రవేశించి, తలుపులు వేసుకుని చికెన్ ముక్కలు, వాటర్ బాటిళ్లు పక్కన పెట్టుకుని మద్యం తాగుతూ కనిపించారు. సాయంత్రం దాకా అక్కడే ఉన్నారు. మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకొని ఫొటోలు తీస్తుండగా.. 'కావాల్సినన్ని ఫొటోలు తీసుకోండి.. ఏమైనా రాసుకోండి' అంటూ సవాలు విసిరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మురళీధర్‌రెడ్డిని వివరణ కోరగా.. కార్యాలయ తాళాలు తాత్కాలిక సిబ్బంది వద్ద ఉండడం వల్లే ఇలా జరిగి ఉంటుందనీ, దీనిపై విచారణ జరుపుతామని తెలిపారు.

బంగారం అనుకొని మట్టుబెట్టారు!

- వృద్ధురాలిని హత్య చేసిన దొంగలు
- మృతురాలి రోల్డ్‌గోల్డ్ గాజులతో పరారీ

కొత్తపట్నం (ఒంగోలు నగరం), మే 19: వృద్ధురాలు చేతులకున్న రోల్డు గోల్డ్ గాజులను బంగారం అనుకున్న దొంగలు వాటిని కాజేస్తే పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవచ్చని భావించారు. ఆమెను హత్య చేసి గాజులు తీసుకొని పరారయ్యారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. కొత్తపట్నంలోని రెడ్డిపాలెం సెంటర్‌లో నివాసం ఉండే గుడిపల్లి నాగేశ్వరమ్మ (80) కల్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కుమారుడు ప్రకాశరావు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతంలో ఉంటూ వచ్చిపోతుంటారు. ఆయన నాలుగు రోజుల క్రితం తల్లికి రోల్డు గోల్డ్ గాజులు కొనిచ్చారు. వాటిని చేతులకు వేసుకున్న నాగేశ్వరమ్మ శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా లోపలికి ప్రవేశించిన దొంగలు ఆమెను గొంతునులిమి హతమార్చారు. అనంతరం చేతులకు ఉన్న నాలుగు రోల్డు గోల్డ్ గాజులు తీసుకున్నారు. చెవులకు ఉన్న బంగారు కమ్మలను బలవంతంగా లాగేయడంతో గాయమైంది. ఇంట్లో బీరువాను పగులగొట్టి విలువైన వస్తువుల కోసం వెతికి ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయాన్నే నాగేశ్వరమ్మకు కల్లు ఇచ్చేందుకు వచ్చిన వారు ఆమె విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించి కుమారుడికి సమాచారం ఇచ్చారు. ఏఎస్పీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, టూటౌన్ సీఐ జగదీష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జాగిలం కొత్తపట్నంలోని బస్టాండ్ సెంటర్, బ్యాంకు ఎదురుగా ఉన్న ఏటీఎం సెంటర్ ప్రాంతంలో సంచరించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ధర్మవరంరూరల్, మే 19: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలో సాగు కలిసిరాక, అప్పులు తీర్చలేక ఓ యువరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏలుకుంట్ల గ్రామానికి చెందిన గుట్టూరు బాలకృష్ణ(35) తనకున్న ఐదెకరాల్లో మామిడి సాగు చేశాడు. అంతరపంటగా వేరుశనగ పంట వేస్తుండేవాడు. రెండేళ్ల క్రితం తీవ్ర వర్షాభావంతో ఉన్న రెండు బోరుబావులు వట్టిపోయాయి. మరో రెండు బోర్లు వేయించినా కూడా అరకొరగా నీరు పడింది. ఆ నీరు పంటలకు చాలక మామిడి, వేరుశనగ పంటలు ఎండిపోయాయి. పంట పెట్టుబడుల కోసం బాలకృష్ణ రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. బోర్లు తవ్వించేందుకు భార్య పేరున మహిళా సంఘంలో రూ.50 వేలు, బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రూ.40 వేలు అప్పు తీసుకున్నాడు. పంటలు చేతికి రాక అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెంది, శనివారం అర్ధరాత్రి ఇంటి సమీపంలోని షెడ్డులో ఉరేసుకుని మరణించాడు.

చెరువులో ముగ్గురు మహిళల మృతదేహాలు

- ఇద్దరు మహబూబ్‌నగర్ వాసులుగా గుర్తింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: కర్నూలు మండలం గార్గేయపురం చెరువులో ఆదివారం మూడు మృతదేహాలు వెలుగుచూశాయి. దీంతో గార్గేయపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. స్థానికుల సమాచారంతో తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ వీరయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. మృతులను మొదట హిజ్రాలుగా అనుమానించిన పోలీసులు సమీపంలోని హిజ్రాలను పిలిపించి గుర్తించేందుకు ప్రయత్నించారు. చివరకు అవి మహిళలవని నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా.. మృతుల్లో ఇద్దరిని తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తు కోసం మూడు బృందాలను నియమించారు.



చిత్రంలో చూపించిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. చిత్రంలో చూపించిన యాక్సెసరీస్ స్టాండర్డ్ సామగ్రిలో భాగం కాదు. ఫీచర్స్ రంగులు మరియు రకాలతో వేరుగా ఉండవచ్చు. ఫైనాన్స్ ఆఫర్ ఫైనాన్సర్ యొక్క స్వంత నిర్ణయంపై ఆధారపడింది, దీని సంబంధిత నియమాలు మరియు షరతులపై ఆధారపడింది. #ఆధారం: జూన్ 2001 నుండి జూన్ 2023 వరకు బ్రాండ్ యాక్టివా యొక్క మొత్తం సేల్స్ సంఖ్య. *నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి.

కనీస వడ్డీ రేట్ @ 8.49%* | కనీస EMI ₹2499* | ₹3000* వరకు 5% ఇన్‌స్టంట్ క్యాష్‌బాక్ HDFC BANK | డీలర్ వివరాలు కోసం QR కోడ్ స్కాన్ చేయండి | ACTIVA 30 MILLION# HAPPY CUSTOMERS | CLICK BOOK RELAX

Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) - 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: **VIJAYAWADA:** Sri Santosh Honda - 7207333222, 8662544979; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda - 9703247365, 9703218817; **BHAVANIPURAM:** Vihari Honda - 9703218820; **NUZIVIDU:** Srishivani Honda - 7893194444, **KANCHIKACHERLA:** Sri Spandana Honda - 08678-273066, 8523034242; **VISSANNAPETA:** Aishwarya Honda - 08673-272722, 9000866319; **TIRUVURU:** Sri VenkataSatya Honda - 08673-295446, 8977836666; **ONE TOWN (VIJAYAWADA):** Anvita Honda - 8142941414; **GUDIVADA:** Pruthvi Honda - 8297642888, 9491803888; **KAANURU:** Sri Santosh Honda - 7207235566, 9908824249; **GANNAVARAM:** Sri Santosh Honda - 9912195558, 9391935558; **KAIKALURU:** Pruthvi Honda - 9642854888, 8297681888; **MACHILIPATNAM:** Nagasai Honda - 9676945616; **NANDIGAMA:** Apple Honda - 7660867722; **CHALLAPALLI:** Annapurna Honda - 8499900065; **VUYYURU:** Pruthvi Honda - 8142026888, 8297895888; **IBRAHIMPATNAM:** Leo Honda - 9348686966; **KANKIPADU:** Sri Santosh Honda - 9949422233; **HANUMAN JUNCTION:** Anvita Honda - 9515028062, 9985775959.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

దాసరి శిరీష జ్ఞాపికకు రచనల ఆహ్వానం

దాసరి శిరీష జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు ఎంపిక చేసిన ఒక రచనను ముద్రించి ఆ పుస్తకాలను ప్రతి ఏటా సెప్టెంబర్ 3న రచయితకు అందిస్తున్నారు. ఇందుకు మీ కథ/ కవిత్వం/ నవల/ జీవిత చరిత్ర/ ఆత్మ కథ సారాంశాన్ని జూన్ 5లోగా ఒక ఏ4 పేజీని మించకుండా dasarisireeshagnaapika2024@gmail.comకు పంపాలి. సినాప్సిస్ యూనికోడ్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో మాత్రమే ఉండాలి. ఏ ప్రక్రియకు చెందిన రచన అయినా 200 పేజీలు మించకుండా ఉండాలి. స్వీయ పరిచయంతో పాటు ఫోన్ నంబర్, చిరునామా కూడా మెయిల్ చేయాలి. కొత్త తరం రచయితలకు ప్రాధాన్యం ఉంటుంది.

అపర్ణ తోట

కాష్ఠం రగులుకుంది



నీటిలో సూర్యబింబాన్ని చూసినట్టు
రొట్టెలపై
అమ్మను చూసుకున్నాడు పసిపిల్లాడు

నీటిలో చంద్రబింబాన్ని చూసినట్టు
రొట్టెలపై
ప్రియురాలి మోమును చూసుకున్నాడొక ప్రియుడు

ఆ రెండు హృదయాలు
దొగ్గాడుతూ రొట్టెను అందుకునేలోపే
కాష్ఠం రగులుకుంది

ఇక అమ్మ లేదు, ప్రియురాలు లేదు,
రొట్టెలు రొట్టెల్లా లేవు. అంతా బూడిదే.

దుఃఖంతో, ఆకలి కేకలతో,
గాజా గుండెలు రగులుతుంటే
ఆ పసిహృదయాల పేగులు మండుతుంటే
సూర్యగోళం సైతం చిన్నబోయింది!
పేగులు పటపటమనే శబ్దానికి
ఉరుముల సత్తువ సన్నబోయింది!

దొంతం చరణ్
90002 15466

కథా సదస్సుకు ఆహ్వానం

తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, కాకినాడ, ఆంధ్ర ప్రదేశ్, జూన్ 9న నిర్వహించే ఒకరోజు కథా సదస్సులో పాల్గొనడానికి వర్ధమాన తెలుగు కథకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. రిజిస్ట్రేషన్ వివరాల కోసం జి.వి.కె. వర్మ- 9866145951 నంబర్‌లో సంప్రదించాలి. అభ్యర్థులు మే 25 లోపల పది పేజీలకు వి ుంచని కొత్త, అముద్రిత కథ పిడిఎఫ్‌ను అద్దేపల్లి ప్రభు వాట్సాప్ నంబర్ 98489 30203కి, ఓపెన్ ఫైల్‌ను prabhukkd@gmail.comకు పంపాలి. సదస్సులో తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, వాసిరెడ్డి నవీన్, అట్టాడ అప్పల నాయుడు, ఆలూరి విజయ లక్ష్మి, మహమ్మద్ ఖదీర్ బాబు, పెద్దింటి అశోక్ కుమార్, దాట్ల దేవదానం రాజు, శిఖామణి, వేంపల్లి షరీఫ్, జాన్సన్ చోరగుడి, జి. వెంకట కృష్ణల ప్రసంగాలు ఉంటాయి.

దాట్ల దేవదానం రాజు

లక్షల కాపీల కవితా సమాహారం

పాఠశాలలు కళాశాలల్లో చదివే విద్యార్థులను సాహిత్యం వైపు ఆహ్వానించేందుకు, మరో గ్రంథాలయ ఉద్యమ మహా ప్రయత్నం దిశగా విద్యార్థుల కోసం ఇప్పటివరకు ప్రముఖ కవులు రాసిన వచన కవితలను సూచించండి. మీరు రాసిన అచ్చయిన కవితలను పంపించండి. కవితలను student spoetr ybook2024@ gmail.comకు ఈమెయిల్ చేయండి. వివరాలకు: 9440995010.

పలమనేరు బాలాజీ

కొందరలాగే వెళ్ళిపోతారు



1
కొందరలాగే వెళ్ళిపోతారు
మనకిష్టమున్నా లేకున్నా
మనకేం కానట్టే వెళ్ళిపోతారు
మనలో రాత్రీపగళ్ళై పోతారు

వెళుతూ మనల్నీ వెంటబెట్టుకెళతారు
కన్నీటి ఎరుపు కమ్మిన లోగిళ్ళలోకి
గుప్పెడు మిణుగురుల్ని తోడిచ్చి
వెనక్కి పంపించేస్తారు
మిగుళ్లమిగుళ్లగా మనని చిందరచేసేస్తారు

2
కొందరలాగే వెళ్ళిపోతారు
ఉన్నక్షణానే లేకుండాపోయి
ఊపిరినీడను పరిచయం చేస్తారు
మళ్లెందుకో మనలోకి కాస్త కాస్తగా నడిచొస్తారు
గడ్డం కింద చేయాన్చి మనల్నే చూస్తుంటారు

కొన్ని వానల్ని, కొన్ని ఎండల్ని,
మధ్యమధ్యలో కొన్ని సంపెంగమొగ్గల్ని
వెంటేసుకుని మనతో తిరుగుతూనే ఉంటారు
కొన్ని ప్రశ్నలుగా, కొన్ని క్షమాపణలుగా,
కొన్ని పశ్చాత్తాపాలుగా
మనని మనముందే నిలేసిపోతారు

3
కొందరలాగే వెళ్ళిపోతారు
మనని మనకు కొంత అరువిచ్చిపోతారు
నలిగిపోయిన మెత్తనినవ్వులా ముడతలుపడి
నింగి నలుపునంతా దించిపోతారు
నడివేసవి మిట్టమధ్యాన్నం అడవి ఆవులింతలా
ఉడుకుడుకు నిశ్శబ్దమై పెనవేసుకుపోతారు

తిప్పేసిన పేజీల్లోంచి తిరగదోడుకున్న పాటలపంక్తులై
రాగాలు దొరకని స్వరాల్లా జాలిచూపులు చూస్తుంటారు
ఒక్కోసారి- ఇంద్రధనుస్సు కూడా ఎరుగని
సిత్రచిత్రవర్ణాల్ని పోగేసుకొచ్చి
మనం పట్టనంతటి ముఖచిత్రమైపోతుంటారు

4
కొందరలాగే వెళ్లిపోతారు
చివరికలను ఎవరు చేదేసుకున్నారో
చివరినిద్రనెవరు కప్పేశారో
పొదుగు కట్టిన పొత్తిళ్లలోంచి
ఆఖరి నిశ్వాసను గాలికెవరు రాసిచ్చేశారో
చెప్పేవారెవరూ ఉండరు

కానీ, ఏ దీపస్తంభాలకోనలో
ఏ చివరికుటీరం కౌగిళ్ళు విప్పుకుంటుందో మరి
వాళ్లు ఒక్కో ఆకాశాన్ని గెలుచుకుంటూపోతుంటారు
ఆ గుప్పెడు చెలమల్ని దాటించే దొప్పల కోసం
మనం చెట్టూపుట్టాపట్టి, మెరుపులుడిగిన జ్ఞాపకాల్ని
జీవహరితం మీంచి ఒలుచుకుంటూ పోతుంటాం

5
కొందరలాగే వెళ్ళిపోతుంటారు
ఎంతకీ ఎత్తి అవతలకు పారబోయలేని
నదిలా మనలో నిండిపోతుంటారు
ఉండుండి పంటకాలువలై సన్నగా పారుతూ
మనకాలాలకిన్ని వరికంకుల్ని కట్టిపోతుంటారు

పోతూ పోతూ వెనక్కి చూసి-
ఎంతెంత కేరింతల్లో పండినా
మనమెంత పేదలమో
ఎన్ని యుద్ధాల్ని దాటుకుంటూ ప్రవహిస్తున్నా
ఎంతటి పరాజితులమో
చెప్పే ఓ నవ్వు రువ్విపోతారు

6
కొందరలాగే వెళ్ళిపోతారు
వాళ్ళు మనమేనాడు చేతుల్లోకి తీసుకోని పుస్తకాలైనా
కొత్త ఇతిహాసాల్లో ఇమడ్చడానికి
పంచభూతాలు పల్లకీ ఎక్కించుకెళుతుంటే
మహావాక్యాల్లా, మనం పోగొట్టుకున్న
మహానిర్వచనాల్లా రాజసాలు పోతుంటారు

ఉన్నట్టుండి తెగిపోయిన సముద్రాలకు
కెరటాలను కుట్టుకుంటూ మనం..
వాళ్ళకోసం చివరిసారి పట్టినట్టే
నిత్యప్రవాహాల్ని కాచుకోవడానికి
భుజాలు పదును పెట్టుకుంటుంటాం

7
కొందరలాగే వెళ్ళిపోతారు
మన వెన్ను చుట్టూ వాడిపోయిన
మరువపుదండల్లా మిగిలిపోతారు
… … …
వాళ్ళా జీవితాన్ని ఇష్టపడ్డవాళ్లే కనుక
తమ నీడలన్నిటినీ శుభ్రంగా చిమ్మేసి
మన వాకిళ్ళను మనకిచ్చేసిపోతారు

యార్లగడ్డ రాఘవేంద్ర రావు
77309 21820

వాక్యంతో భయాన్ని వేటాడిన హెమింగ్వే

హెమింగ్వే అమెరికన్ వాక్యానికి రూపురేఖలు మార్చేసాడు అంటారు. అర ఠావు పొడవున, మెలికలతో, విశేషణాలతో, అడుగడుక్కీ విరామచిహ్నాలతో వస్తూ ఉండిన పూర్వ వాక్యాన్ని తిరోగామిని చేసాడు, నాలుగైదు సరాసరి మాటల వాక్యాలు వ్రాసి. ఆ నేర్పుకు కారణం అతను వార్తాపత్రిక రిపోర్టర్‌గా పని చేసిన అనుభవం అన్నారు. నయం, టెలిగ్రాఫ్ ఆఫీస్‌లో చేశాడు అనలేదు. వాక్యం సరే, ఇతని కథలు కూడా మొదట చూడటానికి చాలా సరళంగా అమాయకంగా కనపడుతాయి, ప్రతీకలు అలంకారాలు నిగూఢార్థాలతో కథను పొడుపు కథ చేయడు గనక.

మరి, ఇతని అరమాటలు, పొట్టి వాక్యాలు, పొడి పొడి సంభాషణల శైలికి కారణం, ప్రయోజనం ఏమి అయి ఉంటాయి! హెమింగ్వే కథల విషయాలను చూసేటప్పుడే ఈ సందేహానికి కూడా సమాధానం కనపడుతుంది.

ఈ రచయితకు నోబెల్ బహుమతి 'ఓల్డ్ మాన్ అండ్ ది సీ' అనే నవలకు వచ్చింది. కానీ ఈయన అలవోకగా వ్రాసిన చిన్న కథలతో పాఠక లోకానికి దక్కిన సాహిత్యానందం, అందుకు అతనికి వచ్చిన విశేషమైన పేరు ముందు నోబెల్ బహుమతి చిన్నది.

హెమింగ్వే కథలకు వస్తువులు తిప్పి తిప్పి కొట్టినా రెండంటే రెండే: 'వేట', 'యుద్ధం'. అదనంగా అతనికి అంటగట్టిన వస్తువులు 'సాహసం', 'పురుషాహంకారం'. కానీ అతని సబ్జెక్టు సాహసం కాదు, స్త్రీ నిర్లక్ష్యమూ కాదు. వేట, యుద్ధం, స్త్రీ నమ్మకద్రోహం వలె తెరమీద కనిపించే ఈయన కథావస్తువు వెనక ఉన్నది- తన రకరకాల భయమే, అదే హెమింగ్వే రచనలకు ప్రేరణ.

అతని మొదటి భయం చావు గురించి, రెండవ భయం తన భయం గురించి. రెండవది చాలా పెద్దది. నిజానికి ఈ రెండింటిని కూడా ఒక భయంగా కుదించవచ్చు, పొదుపరి హెమింగ్వేకు అది నచ్చుతుంది కూడా, వాక్య శిల్పం దృష్ట్యా. తన చావు భయాన్ని తను చంపకముందే అదే తనను చంపేస్తుందేమో అనే భయం హెమింగ్వే ది! అతని కథా వస్తువు, అతని జీవన్మరణ సమస్య కూడా అదే.

పలురకాల కారణాలుంటాయి రచయితలకు వ్రాయడానికి. రచన 'నిర్మలీకరణ' సాధనం అన్నాడు జాపనీస్ రచయిత నవోయ షిగా. హెమింగ్వేకు రచన ఒక రణం. ఊహ తెలిసినప్పటినుంచీ తనను ప్రత్యర్థిలా వెంటాడుతున్న 'భయం'తో సలిపిన పోరే అతని కథారచన. ఆ యుద్ధ స్వరూపాన్ని పుస్తకాలలో ఎలా చూపించాడు?

ఉన్నదున్నట్లు సమస్యను మాట్లాడేవారు వేదాంతులు. కథలను మెటఫారికల్‌గా రాసి వేదాంతాన్నో, ఆధ్యాత్మికతనో, నీతి వర్తననో, ప్రకృతి ఆరాధననో బోధించే పని హెమింగ్వే అంతస్తు ఉన్న కథకుడు చేయడు. హెమింగ్వే కథల విలక్షణత వాటి వస్తువులో కంటే అవి పాఠకుడికి చివరకు ఏ స్థితి స్వరూపాలతో అందుతున్నాయా అనేదాంట్లో ఉంది. వాస్తవంగా కథలో చెప్పదలుచుకున్న సమస్యను కాస్త ఓరగా జరిపి, ఆ సమస్య వలన చుట్టూ పాకే ప్రకంపనలు పర్యవసానాల లోంచి ఒక మేలైన శకలాన్ని ఎంచుకుని కథా విషయం చేయడం ఇతని లక్షణం. పదాలలో అక్షరాల పొదుపు, వాక్యాల నిడివిలో క్లుప్తత, కథను ఏక వాక్య సంభాషణల ద్వారా నడిపించడం అనే శైలి వెనక తనను మొత్తం కాగితం మీదకు ఒంపేసుకోవడానికి, అక్షరాలకు మొత్తం లొంగిపోవడానికి ఒప్పుకోని హెమింగ్వే పంతం ఉన్నది. కాబట్టే అతని వస్తువు, శిల్పం విడదీయలేని విధంగా కలిసి పుట్టిన కవలలు.

హెమింగ్వే కథలు 'Découpage', 'Kirigami' ఆర్ట్ లాంటివి. అటువంటి కథ కాగితం మీదకు తేవాలంటే రచయిత తన కలంతో కంటే కత్తెరతో ఎక్కువ పనిచేస్తాడు. క్లుప్తత ఉన్న కలం ఇతని ఒక పనిముట్టు అయితే, శస్త్రవైద్యుడి కత్తి వంటి కత్తెర రెండో ముఖ్య ఆయుధం. రచనను ముగించిన తర్వాత హెమింగ్వే ఒక శస్త్రవైద్యుడి అవతారం ఎత్తేవాడు. చిన్నచిన్నగా పరిష్కరించడంతో మొదలుపెట్టి, నిర్దాక్షిణ్యంగా కత్తిరించేస్తూ చివరకు పెద్ద పెద్ద కథా భాగాలనే పరిగ్రహిస్తూ, రచన ద్వారా సూచనప్రాయంగా చెప్పదల్చుకున్న అంశం మటుకే కాగితం మీద మిగిలిందాకా తక్కినదంతా తొలగిస్తూ పోయేవాడట. ఒకసారి కాదు పలుసార్లు ఈ ఆపరేషన్ జరిగేది పాపం ఆ కథకు. కానీ విుగిలిన కథ ఆరోగ్యానికి ఆ కత్తిరింపులూ తొలగింపులూ అవసరం. చాలా కథను ఆ విధంగా కత్తిరించడం మిగిలిన కథకు అదనపు మహత్వాన్ని నింపడం కోసమే. ఇది హెమింగ్వే మౌలిక రచనా వ్యాసంగ రీతి.

ఇక అతని కథాంశాల విషయానికి మళ్ళీ వస్తే లోకాభిప్రాయం ప్రకారం అవి- వేట, యుద్ధం, స్త్రీ చేసే నమ్మకద్రోహం అనుకుంటారు. నిజానికి అవి కాదు విషయాలు. అతనికి మూడు రకాల భయాలు అనుకున్నాం కదా. వాటికి సాక్ష్యం ఆత్మకథాత్మకాలైన హెమింగ్వే కథల్లో యెక్కడ ప్రముఖంగా కనపడుతున్నదో చూద్దాం.

'ఇండియన్ కాంప్' (1924) అనే కథలో నిక్, బహుశా ఆరేడేళ్ళ పిల్లవాడు. వాడి నాన్న డాక్టర్. ఆయన వృత్తిరీత్యా ఒక ట్రైబల్ వాళ్ళ గుడిసెకు వెళ్తుంటే నిక్ కూడా వెంట వెళ్తాడు. అక్కడ ఒకటే క్షణంలో ఒక స్త్రీకి పిల్లవాడు పుట్టడం, అదే గదిలో ఆ స్త్రీ భర్త అయిదు నిమిషాల క్రితం కత్తితో గొంతుకోసుకుని చచ్చిపడి ఉండటం చూస్తాడు. తిరిగి వచ్చేప్పుడు తండ్రీ కొడుకుల మధ్య సంభాషణ:

"నాన్నా, మగవాళ్ళు ఆత్మహత్య చేసుకుంటారా?"

"ప్రతి ఒకరూ కాదు"

"ఆడవాళ్ళు?"

"ఉహూ, చేసుకోరు."

కాసేపు ఆగాక,

"చచ్చిపోవడం చాలా కష్టమా నాన్నా?"

"కాదనుకుంట నిక్, చాలా సులభం. అయినా ఎప్పుడూ ఒకేలా ఉండదు."

చావుని గురించి ఆలోచన వదల్లేదు ఎప్పుడూ హెమింగ్వేని. మరీ చిన్నప్పుడు చర్చ్‌లో విన్న "ఎప్పుడైనా ఈ తాడు తెగిపోవచ్చు" అనే ప్రార్థనాగీతంలో మాటలతో చటుక్కున చావు గురించి మొదటిసారి ఎఱుక. త్వరగానే అది భయంగా మారింది. "ఆర్మీ సర్వీసెస్‌కు వెళ్ళిన కొత్తల్లో 'మనం చావం, అది వేరేవాళ్ళకు' అనే అనుకుంటాం మనకు మొదటి గాయం అయిందాకా. తర్వాత ఇంక మన వంతు ఎప్పుడో అని భయపడుతూ ఎదురు చూడటమే మన వంతు" అంటాడు. కానీ, "నేను ఎప్పటికీ చచ్చిపోను" అని చాలా ధృడంగా అనుకుంటునే ఉన్నాడు జీవితమంతా, చివరకు తుపాకి నోట్లో పేల్చుకుని చచ్చిపోయిందాకా.

చావు భయం, తన స్త్రీ తనను వదిలేస్తుందేమో అనే భయం; ఈ రెండూ మానవుడి ఆదిమ భయాలు. వాటి అంతు చూద్దామని చేసినవే హెమింగ్వే వేటలు.

'ది షార్ట్ హాపీ లైఫ్ ఆఫ్ ఫ్రాన్సిస్ మకూంబ్యర్' అనే కథలో మొదటిరోజు వేటలో పులిని చూసి భయపడినవాడు మరుసటి రోజు భయంకరమైన అడవి దున్నపోతుని నేరుగా కళ్ళల్లోకి చూస్తూ దాని భుజాలను చీలుస్తూ తుపాకీ పేల్చాకనే అతడి పూర్వభయాలు అన్నీ పోయాయి. అడవి జంతువు భయం; భార్య దగ్గర పరువు పోతుందని, ఆమె తనను వదిలేసిపోతుందనే భయం కూడా. స్త్రీలతో హెమింగ్వేకు చేదు అనుభవాలు ఉన్నాయి, వాళ్ళు తనని వదిలేయబోతున్నారని తెలియగానే తనే వదిలేసేవాడు వారిని.

స్త్రీ లేకపోతే ఒంటరితనపు భయం, స్త్రీ వచ్చాకా ఆమె పోతుందనో, కూడా ఉంటే తనను అణిచేస్తుందనో భయం... ఇవి మగవాడికి తప్పవు. ఆ భయాల నుంచి వచ్చే పురుష వికారాలే- భార్య సమర్థురాలైతే ద్వేషం ('స్నోస్ ఆఫ్ కిలిమంజారో' అన్న కథలో రాచరికపు జీవితం ఇచ్చిన భార్య అంటే కోపం; తనను తనుగా మిగల్చలేదని, సోమరిని చేసి తన రచనాశక్తిని చంపేసిందని), ఒకవేళ మూర్ఖురాలైతే నిర్లక్ష్యం.

హెమింగ్వే స్త్రీ ప్రస్తావనతో కథలు ఎక్కువ రాయలేదు నిజానికి.

'ఎ క్లీన్ వెల్ లైటెడ్ ప్లేస్' అన్న కథ ఒంటరి ముసలి వాడి కథ. అందులో ఎక్కడా స్త్రీ ప్రస్తావన లేదు. కానీ, లేని స్త్రీ వదిలేసిన ఖాళీ చీకటితనాన్ని ఎలా ఈదాలో తెలీక ఆ వృద్ధుడు రోజూ ఎలక్ట్రిక్ దీపాల వెలుతురులో కాస్త శుభ్రంగా ఉన్న రెస్టారెంట్‌కు వచ్చి కూచుని రాత్రి పన్నెండు దాటినా ఇంటికి పోడు.

"ఈ ముసలోడు ఎంతకూ పోడు, హోటల్ కట్టేద్దామంటే"

"ఇక్కడ ఉండే వెలుతురు, శుభ్రత కోసం వస్తాడు, ఇంకొంతసేపు కూచోని వెళ్తాడులే"

"నా పెళ్ళాం నా కోసం ఎదురు చూస్తుంటుంది, వీడికేం?"

- ఇలా విసుక్కుంటున్న పడుచు వెయిటర్‌కు అర్థం కాని బాధ అతనితో మాట్లాడుతున్న ముసలి వెయిటర్‌కు తెలుసు: శూన్యమైన ఇంట్లో ఒంటరిగా ఉండటం ఎంతో కష్టం.

తాగుతున్న ముసలాడు పోయిన వారం ఆత్మహత్య చేసుకోబోయాడు.

"కారణం?" - ముసలి వెయిటర్.

"ఏమీ లేదు!" - పడుచు వెయిటర్.

ఇలాంటి అతి మామూలు మాటల సంభాషణలు పెట్టి కథ నడిపిస్తాడు హెమింగ్వే. కానీ ఈ మామూలు మాటల్ని సామాన్యంగా అందరూ మాట్లాడే అర్థంలో ఉపయోగించాడా? ఇక్కడ పెళ్ళాం ఉన్న పడుచు వెయిటర్ అన్న "Nothing" అనే మాటకు ప్రస్తుతం ఆ సందర్భంలో అర్థం- "అతనికి ఆత్మహత్య చేసుకునేంత సమస్య ఏమీ లేదు, చాలా డబ్బులున్నవాడు, ఏం మాయరోగం!" అని. కానీ అంతేనా! ఆ మాట ఇవ్వగల మరో అర్థం ముసలి వెయిటర్‌కు తెలుసు- "ఏ అర్థమూ ఈ జీవితానికి లేదు" అని.

- అవును, ఏమీ లేదు. ఏమీ అర్థం లేదు మన ఈ ఏమీలేనితనానికి. శూన్యం నుంచి వచ్చాం. శూన్యమే మన చిరునామా. శూన్యానికే చివరకు చెందుతాం - ముసలి వెయిటర్ స్వగతం.

వృద్ధాప్యం వచ్చే కొద్దీ ఆ సంగతి మరీ తెలియవస్తుంది.

మనిషికి మరో విచారం- ఏ విధంగా జీవించినా ఈ జీవితానికి చివరకు ఏమైనా సార్థకత ఉంటుందా! మన అస్తిత్వానికి సార్థకత సరే, అర్థం ఉందా!

హెమింగ్వే అన్ని థీమ్స్ స్పృశించాడు అనవచ్చా? వేట, యుద్ధం, యుద్ధానంతర నిస్పృహ, నిర్వేదం, తనను తిరిగి కూడదీసుకునేందుకు అడవిలో ఒంటరి జీవితం, ప్రేమ, స్త్రీ, వివాహాలు, వియోగాలు, నాటి నేటి ప్రపంచం పోకడ, మనిషి ఆంతర్యం, అంతశ్చేతనం, వృద్ధాప్యం, అశక్తత, మనిషి జీవితానికి అర్థరాహిత్యం, అస్తిత్వ వేదన... చివరకు 'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ'లో అతను పూర్తి క్రైస్తవ ఆస్తికత వైపు జరిగాడు, ఆ ప్రతీకలు బాహాటంగా చూపించాడు అని కొందరు అన్నారు. దాంతో మానవ జీవితంలో దశలవారీగా అన్ని మైలురాళ్ళనూ పేపర్ మీదకు ఎక్కించినట్లే అనవచ్చా!

'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ'లో చేపలు పట్టే ముసలాయనకు చిక్కినట్లే చిక్కి అతన్ని నడి సముద్రంలోకి ఈడ్చుకుపోయిన, ఆయనతో పంతంగా చివరి వరకూ పోరాడిన మార్లిన్ అనే పెద్ద సొరచేప మరేదో కాదు. అది ముసలాయన విధి. నీవా నేనా అన్నట్టు సాగిన ఆ యుద్ధంలో ముసలాయనే గెలిచాడు. కానీ చివరకు తన విధిని చూసి తనే జాలిపడ్డాడు, స్నేహితుడిగా ప్రేమించాడు, తనతో సారూప్యం చూసుకున్నాడు దానిలో.

ఎవడి విధి వాడు జాలి పడదగినది అతని దృష్టిలో. ఎవడి విధి వాడే మోసుకోవలసిన శిలువ. అదే అతను భుజాలు అరచేతులు కోసుకుపోయేలా మూడు రోజులు వీపు మీద మోసుకు ఈదినది. చివరకు దాని తల, కేవలం అస్థిపంజరం మాత్రమే తెచ్చుకోగలిగాడు వెనక్కు, కానీ ప్రశాంతంగా నిద్రపోయాడు ఆ గెలుపు తర్వాత. ప్రాణాలకు ఒడ్డి తనను భయపెడుతున్న శత్రువులతో పోరు చేయడం హెమింగ్వే జీవిత తత్వం. "the world is a fine place and worth fighting for and I hate very much to leave it".


That's his quintessential philosophy.

సాహిత్య తత్వం కూడా.

"రాయడానికి పుట్టాను, చాలా బాగా వ్రాయాలి" అనుకునే దిగాడు, రాశాడు, బహు గొప్పగా!

వేటలో వ్రాతలో కూడా సాహసి హెమింగ్వే.

కథను కూడా చివరకు అతని కథలో 'మార్లిన్' చేప లాగానే అస్థిపంజరం మాత్రం అట్టిపెట్టి మిగతాదంతా తీసిపడేసి ఇస్తాడు పాఠకులకు. ఆ బెస్త పల్లెలో మనుషుల్లాగే మనం కూడా ఆ ఎముకల ఆకృతి చూసి అసలు కథ స్వరూపాన్ని అంచనా వేసుకోగలగాలి. అతనికి దక్కవలసిన నిజమైన గౌరవం అందులోనే ఉంది.



పదాలలో అక్షరాల పొదుపు, వాక్యాల నిడివిలో క్లుప్తత, కథను ఏక వాక్య సంభాషణల ద్వారా నడిపించడం అనే శైలి వెనక తనను మొత్తం కాగితం మీదకు ఒంపేసుకోవడానికి, అక్షరాలకు మొత్తం లొంగిపోవడానికి ఒప్పుకోని హెమింగ్వే పంతం ఉన్నది. కాబట్టే అతని వస్తువు, శిల్పం విడదీయలేని విధంగా కలిసి పుట్టిన కవలలు.

పద్మజ సూరపరాజు
99403 44406

ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీ 2024

మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న కథల పోటీకి రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం. బహుమతి పొందిన కథలతో బాటు మరికొన్ని ఎంపిక చేసిన ఉత్తమ కథలతో 'కథా ప్రపంచం 2024' పుస్తకం తెస్తాం. కమిటీ ఎంపిక చేసే సాహితీవేత్తకు మలిశెట్టి సీతారామ్ స్మారక సాహితీ పురస్కారం 2024 అంద చేయబడుతుంది. కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. కథలను జూన్ 30 లోగా ఈమెయిల్ msreducaionalsociety@ gmail.comకు పంపాలి. వివరాలకు: 93947 82540

మలిశెట్టి శ్యాం ప్రసాద్

పల్లా జాతీయ కవితా పురస్కారం

యువసాహితి ప్రకటించిన పల్లా జాతీయ కవితా పురస్కారానికి 2024కి కంచరాన భుజంగరావు రచించిన 'నీటిగింజల పంట' కవితా సంపుటి ఎంపికైంది. జూన్ మొదటి వారంలో ప్రొద్దుటూరులో బహుమతి సత్కారం ఉంటుంది.

పల్లా కృష్ణ

రాజాం రచయితల వేదిక సమావేశం

మే 26 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో 'శ్రీపాద కథల్లో సామాజిక జీవనం' అంశంపై రాజాపు శాంతారావు ప్రసంగిస్తారు.

రాజాం రచయితల వేదిక


"కవిత్వం బతుకు సమరంలో నిలబెట్టే లంగరు"

వారాల ఆనంద్ పలకరింపు

గుల్జార్ 'ఆకుపచ్చ కవితలు' సంపుటి తర్వాత ఇప్పుడు 29 భాషల్లోంచి కవితలు అనువాదం చేసి 'ఇరుగు పొరుగు' సంకలనంగా తెచ్చారు. దీని నేపథ్యం చెప్పండి. మీరు అనువాద ప్రక్రియను ఎలా చూస్తారు?

అనువాదం అంటే కేవలం ఒక భాషలోంచి మరో బాషలోకి మాటల్ని తర్జుమా చేయడం మాత్రమే కాదు. ఆయా భాషలు, వాటిని మాట్లాడే ప్రజలు, వారి సామాజిక నేపథ్యం అన్నీ అనువాద క్రమంలో పరిగణనలోకి వస్తాయి. భిన్న భాషలు విభిన్న వ్యక్తులు వారి వ్యక్తీకరణలు అన్నీ అనువాదానికి భూమికలవుతాయి. అందుకే అనువాదం కనిపించినంత సులభమైంది కాదు. అందులో కవిత్వం మరింత క్లిష్టం. మూల రచనను అర్థం చేసుకుని ఆ కవిని, ఆయన చెప్పదలుచుకున్న విషయాన్నీ అవగతం చేసుకోవాలి. ప్రతిభాషకూ తమవైన జాతీయాలూ, పదబంధాలూ వుంటాయి, అవన్నీ పరిశీలించాల్సిన అంశాలే.

అయితే అనువాదం మూల భాషనుంచి కాకుండా ఇంగ్లీష్‌లోంచి చేసినప్పుడు కొన్ని ఇబ్బందులు వస్తాయి. నేనయితే 'ఇరుగుపొరుగు' కవితల్ని అనువదించే క్రమంలో అనుమానం వచ్చిన ప్రతిసారీ మూల రచయితల్ని మెయిల్‌లోనో ఫోన్‌లోనో సంప్రదించే ప్రయత్నం చేశాను. అలా సాధ్యమయింత మేర మూలంలోని భావం చెడకుండా చూశాను. ఉదాహరణకు ఆఘా షాహీద్ అలీని అనువదించినప్పుడు కశ్మీర్, అక్కడి స్థితి, వలసలు అన్నీ తెలుసు కనుక ఆయన హృదయాన్ని స్పృశించి తెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశాను. ఈ క్రమంలో ఇండియన్ లిటరేచర్, సచ్చిదానందన్, గుల్జార్ లాంటి వాళ్ళు కూర్చిన సంకలనాలూ ఎంతగానో ఉపయోగపడ్డాయి.




వారాల ఆనంద్

గుల్జార్‌ని 'ఆనంద్', 'పరిచయ్', 'కొశిష్' లాంటి సినిమాల కాలం నుంచి, అంటే దాదాపుగా గత 50 ఏళ్లగా, ఫాలో అవుతున్నాను. ఆ క్రమంలో అయన గ్రీన్ పొయెమ్స్, నెగ్లెక్టెడ్ పోయెమ్స్, సస్పెక్టెడ్ పోయెమ్స్... ఇట్లా అన్నీ చదివాను. పచ్చదనం నాకూ చాలా ఇష్టం కనుక 'గ్రీన్ పోయెమ్స్' హిందీ లోంచి తెలుగులోకి చేశాను. ఇక 'ఇరుగు పొరుగు' విషయానికి వస్తే ఆ కవితలు దాదాపుగా మూడేళ్ళ నుంచి చేస్తున్నాను. ఇవి ప్రధానంగా ఇంగ్లీష్ లోంచి చేశాను.

మీకు సాహిత్యం పట్ల మక్కువ ఎట్ల ఏర్పడింది?

మాది కరీంనగర్‌లో మిఠాయి వ్యాపారం చేసే కుటుంబం. సాహిత్యంతో సంబంధం వున్న కుటుంబం కాదు. కానీ మా నాన్నగారికి హిందీ పాటలు, ఉర్దూ నవలలు బాగా ఇష్టంగా వుండేది. ఆ క్రమంలో ఇంట్లో బినాకా గీత్ మాలా, పురానీ



ఫిల్మోంకా గీత్ బాగా వినిపించేవి. మా ఇంటి దగ్గరే వున్న కృష్ణా బుక్ స్టాల్‌లో డిటెక్టివ్ నవలలతో నాకు చదవడం బాగా అలవాటయింది. తర్వాతి కాలంలో 'శాంతినికేతన్' లాంటి నవలలు చదివాను. ఉస్మానియా యూనివర్సిటీలో చేరిన తర్వాత సాహిత్యాసక్తి బాగా పెరిగింది. ఇక కాలేజీ లైబ్రేరియన్ ఉద్యోగం కనుక పుస్తకాలే లోకం అయిపోయింది. చదవడం రాయడం కొనసాగింది.

గ్లోబలైజేషన్ నేపథ్యంలో తెలుగు భాష పరిస్థితి ఏమిటి? అనువాద ప్రభావం ఏమేరకు వుంటుంది?

ప్రపంచీకరణ మొత్తంగా ప్రపంచంలోని దేశాల మధ్య, మనుషుల మధ్య హద్దుల్నీ సరిహద్దుల్నీ చెరిపేసింది. పెరుగుతున్న సాంకేతికత దూరాల్ని చెరిపేస్తున్నది. అనేక సంస్కృతులు వేలాది భాషలు వున్న ప్రపంచంలో సమాచార ప్రసారం ముఖ్యమయింది. ముఖ్యంగా ఇంటర్నెట్‌లో ఇంగ్లీష్ ప్రధాన పాత్ర పోషిస్తున్న తరుణంలో అనేక చిన్న భాషలు ప్రభావితమవుతున్నాయి. కొన్ని భాషలు అంతరించిపోయే స్థితి ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో తెలుగు కూడా ఎంతోకొంత ప్రభావితం అవుతుంది, తప్పదు. ఇప్పటికే ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళు కాలేజీల ప్రభావం తెలుగుపై కనిపిస్తూనే వున్నది. కంప్యూటర్ నేర్చుకోవడానికి, అమెరికా వెళ్లడానికి ఇంగ్లీష్ కావాలి కనుక రానున్న తరాల్లో తెలుగు ఉపయోగం తగ్గిపోయే అవకాశం వుంది. మాతృభాషా పరిరక్షణ ఉద్యమం రావాల్సిన అవసరం కూడా వుంది. ఇక ప్రపంచీకరణ నేపథ్యంలో అనువాదం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందే అవకాశం కనిపిస్తున్నది. సాహిత్య అనువాదం మాత్రమే కాకుండా విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాలు, మీడియా, వ్యాపార రంగాల్లో అనువాద అవకాశాలు పెరిగే అవకాశం వుంది, పెరుగుతున్నాయి కూడా. సాహిత్యానువాదం అప్పుడూ ఇప్పుడూ అత్యంత ప్రధానమయింది అని నేననుకుంటాను.

'మానేరు తీరం', 'మనిషి లోపల' కవిత్వ సంపుటులతో సహా మీ మొత్తం కవిత్వంలో ప్రధానంగా మనిషి, ప్రకృతి సంబంధిత అంశాలు కనిపిస్తాయి. వీటి గురించి తెలపండి?

"నాకు కవిత్వం కేవలం కవిత్వం కాదు/ సగం శబ్దం సగం నిశబ్దం/ శబ్దమేమో బతుకు ఏడుపులోంచి ఎగిసిపడుతున్న ఎక్కిళ్ళు/ నిశబ్దమేమో బతుకు చేతగానితనం లోంచి వ్యక్తమవుతున్న మౌనం". అంతే కాదు, "కవిత్వం సంక్షోభ కాల ప్రవాహంలో నన్ను ఒడ్డుకు చేర్చే తెరచాప/ బతుకు సమరంలో నిలబెట్టే లంగరు" అని కూడా రాసుకున్నాను. కవిత్వాన్ని ఎప్పుడూ నేను కెరీర్‌గా తీసుకోలేదు. అది నా 'లైఫ్ లైన్'

మీరు కవిత్వం సినిమా రెండు కళ్ళుగా భావిస్తారు.. ఎట్లాగో వివరించండి?

సినిమా కవిత్వం రెండూ కళాత్మక వ్యక్తీకరణలే. కానీ కవిత్వం వ్యక్తిగత వ్యక్తీకరణ, సినిమా సమిష్టి కళల వ్యక్తీకరణ. అర్థవంతమయిన భావయుక్తమయిన ఆ రెంటినీ ఇష్టపడతాను. మనిషినీ సమాజాన్నీ పట్టించుకునే ఆ రెండూ నాకు వూపిరుల్లాంటివి.

ఇంటర్వ్యూ: **కె.ఎస్.అనంతాచార్య**



మే నెల మధ్య భాగమిది. నిప్పుల కుంపటి నడి నెత్తిన పెట్టినట్టు భానుడు భగభగ మండే కాలమిది. పగలు బయట అడుగు పెట్టాలంటే జనం భయపడేటట్టు ఎండలు కాసే తరుణమిది. తన రాకతో వీటన్నిటికీ ఒక 'మేఘమాల' చెక్ పెట్టేసింది. జనులారా నేనున్నానంటూ.. సురసురలాడే సూరీడుని కప్పేస్తానంటూ.. నిటారు కొండలను చీల్చుకొని చల్లటి కబురు తీసుకొస్తున్నానంటూ.. నీలి రంగు దుప్పటితో నగరాన్ని చుట్టేస్తానంటూ.. నగర జనులకు ఆనందపు జల్లులు పంచుతానంటూ.. ఒక మేఘమాల ఆకాశం నుంచి ముచ్చటేస్తున్నట్టు ఉన్న ఈ అద్భుత దృశ్యం నగరంలో ఆదివారం మధ్యాహ్నం ఆవిష్కృతమైంది.



అమెరికాకు వంశీ

గన్నవరంలో మాయమై డల్లాస్‌లో ప్రత్యక్షం

- కొడుకు చదువు కోసమంటున్న అనుచరులు
- రాయబారాల కోసమంటున్న టీడీపీ నాయకులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ అమెరికా వెళ్లారు. వాస్తవానికి ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి అమెరికా వెళ్లడం పెద్ద సంచలనం కలిగించే అంశమేమీ కాదు. అయితే వంశీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఆయన ఏ అడుగు వేసినా అది చర్చనీయాంశంగా మారుతోంది. 2019లో టీడీపీ టికెట్‌పై గెలిచిన వంశీ ఆ తర్వాత వైసీపీ పంచన చేరారు. రాజకీయాల్లో ఇది కూడా సాధారణ విషయమే. ఆ తర్వాత ఆయన వేసిన అడుగులు ఆయన రాజకీయ ప్రస్థానాన్ని వివాదాస్పదం చేశాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కొడుకు లోకేశ్‌ను ఉద్దేశించి వంశీ చేసిన వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లోనే కాకుండా తెలుగువారందరి లోనూ వంశీపై వ్యతిరేకతను తీసుకొచ్చాయి. రాజకీయాల్లో నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం సహజమే కానీ ఇంట్లోని మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం అనే కొత్త విధానాన్ని వంశీ తీసుకొచ్చారు. ఈ పరిణామాలతో టీడీపీ అధిష్ఠానం మొదలు గ్రామస్థాయి నాయకులు వరకు వంశీ ఓటమి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా వంశీకి బలమైన ప్రత్యర్థిగా 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్ఆర్ఐ యార్లగడ్డ వెంకట్రావును తీసుకొచ్చారు. ఆయన నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీని మరింత బలోపేతం చేశారు. దీంతో 2024 ఎన్నికల్లో వంశీ ఓటమి ఖాయమని ఆయన అనుచరులే వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. ఈ ఎన్నికల్లో వంశీ ఓడిపోతే ఆ తర్వాత ఆయన పరిస్థితి ఏమిటన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వంశీ అమెరికా వెళ్లారన్న అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. వంశీ మే 17న అమెరికా వెళ్లారని ఆయన అనుచరులు చెబుతున్నారు. కొడుకు చదువుల కోసం ఆయన అమెరికాలోని డల్లాస్ వెళ్లారని అనుచరులు చెబుతున్న మాట. అయితే టీడీపీ నాయకులు దీనికి భిన్నంగా చెబుతున్నారు. వంశీ అమెరికాలో శాశ్వతంగా స్థిరపడేందుకు సిద్ధమయ్యారని అందులో భాగంగా ఆయన అమెరికా వెళ్లారన్నది టీడీపీలో కొంతమంది నాయకుల వాదన. డల్లాస్‌లోని కొందరు ఎన్ఆర్ఐల ద్వారా టీడీపీ పెద్దలతో రాజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే అమెరికా వెళ్లారని మరికొంత మంది నాయకులు చెబుతున్నారు. ఏది ఏమైనా వంశీ అమెరికా పర్యటన నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.



తాడోపేడో కాసేద్దాం!

కొద్దిరోజులుగా ఊగిసలాటలో బెట్టింగ్ బాబులు

- గన్నవరం, గుడివాడలో టీడీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని మెజారిటీ 15వేలు పైచిలుకు వస్తుందని విజయవాడకు చెందిన ఓ బిల్డర్ రూ.5 లక్షలకు బెట్టింగ్ కాశారు.
- మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సింహాద్రి చంద్రశేఖర్‌కు అవనిగడ్డలో మెజారిటీ వస్తుందని మచిలీపట్నంకు చెందిన ఓ రోల్డు గోల్డు వ్యాపారి రూ.10 లక్షలు బెట్టింగ్ కాశారు. ఈయనే మచిలీపట్నం ఎంపీగా కూటమి అభ్యర్థి బాలశౌరి గెలుస్తారని మరో రూ.10 లక్షలు పందెం కాశారు.

ఓటరు నాడి అంతుచిక్కకపోవడంతో కొన్ని రోజులుగా సైలెంట్ అయిన బెట్టింగ్ రాయుళ్లు మళ్లీ బరిలోకి దిగారు. పోలింగ్ ముగిసిన వెంటనే రెండు మూడు రోజులు జోరుగా మొదలైన బెట్టింగ్‌లు మధ్యలో కాస్త తగ్గాయి. ఫలితాలు తేలే రోజు దగ్గరపడుతుండటంతో మళ్లీ బెట్టింగ్ బాబులు జూలు వి దులుస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ప్రస్తుతం బెట్టింగ్‌ల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారన్న దానితో సంబంధం లేకుండా కేవలం ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయి? వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఏయే సీట్లు టీడీపీ ఖాతాలో పడతాయి? ఏవి వైసీపీ దక్కించుకుంటుంది అన్న వాటిపై ఎక్కువగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.



- రెండు రోజులుగా ఊపందుకున్న బెట్టింగ్‌లు
- గన్నవరం, గుడివాడ, మైలవరం, విజయవాడ తూర్పు
- ఈ నాలుగు నియోజకవర్గాలపైనే అందరి దృష్టి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : కైకలూరు, నూజివీడుతోసహా మొత్తం 16 నియోజకవర్గాల పైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. గుడివాడ, మైలవరం, గన్నవరం, విజయవాడ తూర్పు అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములపై ఎక్కువ ఆసక్తి నెలకొంది. ఈ స్థానాలపై సుమారు రూ.40 కోట్లు వరకు పందేలు జరిగి ఉంటాయని అంచనా. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 14 అసెంబ్లీ, 2 పార్ల మెంటు స్థానాలు ఉన్నాయి. వీటితోపాటు గతంలో ఉమ్మడి కృష్ణాలో ఉన్న కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలనూ కలుపుకొని టీడీపీ, వైసీపీకి ఎన్ని స్థానాలు వస్తాయన్న దానిపై బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. మొత్తం 16 స్థానాలను కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందని.. కూటమికి 14, వైసీపీకి 2 వస్తాయని.. ఇలా రకరకాల లెక్కలతో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు దగ్గరపెట్టుకుని పోలింగ్ సరళిని అంచనా వేసుకుని మరీ బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్‌కు దిగుతున్నారు.

- విజయవాడ తూర్పులో కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ మెజారిటీపైనా పందేలు నడుస్తున్నాయి. విజయవాడ పశ్చిమ, పామర్రులో వైసీపీ అభ్యర్థులు గెలుస్తారని బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. కూటమి అభ్యర్థులు గెలుపు ఖాయమని భావిస్తున్న నియోజకవర్గాల్లో మెజారిటీలపై పందేలు కాస్తున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మెజారిటీ 20వేలు పైచిలుకు ఉంటుందని పందేలు నడుస్తున్నాయి.
- విజయవాడ పార్లమెంటులో కేశినేని బ్రదర్స్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపైనా పందేలు కాస్తున్నారు. కేశినేని చిన్ని కనీసం 50వేల మెజారిటీతో గెలుస్తారని పందేలు నడుస్తున్నాయి.

గతంలో ఉన్న జోరు లేదు

గత ఎన్నికల్లో ఉన్న జోరు ఈసారి బెట్టింగ్‌ల్లో కనిపించడం లేదు. గత ఎన్నికల్లో లక్షలు దాటి కోట్లలో బెట్టింగ్‌లు నడిచాయి. 2019 ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు పరిధిలో అధికార పార్టీ తరఫున పోటీ చేసిన ఓ అభ్యర్థి తన గెలుపుపై తానే బెట్టింగ్ కట్టుకోవడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. సుమారు రూ.1.50 కోట్లకు ఆయన బెట్టింగ్ కాసినట్లు చెబుతారు. ఆయన దెబ్బతో ఆ నియోజకవర్గం నుంచే సుమారు రూ.5 కోట్లు వరకు బెట్టింగ్‌లు జరిగాయి. వీరంతా అప్పట్లో ఫలితాలు తారుమారు కావడంతో నిండా మునిగిపోయారు. అప్పట్లో టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని కూడా కోట్లలో పందేలు నడిచాయి. ఈసారి ఆ జోరు కనిపించడం లేదు. ఎన్నికలు ముగిసిన వెంటనే జోరుగా సాగిన బెట్టింగ్‌లు ఆ తర్వాత సైలెంట్ ఓటింగ్ ఎటో అర్థం కాక నెమ్మదించాయి. గత వారం రోజులుగా సాగిన విశ్లేషణల అనంతరం గత రెండు రోజులుగా మళ్లీ బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. గత ఎన్నికల సమయంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో సుమారు రూ.100 కోట్లపైచిలుకు బెట్టింగ్‌లు జరగ్గా ఈసారి అందులో నగం కూడా జరగలేదని సమాచారం.

కరెంటు కాటు!


భార్యాభర్తల మృతదేహాలు

- విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి
- గంపలగూడెం దళితవాడలో విషాదం

గంపలగూడెం, మే 19 : వారు నిరుపేదలు. ఏరోజుకారోజు కూలి చేసుకుని పొట్టపోసుకునే దళిత దంపతులు. కష్టంలోనూ, సుఖంలోనూ ఒకరికొకరు తోడుగా ఉండే ఆలూమగలు. వారిని విద్యుత్ రూపంలో మృత్యువు కాటేసింది. ప్రమాదవశాత్తూ భార్యకు కరెంటు షాక్ తగలడంతో ఆమెను కాపాడబోయిన భర్త కూడా షాక్ తగిలి ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విషాద ఘటన గంపలగూడెం దళితవాడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గంపలగూడెం దళితవాడకు చెందిన గోరట్ల తిరుపతయ్య (62), భార్య గోరట్ల జమలమ్మ (55) కూలి పని చేసి జీవనం సాగిస్తుంటారు. ఎప్పటిలానే పనికెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. రాత్రి సమయంలో చిరుజల్లులు పడుతుండటంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కొంత సమయం తర్వాత విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఆ సమయంలో ఇంటికి కరెంటు సరఫరా అవుతున్న సర్వీస్ తీగను ఇంటి లోపల బట్టలు ఆరేసుకునే జీఏ వైర్ తగిలింది. దీన్ని గమనించక జమలమ్మ వైర్‌పై ఉన్న బట్టలు తీస్తుండగా కరెంటు షాక్‌కు గురై పెద్దగా కేక వేసింది. అది విన్న భర్త తిరుపతయ్య పరుగున వచ్చి ఆమెను పట్టుకోవడంతో ఇద్దరు షాక్ గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో దళితవాడలో విషాద చాయలు అలుముకున్నాయి.


కారు ఢీకొని ఏఎస్సై దుర్మరణం

రోడ్డు దాటుతుండగా ప్రమాదం



- 6లో..

సివిల్ సప్లయిస్ లీల.. కందిపప్పు గోల



2015-16లో డీలర్లకు కందిపప్పు అప్పుగా ఇచ్చారట

- ఆ డబ్బు కట్టాలంటూ ఉమ్మడి కృష్ణాలో డీలర్లకు నోటీసులు
- అప్పే ఇవ్వకుండా.. డబ్బులు కట్టడమేమిటని డీలర్ల గగ్గోలు
- అప్పు ఇస్తే.. ఇప్పటి వరకు ఎందుకు అడగలేదు
- రెండు ప్రభుత్వాలు మారినా.. అప్పు గుర్తుకు రాలేదా?
- డీలర్ల ప్రశ్నల వర్షం
- పక్కదారి పట్టిన వాటిని డీలర్లపై నెట్టే ప్రయత్నంగా అనుమానం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో నోటీసుల పర్వం ప్రారంభమైంది. అప్పుడెప్పుడో.. కందిపప్పు అప్పు మీద ఇచ్చిన దానికి 9 ఏళ్ల తరువాత ఇప్పుడు బకాయిలు కట్టాలంటూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ డీలర్లకు అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఒక్కో డీలర్‌కు సగటున రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సిందిగా నోటీసులు పంపుతుండటంతో వారిలో ఆందోళన నెలకొంటోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో డీలర్లంతా కలిపి రూ.6.90 కోట్లు కట్టాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తంగా 2300 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ఈ కందిపప్పు బకాయిలకు సంబంధించి నోటీసులు స్వీకరించిన డీలర్లు తమకు అప్పు ఇవ్వలేదని అంటున్నారు. వాస్తవానికి 2019-20లో కరోనా సమయంలో డీలర్లకు పంచదార అప్పు ప్రాతిపదికన ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఇచ్చే కమీషన్లలో ఆ మొత్తాన్ని భర్తీ చేసుకున్నారు. కానీ, విచిత్రంగా సివిల్ సప్లయిస్ శాఖ నుంచి 2015-16 మధ్య కాలంలో పెద్దనోట్ల రద్దు సందర్భంగా కందిపప్పు అప్పుగా ఇచ్చామని చెబుతోంది. నిజంగా అప్పు ఇచ్చి ఉంటే వెంటనే రికవరీ చేయాలి. కానీ, దాదాపుగా పదేళ్ల తర్వాత ఎందుకు అడుగుతున్నారో అర్థం కావటం లేదు. లెక్కల్లో ఏదో తేడా జరిగి ఉంటుందని, దానిని తమపై వేయటం తగదని డీలర్లు అంటున్నారు. దీంతో ఈ వ్యవహారం సివిల్ సప్లయిస్‌లో కలకలాన్ని సృష్టిస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నడిపించటానికి కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ-పోస్‌తోపాటు ఆన్‌లైన్‌లో డీడీలు కట్టే విధానంతో నగదు లావాదేవీలన్నింటినీ పూర్తిగా డిజిటల్ రూపంలోకి తీసుకొచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో నగదు లావాదేవీల్లో తేడా రావటానికి ఆస్కారం లేదు. ఒకవేళ అప్పుగా ఇచ్చినా.. ఆటోమేటిక్‌గా మరుసటి నెలలో ప్రజా పంపిణీ సందర్భంలోనైనా తెలిసిపోతుంది. కానీ, ఇప్పటి వరకు వారికి అప్పుగా తీసుకున్నట్టు తెలియదని వారి వాదనలను బట్టి అర్థమౌతోంది.

డీలర్లపై రుద్దే ప్రయత్నమేనా?

డీలర్లకు గతంలో పంచదార వంటివి అప్పుగా ఇచ్చినపుడు ఈ గొడవలు లేవు. పదేళ్ల కిందట ఇచ్చిన కందిపప్పు విషయంలోనే తేడా వస్తోంది. ఆ సందర్భంలో ఏమి జరిగి ఉంటుందన్నది అర్థం కావటం లేదు. అప్పట్లో కందిపప్పు డబ్బులు పక్కదారి పట్టాయా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. సివిల్ సప్లయిస్ శాఖలో జరిగిన అవినీతి బయటకు వస్తే పరువు పోతుందన్న ఉద్దేశంతో డీలర్లపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

అన్నీ సందేహాలే..

2015 - 16 మధ్య కాలంలో అంటే పెద్ద నోట్ల సందర్భమే. అప్పట్లో ఐదేళ్లలో ఒక ప్రభుత్వం దిగిపోయే వరకు కూడా ఈ అప్పు ఎందుకు గుర్తుకు రాలేదన్నది ప్రశ్నగా ఉంది. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆ ప్రభుత్వం కాలం కూడా పూర్తవుతోంది. ఈ ఐదేళ్లు కూడా ఇచ్చిన అప్పు గుర్తుకు రాలేదా? దాదాపుగా 9 ఏళ్ల కాలం వరకు ఇచ్చిన అప్పు గుర్తుకు రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అప్పు తీర్చినట్టు సాక్ష్యాలు చూపాలట

వరుస నోటీసులతో డీలర్లు తాము అప్పు తీసుకోలేదని చెబుతున్నారు. ఒకవేళ నిజంగానే అప్పు ఇచ్చి ఉంటే మీరు వెంటనే చెల్లించమని డిమాండ్ చేస్తారని లేదా డీడీలకు కట్టిన తమ డబ్బును మినహాయించుకుంటారని డీలర్లు అధికారుల దగ్గర వాదిస్తున్నారు. అయితే మీరు డబ్బులు చెల్లించినట్టు రశీదులు చూపమని అధికారులు అంటున్నారు.



నాని ఓట్ల డబ్బు మావాళ్లే దోచేశారు!

మూడు వార్డులకు రూ. 7 కోట్లు తీసుకున్నారు


వైసీపీ మైనార్టీ నాయకుడు సర్దార్ బేగ్

"కొడాలి నాని ఓటర్లకు పంపిన డబ్బును 10, 11, 12వ వార్డులకు చెందిన వైసీపీ మైనార్టీ నాయ కులు దోచేశారు. రూ.7 కోట్లు తీసుకున్నారు. వారిని కల్యాణమండపానికి పిలిపించి నిజాలను తెలుసుకో అన్నా. లేకపోతే మండపంలోని కుక్కలను వారి మీదకు వదిలెయ్. లేదంటే ఆ డబ్బులతో గోవా, మలేషియా, సింగపూర్ చెక్కేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారు"

- కొడాలి నాని ముఖ్య అనుచరుడు, మైనార్టీ నాయకుడు సర్దార్ బేగ్ సెల్ఫీ వీడియోలో చెప్పిన మాటలివి.

గత రెండు రోజులుగా సెల్ఫీ వీడియో వైరల్ అవుతున్నా వైసీపీ నాయకులు ఖండించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

- ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ సెల్ఫీ వీడియో హల్‌చల్
- అజ్ఞాతంలోకి సర్దార్ బేగ్
- ఇది కోడ్ ఉల్లంఘనే : టీడీపీ
- చర్యల కోసం ఈసీకి రిటర్నింగ్ అధికారి సిఫారసు చేసేనా?

గుడివాడ : స్థానిక వైసీపీ అభ్యర్థి కొడాలి నాని అనుచరుడు సర్దార్‌బేగ్ సెల్ఫీ వీడియో సంచలనం కలిగిస్తోంది. నియోజకవర్గంలతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ వీడియో చర్చ నడుస్తోంది. పట్టణంలోని 10, 11, 12 వార్డుల్లోని ఓటర్లకు పంపిణీ నిమిత్తం కొడాలి నాని పంపిన డబ్బును వైసీపీ మైనార్టీ నాయకులు కాజేశారని ఆయన ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ వీడియోలో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల వ్యయాలను పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అధికారులను నియమించింది. పరిమితికి మించి డబ్బును ఖర్చు చేస్తే అభ్యర్థులపై వేటు వేస్తుంది. అసెంబ్లీ నియోజకవర్గంలో అయితే రూ.45 లక్షల వరకు ఎన్నికలకు ఖర్చు చేసుకోవచ్చు. సర్దార్ బేగ్ తెలిపిన రూ.7కోట్లు నగదు విషయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిగణలోకి తీసుకుంటారా లేదా అధికార పార్టీకి తలొగ్గి కిమ్మనకుండా ఉంటారా అనేది తేలాల్సి ఉంది.

నోరు మెదపని వైసీపీ వర్గాలు

సర్దార్ బేగ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీని ఆత్మరక్షణలో పడేశాయి. ఏకంగా నాని పంపిన నగదును వైసీపీ నాయకులే దోచేశారని చెప్పడంతో ఏం చేయాలో తెలియక ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై స్పందించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఎన్నికల కమిషన్ కేసు నమోదు చేస్తే పోలీసు వి చారణ ఎదుర్కోవలసి వస్తుందనే భయం, గడ్డం గ్యాంగ్, నాని ముఖ్య అనుచరుల నుంచి ప్రాణహాని ఉండవచ్చుననే అనుమానంతో సర్దార్‌బేగ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు వైసీపీ నాయకులే బాహాటంగా పేర్కొంటున్నారు.

రిటర్నింగ్ అధికారి ఎక్కడ?

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచే గుడివాడ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యంతరాలు లేవనెత్తకుండా ఆమె వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. వైసీపీకి అనుకూలంగా ఆర్వో వ్యవహరించారని టీడీపీ నాయకులు బహిరంగంగా వి మర్శించారు. ఏకంగా నాని కోడ్ ఉల్లంఘనకు పాల్పడినా ఆర్వో చర్యలు తీసుకోలేదు. తాజాగా సర్దార్ బేగ్ చేసిన వ్యాఖ్యలపై ఆర్వో చర్యలకు ఉపక్రమించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతారా? లేదా అధికార పార్టీ సేవలో తరిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

నానిపై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

నాని ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ నానికి చెందిన నగదు అని స్పష్టంగా పేర్కొన్నాడని, మూడు వార్డుల ఓటర్లను ప్రలోభపరిచేందుకు రూ.7కోట్ల నగదును పంపినట్టు తెలిపాడని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. అంత మొత్తంలో నగదు ఎవరిది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే విషయంలో ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సర్దార్ బేగ్ వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపి, ఆ మొత్తాన్ని నాని ఎన్నికల వ్యయంలో చూపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉదయభాను కుమారుడు, అల్లుడి

బెదిరింపులపై ఫిర్యాదు

- స్పందించని జగ్గయ్యపేట సీఐ జానకీరాం
- ఎన్నికల కమిషన్‌కు స్వతంత్ర అభ్యర్థి వేల్పుల ఫిర్యాదు

జగ్గయ్యపేట, మే 19: వైసీపీ నేతల బెదిరింపులపై తానిచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేయటంతో పాటు, హైకోర్టును తప్పుదోవ పట్టించేలా తనకెవరూ ఫిర్యాదు చేయలేదని తెలియజేయటంపై జగ్గయ్యపేట సీఐ జానకీరాంపై జగ్గయ్యపేట నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేల్పుల విజయ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న జగ్గయ్యపేట బాలుర ఉన్నత పాఠశాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో జరిగిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను కుమారుడు కౌన్సిలర్ ప్రసాద బాబు, అల్లుడు విజయనరసింహారెడ్డి ప్రచారం చేయటంపై తాను ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తానన్నానని, అందుకు తనను వారు బెదిరించటంపై జగ్గయ్యపేట సీఐకు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు కూడా తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని సీఐకు అధికారికంగా లిఖితపూర్వకంగా ఆదేశించినా సీఐ స్పందించలేదన్నారు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై తాను హైకోర్టులో పిల్ దాఖలు చేయగా, అసలు తాను ఫిర్యాదు చేయలేదని హైకోర్టును తప్పుదోవ పట్టించాడన్నారు. ఎన్నికల అధికారి తన ఫిర్యాదుపై స్పందించి సీఐకు ఇచ్చిన ఎండార్స్‌మెంట్ కాపీని సాక్ష్యమన్నారు. అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న సీఐపై చర్య తీసుకోవాలని, త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగే అవకాశం లేదని, సీఐపై చర్యలు తీసుకోవాలని విజయ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

అన్నవరం స్వామికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాల సమర్పణ



అన్నవరం దేవస్థానంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

వన్‌టౌన్, మే 19: తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వీరవెంకట సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మి సత్యవతీ దేవి లీలా కల్యాణోత్సవం సందర్భంగా విజయవాడ దుర్గగుడి తరఫున దేవదాయకమిషనర్ సత్యనారాయణ ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆయనతోపాటు ఆయన వెంట ఉన్న బృందానికి అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్ మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి వేద మంత్రాల మధ్య పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం దేవదాయ కమిషనర్‌కు, ఏఈవో వెంకటరెడ్డి, వైదిక సిబ్బంది మూర్తి యజ్ఞనారాయణ, ఓగేటి రమేష్ బాబు, ఉండి శ్రీనివాస్, వేదపండితులు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనాపాటి, తంగిరాల వెంకటేశ్వర ఘనాపాటి తదితరులకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గగుడి ధర్మపథం వేదికపై...

దుర్గగుడిలో ధర్మపథం వేదికపై ఆదివారం నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ వి.ఉమామహేశ్వరుడు పాత్రుడు ఆధ్వర్యంలోని కళాకారుల బృందం వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. హావ భావ నటనలో తమ కౌశల్యాన్ని ప్రదర్శించి ఆహుతులను అలరించారు.



దుర్గగుడి ధర్మపథం వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

సీసాలు, క్యాన్లలో పెట్రోల్ విక్రయాలు వద్దు: కలెక్టర్

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6 వరకు పెట్రోలు బంకుల్లో సీసాలు, క్యాన్లలో పెట్రోలు నింపవద్దని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ ఉత్తర్వులు జారీచేసినట్టు ఆయన తెలిపారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను తప్పక పాటించాలన్నారు. పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు ఈ ఉత్తర్వులు అమలయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.



సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వన్‌టౌన్, మే 19: వన్‌టౌన్‌లోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (2007-08) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. భవానీపురంలోని ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 16 ఏళ్ల తరువాత కలుసుకున్న ఆనందం లో అందరూ ఉత్సాహంగా గడిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులంతా గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని టి.నాగేశ్వరరావు, డి.జగదీష్, ఆర్.జైల్‌సింగ్, వి.రమేశ్, వి. భవానీ, ఆర్.ప్రసన్న తదితరులు పర్యవేక్షించారు.

కౌంటింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక, మే 19: కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టర్ ఢిల్లీరావు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో నిరంతర నిఘాతో పటిష్టమైన మూడంచెల భద్రత ఉందన్నారు. ఆయా ప్రాంతాలన్నీ నిరంతరం సీసీ కెమేరాల ద్వారా 24 గంటలూ పర్యవేక్షించాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను స్ట్రాంగ్ రూంల పరిసరాల్లో ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు ఉండాలన్నారు. బారికేడ్లు, మెష్‌లు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఇతర లెక్కింపు సిబ్బంది వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కేంద్రంలో అసెంబ్లీకి, పార్లమెంట్‌కు చెరో 14 టేబుల్స్ చొప్పున 28 టేబుల్స్‌తోపాటు తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల కేసుల విచారణ

త్వరగా పూర్తిచేయండి

- కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

మచిలీపట్నం టౌన్, మే 19: ఎన్నికల ఆధారిత కేసులను త్వరగా విచారణ పూర్తిచేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలక్షన్ ఆధారంగా నమోదైన ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డీఎస్పీలు తమ డివిజన్ పరిధిలోని కేసులను ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికలు ప్రక్రియను ప్రశాంతంగా పూర్తిచేశామని, అలాగే కౌంటింగ్ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వెంకటేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారులపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు, మే 19: మిర్చి అమ్మకాల్లో నలుగురు వ్యాపారులు తమను మోసం చేశారని మండలంలోని కొల్లికుళ్ల, వెంకటాపురం గ్రామాల మిర్చి రైతులు సుమారు 50 మంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కంచికచర్ల గ్రామంలోని పెద్దబజార్, ఇందిరా కాలనీకి చెందిన మిర్చి వ్యాపారులు దొడ్డ వెంకటరామ నరసింహారావు, అతడి కుమారుడు దొడ్డ వెంకట వాసుదేవ కుమార్, వారి బంధువులు కాజా శ్రీనివాసరావు, జయిన వీరభద్రరావు పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన మద్దుకూరి వెంకటేశ్వర్లు అనే మధ్యవర్తి ద్వారా ఈ ఏడాది మార్చి నెలలో సుమారు 710 క్వింటాళ్ల మిర్చిని తమ వద్ద కొనుగోలు చేశారన్నారు. రోజులు గడుస్తున్నా తమకు రావాల్సిన నగదు సుమారు రూ.96,89,464 ఇవ్వటం లేదని మిర్చి రైతులు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌ని ఆశ్రయించారు. మిర్చి రైతులను మోసగించిన నలుగురు మిర్చి వ్యాపారులపై, మధ్యవర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ సాహితి

ఇంపికాప్స్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వర్క్‌షాప్

ధర్నాచౌక్, మే 19: ది ఇండియన్ మెడికల్ ప్రాక్టిషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ (ఇంపికాప్స్) ఆధ్వర్యంలో నగరంలోని ఇంపికాప్స్ పంచకర్మ ఆసుపత్రిలో 'ఆయుర్వేద సద్వైద్య సంభాష పరిషద్' ఆదివారం జరిగింది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములు భానుప్రకాష్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ క్వాలిఫైడ్ ఆయుర్వేద వైద్యులు తమ ప్రాక్టీస్‌లోని అనుభవ ఆయుర్వేద చికిత్స విశేషాలు ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాపు నిర్వహించారన్నారు. ప్రముఖ డాక్టర్ ఎస్.సాహితి మాట్లాడుతూ తన 22 ఏళ్ల వైద్య వృత్తిలో కేశ సంరక్షణ, బట్టతల, చుండ్రు వంటి విషయాల గురించి తెలిపారు. డాక్టర్ పమ్మి సూర్యకుమార్, డాక్టర్ ప్రియాంక, రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పశువైద్య సేవలకు యూజర్ చార్జీలు సహించం

- ఏపీ రైతుసంఘం రాష్ట్ర నేతలు

ధర్నాచౌక్, మే 19: పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలకు డబ్బు లు వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జిఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ పేదలు, చిన్న, సన్నకారు రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరిని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం వారిపైనే భారాలు మోపడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా పాడి రైతులు, పశుపోషకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పశు వైద్యసేవలపై రుసుము వసూలు చేసే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాడిరైతులను ప్రోత్సహించేందుకు విధానపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ప్రతిజ్ఞ

కృష్ణాజిల్లా ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్

జిల్లా నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, మే 19: కృష్ణాజిల్లా ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్ నూతన అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన కే సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం ఈశ్వర్ రెసిడెన్సీలో మచిలీపట్నం రీజియన్ ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూ తన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన కే సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా మచిలీపట్నానికి చెందిన పి.ధనుంజయ్, కోశాధికారిగా ఉనికిలికి చెందిన ప్రదీప్ ఎన్నికయ్యారు. మచిలీపట్నానికి చెందిన అలుగోజు శేఖర్‌ను జిల్లా కన్వీనర్‌గా, ఉపాధ్యక్షుడిగా పూర్ణాచారి, సంయుక్త కార్యదర్శిగా మనోజ్, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, రాజగోపాలాచారి, వెంకటరత్నం, భాస్కరరావు, రవీంద్రను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ కొండలరావు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి ప్రసంగించారు. మచిలీపట్నం రీజియన్ పరిధిలో 40 పైగా ఎస్‌బీఐ శాఖలున్నాయని, వాటిల్లో పనిచేస్తున్న అప్రయిజర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను జాయింట్ ఉ ద్యోగుల సంఘ నేతలతో చర్చిస్తామన్నారు. సెకండ్ అప్రయిజర్ చార్జీలు రూ.3వేలు చెల్లించాలన్నారు. అప్పలా

అలరించిన పంచరత్న గోష్టిగానం

విజయవాడ కల్చరల్, మే 19: 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు.. చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు'... అంటూ సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న కృతులను గోష్టిగానం చేసి శ్రోతలను పరమానంద భరితులను చేశారు. శ్రీ త్యాగరాజ స్వామి 257వ జయంత్యుత్సవాల్లో భాగంగా చివరి రోజు సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఆదివారం పంచరత్న గోష్టి నిర్వహించారు. సద్గురు సంగీతోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. త్యాగరాజస్వామి విరచిత ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానంతో సంగీత ప్రియులను అమృత రసరాగ ప్రవాహంలో మునకలు వేయించారు. తొలుత నాట రాగం ఆదితాళంలో 'జగదానందకారక జయ జానకీ ప్రాణ నాయకా' అంటూ పంచరత్నాలులో తొలి కృతిని పాడి జనరంజకం చేశారు. వెంటనే గౌళరాగం ఆదితాళంలో 'దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో కడు దుర్విషయాకృష్టుడై గడియ గడియకు నిండారు' అంటూ రెండో కృతిని పాడి ఆహుతులను అలరించారు. తదుపరి ఆరభి రాగం ఆదితాళంలో 'సాధించెనే ఓ మనసా బోధించిన సన్మార్గ వచనములంటూ ప్రారంభించి' సమయానికి తగు మాటలాడెనే దేవకీ వసుదేవుల నేగించినట్లు' అనుపల్లవితో సాగిన ఈ కృతిగానం సుధారసాలను ఒలికించింది. వరాళిరాగం ఆదితాళంలో 'కనకన రుచిరా కనకవసన...నిన్ను దిన దినమున మనసున చదువున' కృతిని పాడి సంగీత విద్వాంసుల బృందం కరతాళధ్వనులు అందుకొంది. చివరిగా ఎందరో మహానుభావులు కీర్తన గానం చేసి పంచరత్న గోష్టి గానానికి ముక్తాయింపు పలికారు. బృందగానంలో సంగీత విద్వాంసులు పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, కచేరిలో పాల్గొన్నారు. మంగళంపల్లి స్వర్ణ, ఎన్‌సీహెచ్ బుచ్చయాచార్యులు శిష్య బృందం, ఎ.మృత్తిక, తుమ్మల శ్రీలత, చిట్టా దీపక్, సీఎన్ఎస్ త్రిశ్య, ఎన్.భవ్యశ్రీ గీతిక, ఎన్‌జీఎస్ కీర్తన, సాత్విక మోహన్, చిట్టా కార్తీక్, సీవీపీ శాస్త్రి, మల్లాది సోదరులు, వి.కృష్ణవేణి, బీవీఎస్ ప్రసాద్, షణ్ముఖ శ్రీవత్స, హేమాద్రి చంద్రకాంత్, కె.అరవింద్, కె.సుబ్రహ్మణ్య రాజు, కస్తూరి భార్గవ్, మొదలి కృష్ణసాయి, సిహెచ్.సూర్య, బీవీఎస్ కృష్ణ తదితరులు తమ గాత్ర వాద్య కచేరీలతో బృందగానంలో పాల్గొన్నారు. త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనల గానానికి చింత రవి బాలకృష్ణ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



పంచరత్న గోష్టిగానంలో పాల్గొన్న సంగీత విద్వాంసులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌వో శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఎయిడ్స్ వ్యాధిని అంతం చేద్దాం

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు

కృష్ణలంక, మే 19: ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, ఎయిడ్స్ రహిత సమాజానికి కృషితో పాటు బాధిత కుటుంబాలకు అండగా ఉందామని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు అవుదామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా మే నెల 3వ ఆదివారం కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణాధికారి ఉషారాణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి కారణంగా జిల్లాలో గతేడాది 661 మంది మృతిచెందారన్నారు. వారికి, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపి ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకొనేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లాలో 7 హెచ్‌ఐవీ నిర్ధారణ కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలు చేస్తున్నామని, 75 ప్రభుత్వాసుపత్రులు, 10 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలందిస్తున్నారన్నారు. జిల్లాలో 17,505 మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులున్నారని వీరిలో సుమారు 1800 మందికి ప్రతినెల రూ. 2,250 ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అనంతరం బలమైన సమాజ నిర్మాణానికి హెచ్‌ఐవీ బాధితో జీవిస్తున్న వారి పట్ల ప్రేమతో సంఘీభావం తెలుపుతానని బాధ్యత కలిగిన పౌరుడిగా పరిపూర్ణ చైతన్యం అవగాహనతో బాధ్యతాయుతమైన ప్రవర్తనతో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధిని అరికట్టేందుకు మనసావాచా, కర్మణతో ముందుంటానని ప్రతిజ్ఞ చేయించారు. డీపీఎం పి.కిరణ్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ ఎ.రమేష్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఏఎస్సై దుర్మరణం



ఇబ్రహీంపట్నం, మే 19: స్థానిక విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై రమణ (62) మృతిచెందారు. విజయవాడ సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన రమణకు జూపూడి చెక్‌పోస్టు వద్ద డ్యూటీ వేశారు. శనివారం రాత్రి వచ్చిన ఆయన రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడగా విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. రమణ ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్నారు. ఇంతలోనే రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, తోటి పోలీసులు కన్నీటిపర్యంతమయ్యారు.

సీపీ రామకృష్ణ నివాళి

గుణదల: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఎస్సై ఎన్‌వీవీ రమణ మృతదేహానికి విజయవాడ సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ నివాళులర్పించారు. ఆదివారం పటమటలోని ర మణ స్వగృహానికి చేరుకున్న ఆయన రమణ పార్థివదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు మానసిక స్థైర్యం ఇవ్వాలని పోలీసు శాఖాపరంగా రమణ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసు అధికార లాంఛనాలతో ఏఎస్సై ఎన్‌వీవీ రమణ మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. డీసీపీ టి.హరికృష్ణ, ఎస్‌బీ ఏడీసీపీ టి.కనకరాజు, సీసీఎస్ ఏసీపీ స్రవంతి రాయ్, ఏఆర్ ఏసీపీ డి.ప్రసాద్, సీఐలు ఎం.సత్యన్నారాయణ, మోహన్ రెడ్డి, ప్రసాద కుమార్, లక్ష్మీనారాయణ, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.



రమణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ

జూడో క్రీడలో మౌలిక వసతులకు ప్రణాళిక

ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్‌గా నాగూరయ్య ఎన్నిక

విజయవాడస్పోర్ట్సు, మే 19: రాష్ట్రంలో జూడో క్రీడకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రతి జిల్లాలో మౌలికవసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ ఆడవరపు నాగూరయ్య వెల్లడించారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ సహా తొమ్మిది మందితో ప్రత్యేక కమిటీని ఆదివారం ఎగ్జిక్యూటివ్, జనరల్ బాడీ సమావేశాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్, ప్రెసిడెంట్ గణేశ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ ఎస్.పవన్ సందీప్, ట్రెజరర్ టీవీవీ. రమణ పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ నాలుగేళ్ల తన పదవీ కాలంలో జిల్లాలో జూడోకు మౌలిక వసతులను కల్పిస్తామని, విజయవాడ కేంద్రంగా అకాడమీ ద్వారా ప్రతిభ గల క్రీడాకారులు 60 మంది ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. 2025లోగా ఏపీలో జాతీయ జూడో చాంపియన్‌షిప్ నిర్వహించాలని, 2029లోగా అంతర్జాతీయ ఈవెంట్ ఇండియా ద్వారా ఏపీలో నిర్వహణకు సమయాత్తం కావాలని జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించామన్నారు. అలాగే జూడో అభ్యసనపై ప్రసారమాధ్యమాల్లో విస్తృతప్రచారం, శిక్షణలో గాయపడిన క్రీడాకారులకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేకంగా ఒక అత్యాధునిక ఆసుప్రతి నిర్మించాలని ఈ సమావేశంలో తీర్మానించినట్లు వివరించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై నూతన కమిటీని అభినందించారు.

కమిటీ: ఏపీ చైర్మన్‌గా ఆడవరపు నాగూరయ్య(తిరుపతి), వైస్ చైర్మన్‌గా ఉప్పలపాటి హరిప్రసాదరాజు, చీఫ్ ప్యాట్రన్‌గా జొన్నలగడ్డ శైలజ, సభ్యులుగా కె. అశోక్‌కుమార్, సీహెచ్ అప్పాజీ, డాక్టర్ ఎ.అనుదీప్, కె.ధనుంజయవర్మ, పి.మల్లికార్జునరెడ్డి, ఆర్.రమేష్ నాయుడు, కె.రోషన్ బాలచంద్రన్, బి.సుబ్రహ్మణ్యం.



నాగూరయ్యను అభినందిస్తున్న సీఈవో వెంకట్, ఇతర సభ్యులు

ఇసుక దోపిడీదారులెవరు..?

- కీసర స్టాక్ యార్డుపై ప్రభుత్వ పెద్దల కన్ను
- కేసు కూడా నమోదు చేయని పోలీసులు
- తూతూమంత్రపు దాడులతో సరి

కంచికచర్ల, మే 19: కీసర స్టాక్ యార్డులో ఇసుక అడ్డగోలు దోపిడీకి అధికార పార్టీ నేతల వత్తాసు ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. పెద్దల ఒత్తిడి వల్లే పోలీసులు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని అంటున్నారు. ఇసుక దోపిడీ గురించి మీడియాలో కథనాలు వస్తున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, పోలీస్, సెబ్ అధికారుల నుంచి స్పందన శూన్యం. ఈ దోపిడీ వెనుక అధికార పార్టీ పెద్దల హస్తం ఉందన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. అంతకుముందు కంచికచర్ల మండలం మున్నలూరు రీచ్‌లో, చందర్లపాడు మండలం కాసరబాద, ఏటూరు రీచ్‌లో పెద్దలు అడ్డగోలుగా తవ్వకాలు సాగించారు. ప్రస్తుతం స్టాక్ యార్డు ఇసుక కూడా పెద్దల అండతోనే దోచేస్తుండటంతో అధికారులు జంకుతున్నారని అంటున్నారు. శనివారం రాత్రి కంచికచర్ల పోలీసులు యార్డుపై దాడి చేసి, ఒక లారీని, భారీ యంత్రాన్ని పట్టుకున్నారు. అప్పటికప్పుడు లారీని కంచికచర్ల మార్కెట్ యార్డుకు తరలించారు. భారీ యంత్రాన్ని బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేకపోవటంతో అక్కడే వదిలేసి, తాళాలు వేసి ఇద్దరు ఆపరేటర్లనూ అదుపులోకి తీసుకున్నారు. అయితే, దీనిపై ఎలాంటి కేసు లేదు. పెద్దల ఒత్తిడి వల్లే పోలీసులు కేసు నమోదు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

ఠాగూర్ గ్రంథాలయంలో యోగా శిక్షణ

గవర్నర్‌పేట, మే 19: స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. గురు విశ్వస్ఫూర్తి అనుగ్రహించిన ఆసన, ప్రాణాయామ, యోగా ప్రక్రియపై యోగా ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించారు. ప్రస్థాన సాధనతో ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి చేరవచ్చని విశ్వస్ఫూర్తి గురువు బోధించారని స్ఫూర్తి కుటుంబం ట్రస్టీ చొప్పవరపు నారాయణరావు వివరించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, స్ఫూర్తి కుటుంబ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




క్యూలలో కిటకిటలాడుతున్న భక్తులు

దుర్గమ్మ గుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, మే 19: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. దీంతో భక్తులకు ఇబ్బంది కలుగకుండా అమ్మవారి దర్శనం శీఘ్రంగా లభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిత్యార్జిత సేవల్లో పాల్గొని, దుర్గామల్లేశ్వరులను దర్శించుకుని భక్తులు అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ చేశారు. అరుణ పారాయణ. ఆది త్యహృదయ పారాయణలు చేశారు. దుర్గమ్మను దేవదాయ కమిషనర్ సత్యనా రాయణ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం అందించారు.


వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

పాయకాపురం, మే 19: శ్రీమతి గోర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను పాయకా పురం పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామికి ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోర్తి శ్రీనివాస చక్రవర్తి ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణకారులు, వడ్రంగిలు, శిల్పకారులు, కంచర, పంచ వృత్తిదారుల భవిష్యత్తు బాగుండాలని ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు దిట్టకవి రాఘవేంద్రరావు, అన్నే బాబురావు, చిలకలకూడి రవి, మనపర్తి సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట, మే 19: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా సోమవారం ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు స్క్యూబ్రిడ్జి సెక్షన్, స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి. వి.సుధాకర్ తెలిపారు. ఫకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపు రం, ఎంజీ రోడ్, బెంజిసర్కిల్ ప్రాంతం, మైత్రీయ వీధి ప్రాంతాల్లో సరఫరా నిలి పివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.










ఐరన్‌యార్డు డ్రెయిన్‌లో ముందుకు పారని మురుగు


లేబర్ కాలనీలోని మెయిన్ డ్రెయినేజీ..


రామచంద్రరాజు స్కూల్ సమీపంలోని డ్రెయిన్‌లో కదలని మురుగు

43, 44 డివిజన్లలో

అధ్వానంగా డ్రెయినేజీలు

పూడిక తీయకపోవడంతో పారని మురుగు


రిలయన్స్ మార్టు సమీపంలో పూడుకుపోయిన డ్రెయిన్

దుర్గంధంతో అల్లాడుతున్న ప్రజలు

భవానీపురం, మే 19: 43, 44వ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో పూడికలు సకాలంలో తీయకపోవడంతో మురుగు పారక అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు దుర్గంధంతో అల్లాడుతున్నారు. కోట్లలో వ్యాపారం జరిగే 43వ డివిజన్ ఐరన్‌యార్డులో రోడ్లు నిర్మించినా డ్రెయినేజీలను బాగు చేయలేదు. భవానీపురం బైపాస్‌ను ఆనుకుని ఉన్న రిలయన్స్‌మార్టు లోపలి వీధుల్లో డ్రెయిన్లను నాణ్యత లేకుండా నిర్మించడంతో దెబ్బతిన్నాయి. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. ఊర్మిళానగర్‌లోని అంతర్గత వీధుల్లో డ్రెయిన్ల పూడికలు తీయలేదు. హెచ్‌బీ కాలనీలో చాలా ప్రాంతాల్లో డ్రెయిన్లు లేవు. 44వ డివిజన్ లేబర్‌కాలనీలో మసీదు, వీఎంసీ కల్యాణ మండపం, ఉప్పలపాటి రామచంద్రరాజు హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న మేజర్ డ్రెయిన్లలో పూడికతీతలు లేక పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షాలకే డ్రెయినేజీలు పొంగి లేబర్‌కాలనీలోకి మురుగు వెళుతోంది. దీంతో వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వస్తున్నందున ఈ కాలనీల్లో డ్రెయిన్ల పూడికలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ షెల్టర్‌లోకి ప్రవేశం కష్టతరమే

● మెట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, పిల్లలు

పటమట: బెంజిసర్కిల్ సమీపంలో మచిలీపట్నం వెళ్లే వైపు బందరు రోడ్డులో నిర్మించిన బస్‌షెల్టర్‌ను అందంగా, ఆకర్షణీయంగా నిర్మించినా, లోపలికి వెళ్లడానికి మెట్లు ఏర్పాటు చేయలేదు. వయోవృద్ధులు, మహిళలు ఎండవేడిమికి, వర్షానికి బస్ షెల్టర్‌లోకి ఎక్కలేక బయటే పడిగాపులు పడుతున్నారు. మచిలీపట్నం, గుడివాడ, భీమవరం వైపు వెళ్లే ప్రయాణికులు, సమీపంలోని కార్పొరేట్ కాలేజీల విద్యార్థులు వేల మంది ఇక్కడే బస్సులు ఎక్కుతుంటారు. బస్ షెల్టర్ నిర్మాణం, రోడ్డు కన్నా ఎత్తులో ఉండటంతో ప్రయాణికులు పైకి ఎక్కడానికి ఇబ్బంది పడుతున్నారు. వృద్ధుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్డు కంటే ఎత్తుగా ఉన్న బెంజిసర్కిల్ వద్ద బందరు రోడ్డులోని బస్‌షెల్టర్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

▸ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : **88024 89999**
AJB-182135

EDUCATION

▸ మంచి ఉద్యోగం కావాలా? చదవండి B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / డైరీ సైన్స్ / AI & ML; BBA; B.Voc. మెడికల్ ఇమేజింగ్ . అడ్మిషన్లకై సంప్ర : **84658 74867**, మేరీ స్టెల్లా కాలేజ్, విజయవాడ.
AJB - 182328

WANTED

▸ విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. తందూరి చెఫ్, నార్త్ ఇండియన్ చెఫ్, చైనీస్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, ఎలక్ట్రీషియన్స్, సెక్యూరిటీ గార్డ్. ఆకర్షణీయమైన జీతం. సంప్ర. సెల్ : **72 8888 5598**
AJB - 178

2 బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయిస్, గృహిణులు, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-70, Q: 10th, జీ : 12-15 వేలు, సెల్ : **8498949164**
AJG-8387

▸ విజయవాడ, గాంధీనగర్‌లోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు కనీస అనుభవం కల నర్సింగ్ స్టాఫ్ (ANM / GNM), C'arm / x ray టెక్నీషియన్స్, హెల్పర్స్ (M) కావలెను. ఫోన్ : **0866-2570333, 90300 06768**
AJB - 7622

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



బీసెంట్‌రోడ్డులోని మహంతి చేపల మార్కెట్ సమీపంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేత సీహెచ్ బాబూరావు తదితరులు
పటమట ఈ-సేవా కేంద్రం వద్ద సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన సీపీఎం నేతలు

గవర్నర్‌పేట, మే 19: దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించిన పుచ్చలపల్లి సుందరయ్య సేవలు, జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమనేత, సీపీఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం, సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సభలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీసెంట్‌రోడ్డులోని మహంతి చేపల మార్కెట్ సమీపంలో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. సుందరయ్య స్ఫూర్తితో సీపీఎం పోరు సాగిస్తుందని, దేశ ఐక్యతకు త్యాగాలకు సిద్ధంగా ఉందని బాబూరావు అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, నేతలు బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, పీర్ సాహెబ్, వై.సుబ్బారావు, నాగేశ్వరరావు, లక్ష్మణ, టి.శ్రీను, వెంకటేశ్వరరెడ్డి, నిజాముద్దీన్, సుధాకర్, మురళి, భూలోకం తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ నియోజకవర్గంలో..

అజిత్‌సింగ్‌నగర్/పాయకాపురం: సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్ నగర్, వాంబేకాలనీ, శాంతినగర్, ప్రకాష్‌నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం సీపీఎం నేతలు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు నివాళులర్పించారు. అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డీవీ కృష్ణ, కె.శ్రీదేవి, కె.దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పటమట ఈ-సేవా కేంద్రం వద్ద..

పటమట: ఈ-సేవాకేంద్రం వద్ద సీపీఎం 14వ డివిజన్ కార్యదర్శి బి.రవీంద్ర అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.కృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నగర నాయకులు వి. గురుమూర్తి, సీఐటీయూ అధ్యక్షులు వీబీ రాజు, బి.బెనర్జీ, వై.ఏడుకొండలు, ఎస్.వేణుగోపాలకృష్ణ, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి తగిన ఫలితం అందించే పాలన రావాలి

వన్‌టౌన్: కార్మికుల కష్టానికి తగిన ఫలితం అందించే పాలన రాష్ట్రంలో రావాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయ సత్తిబాబు ఆకాంక్షించారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో సుందరయ్య చిత్రపటానికి సత్తిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణకు, రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు, సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. నాయకులు ఉయ్యాల కొండ, లక్ష్మి, సుబ్బారావు, రవణమ్మ పాల్గొన్నారు. మునిసిపల్ కార్మికులు నివాళులర్పించారు.


విజయాటాకీస్ సెంటర్‌లో బిర్యానీ ప్యాకెట్లు పంచుతున్న కార్పొరేటర్ బాలస్వామి

టీడీపీ గెలుపును కాంక్షిస్తూ పేదలకు బిర్యానీ పంపిణీ

గవర్నర్‌పేట, మే 19: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అవ్వాలని, విజయవాడ ఎంపీగా కేశినేని చిన్ని, సెంట్రల్ ఎమ్మెల్యేగా బొండా ఉమామహేశ్వరరావు గెలవాలని ఆకాంక్షిస్తూ ఆదివారం 23వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో 200 మంది పేదలు, అనాథలకు చికెన్ బిర్యానీ ప్యాకెట్లను ఆ పార్టీ నేతలు పంపిణీ చేశారు. బీసెంట్ రోడ్డు, నక్కలరోడ్డు, డోర్నకల్ రోడ్డు, ఏలూరు రోడ్డు, బందరు రోడ్డులోని రంగా విగ్రహం సెంటర్, విజయాటాకీస్ సెంటర్లలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా సహాయ కార్యదర్శి కోటి, సూర్య, రత్న, రమణ, రాజేంద్ర పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ


వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న వయోవృద్ధ చారిటబుల్ సభ్యులు

సత్యనారాయణపురం, మే 19: ఎవరూ పట్టించుకోకుండా నిస్సహాయ స్థితిలో ఉన్న 70 ఏళ్లు దాటిన వృద్ధులను గుర్తించి వారికి ప్రతీ నెలా నిత్యావసర వస్తువులు, మందులు అందజేస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని సెంట్రల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు డాక్టర్ మల్లు ప్రసాద్ అన్నారు. అల్లూరి సీతారామ రాజు వంతెన సమీపంలోని విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత వికాస్ సంఘ్వీ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందుల పంపిణీ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, నిత్యావసర వస్తువులు అందిం చారు. దాతలు జైనమ్ సంఘ్వీ, ఆన్స్ సంఘ్వీ, మేనేజింగ్ ట్రస్టీలు తట్టి అర్జునరావు, ఉమామహేశ్వరరావు, ఎన్‌వీయూ సతీష్‌కుమార్, అంకేశ్ కుమార్, డాక్టర్ ఎవీఎస్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
& 99854 11868, 99854 85777, 99854 11733,
99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
& సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

దిక్సూచి DIKSUCHI



ఇండియా శ్రామిక మార్కెట్

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్థభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జీ20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు. ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

ఇండియన్ ఎకానమీ

తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్



ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామికరంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్నవారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తుల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామికరంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు (సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-4

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్



ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద ఆంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:

1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR

2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT

3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB

4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK

5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. సమాధానం: (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

2. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

3. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

5. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏవిఎటి?
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.

4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handగాను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికై ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

నక్సలైట్ టెస్ట్ పేరుతో ఆటవికం

మహిళలను తాకరాని చోట తాకుతూ బలగాల అరాచకం



రఘు మిడియామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆధార్ లేకుంటే ఆదివాసీ మహిళలకు హింసే
- మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ
- రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు
- అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం
- 'ఆంధ్రజ్యోతి'తో.. ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళలను తాకరాని చోట తాకడం.. ఈ పరీక్షలో మహిళ వక్షోజాల నుంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సిలేంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలేంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలేంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవిబిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత కర్కశంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలా మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్టులు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. విగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లోని బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. పూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'



విజయవాడ పటమట ప్రాంతంలో మబ్బులు కమ్మేసిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. పిడుగులు.. నేడూ కొనసాగే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పెదకూరపాడులో 55.5, వత్సవాయిలో 40, జగ్గయ్యపేటలో 39.5, అడ్డతీగలలో 38, చింతలపల్లిలో 36, అనపర్తిలో 35.2, రావికమతంలో 35.7, రాజవొమ్మంగిలో 35, బిక్కవోలులో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం మన్యం, అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరు జిల్లాల్లోని 24 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

- రైల్వే, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం
- లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు
- రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు
- సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్‌నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీనగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి 'నియామకపత్రాన్ని' కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాలవ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూడగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయ పన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్, రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్టు సమాచారం.

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం ● 20 మే 2024

సెలబ్ ఫిట్



బొద్దుగుమ్మ

ఒకే ఒక్క చాన్స్ కోసం పరితపించలేదు. 'వెండితెర'పై వెలిగిపోవాలనీ కలలు కనలేదు. విదేశాల్లో చదివి... ఉద్యోగం కోసం ముంబయి వచ్చి... అనుకోకుండా నటి అయింది పరిణీతి చోప్రా. కెరీర్ ఆరంభంలో దూసుకుపోయినా... ఆ తరువాత అపజయాలు ఎదురైనా... ఆమె ఆత్మవిశ్వాసం చెక్కు చెదరలేదు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని ముందుకు సాగే మనోధైర్యం ఇచ్చింది... యోగా, సమతుల ఆహారం అంటుంది పరిణీతి.

విదేశీ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువు, మార్కెటింగ్ విభాగంలో కొలువు... సినిమా రంగం అనేది అసలు పరిణీతి చోప్రా ఆలోచనల్లోనే లేదు. కెరీర్‌లో భాగంగా అందివచ్చిన అవకాశాన్ని ఆమె సద్వినియోగం చేసుకుంది. హరియాణా అంబాలాలో పుట్టి పెరిగిన పరిణీతి తండ్రి పవన్ చోప్రా వ్యాపారి. తల్లి రీనా గృహిణి. ప్రముఖ నటులు ప్రియాంకా చోప్రా, మీరా చోప్రా, మనారా చోప్రా ఆమె కజిన్స్. అంబాలా 'జీసస్ అండ్ మేరీ కాన్వెంట్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన పరిణీతి చదువులో ముందుండేది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ కావాలని కలలు కన్న ఆమె... 17 ఏళ్ల వయసులో బ్రిటన్ వెళ్లింది. అక్కడి 'మాంచెస్టర్ బిజినెస్ స్కూల్'లో బిజినెస్, ఫైనాన్స్, ఎకనామిక్స్‌లో ట్రిపుల్ ఆనర్స్ డిగ్రీ పొందింది. కొత్తగా వర్సిటీకి వచ్చిన విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు తీసుకొనేది. చదువుకొంటూనే... 'మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్'లో కేటరింగ్ విభాగం హెడ్‌గా పార్ట్ టైమ్ ఉద్యోగం చేసింది. పరిణీతి మంచి గాయని కూడా. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. సంగీతంలో బీఏ ఆనర్స్ పూర్తి చేసింది. చిన్నతనంలో ప్రియాంకా చోప్రాతో కలిసి పలు వేదికలపై నాటకాలు వేసేది. ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది.

అనుకోని ప్రయాణం...

ఆర్థికమాంద్యం దెబ్బకు 2009లో భారత్‌కు తిరిగి వచ్చిన పరిణీతి... తన నివాసాన్ని ముంబయికి మార్చింది. అక్కడి 'యశ్‌రాజ్ ఫిలిమ్స్' (వైఆర్ఎఫ్) ప్రొడక్షన్ కంపెనీలో పబ్లిక్ రిలేషన్ కన్సల్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించింది. అదే ఆమె కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. "నేను చదువుకున్నదానికి, నాకున్న సినీ పరిజ్ఞానానికి ఈ ఉద్యోగం సరిగ్గా సరిపోతుందని అనుకున్నా. అయితే 2010లో విడుదలైన 'బ్యాండ్ బాజా బారాత్' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు నాకు బలంగా అనిపించిందేమిటంటే... నటించాలని. ఎప్పుడైతే నటి కావాలన్న ఆకాంక్ష మొదలైందో... ఇక నేను ఆ ఉద్యోగంలో ఉండలేకపోయాను. వైఆర్ఎఫ్ క్యాస్టింగ్ డైరెక్టర్‌ను కలిసి విషయం చెబితే... తను సరదాగా డమ్మీ ఆడిషన్ ఒకటి చేయమన్నారు. 'జబ్ ఉయ్ మెట్'లో ఓ చిన్న బిట్ చేశాను. దాని గురించి మరిచిపోయాను. తరువాత ఆ వీడియో వైఆర్ఎఫ్ అధినేత ఆదిత్య చోప్రా చూసి నాకు కబురు పంపారు. ఆయనకు అది బాగా నచ్చిందట. అంతే... ఒకేసారి మూడు చిత్రాలకు సైన్ చేశాను. అలా నా సినీ కెరీర్ ప్రారంభమవడానికి పరిస్థితులు వాటంతటఅవే కలిసివచ్చాయి" అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న పరిణీతి తొలి చిత్రం 'లేడీస్ వర్సెస్ రికీ బహల్'. రణ్‌వీర్‌సింగ్, అనుష్కా శర్మ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా 2011లో విడుదలైంది. అందులో పరిణీతి నటనకు 'ఫిలిమ్‌ఫేర్'తో పాటు పలు అవార్డులు దక్కాయి.

పాత్ర కోసం ఎందాకైనా...

అర్జున్‌కపూర్ తొలి చిత్రం 'ఇషక్‌జాదే'తో కమర్షియల్ హిట్ మాత్రమే కాదు... జాతీయ అవార్డు కూడా అందుకుంది పరిణీతి చోప్రా. కెరీర్ ఆరభంలో హిట్స్ స్వాగతం పలికినా... ఆ తరువాత వరుస ఫ్లాప్‌లు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయితే ఆమె కుంగిపోలేదు. తనవైపు నుంచి ఎలాంటి లోపం లేకుండా ప్రతి పాత్రకూ వంద శాతం శ్రమిస్తుంది. సినిమాల్లోకి వచ్చేముందు 86 కిలోల బరువున్న ఈ భామ... 28 కిలోలు తగ్గింది. గత ఏడాది రాజకీయ నాయకుడు రాఘవ్ చద్దాను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె... ఈ మధ్య ఓటీటీలో విడుదలైన 'అమర్‌సింగ్ చంకీలా'లో అమర్‌జీత్ పాత్ర కోసం పదిహేను కిలోల బరువు పెరిగింది. మరో ప్రాజెక్ట్ కోసం తిరిగి బరువు తగ్గే పనిలో నిమగ్నమైంది. తన వెయిట్‌లాస్ స్టోరీని ఇన్‌స్టాలో పంచుకుంది. ఈ వీడియో ఎంతోమంది యువతకు స్ఫూర్తినిచ్చింది.

వర్కవుట్ ఇలా...

పరిణీతి చోప్రా నిత్య వ్యాయామాలు కాస్త భిన్నంగా ఉంటాయి. కళరిపయట్టు వంటి మార్షల్ ఆర్ట్స్‌ను తన ఫిట్‌నెస్‌లో చేర్చింది. కళరియపట్టు కోసం ప్రత్యేక శిక్షణ కూడా తీసుకుంది. జిమ్‌లో కసరత్తులు చేస్తూనే... డ్యాన్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, ముఖ్యంగా యోగాకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇండోర్, అవుట్‌డోర్ ఎక్సర్‌సైజ్‌లు కలగలిపి ఉంటాయి. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు వీధుల్లో నడవడం, స్కూబా డైవింగ్‌లు చేయడం... ఏదో రకంగా శరీరానికి తగిన వ్యాయామం అందేలా చూసుకొంటుంది. జీరో సైజుల్లాంటి పేర్లతో బక్కపల్చగా కనిపించడంకంటే... బొద్దుగా అయినా ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యం అంటుంది. అదే దారిలో నడుస్తోంది.

- జిమ్‌కు వెళితే కార్డియో కోసం అరగంట ట్రెడ్‌మిల్. శారీరక దృఢత్వం కోసం వెయిట్‌లిఫ్టింగ్.
- దీంతోపాటు కళరిపయట్టు సాధన. 'ఇలాంటి కొత్త కొత్త కళల అభ్యాసం వల్ల శరీరం బ్యాలెన్స్‌డ్‌గా ఉంటుంది. క్రమంతప్పని వ్యాయామంవల్ల రక్తప్రసరణ మెరుగయ్యి, చర్మానికి ప్రాణవాయువును ఇస్తుంది. తద్వారా చర్మం కాంతిమంతంగా తయారవుతుంది' అనేది పరిణీతి మాట.
- ఉదయం లేదా సాయంత్రం యోగా తప్పనిసరి. 'ఇది అద్భుతమైన వ్యాయామం. యోగా సాధనతో శరీరానికి కావల్సిన శక్తి వస్తుంది. నాజూకైన ఆకృతి సొంతమవుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. చేసే పనిపై ఏకాగ్రత కుదురుతుంది. మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. ఒక్క మ్యాట్ ఉంటే చాలు... ప్రపంచంలో ఎక్కడైనా... ఏ సమయంలో అయినా చేసుకోదగిన వ్యాయామం యోగా' అంటుంది పరిణీతి.
- కొన్ని రోజులు జిమ్‌కు విరామం ఇచ్చి పార్కుల వంటి అవుట్‌డోర్స్‌లో వాకింగ్ చేయడంవల్ల మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని, శరీరానికి కూడా ఉపశమనం లభిస్తుందని అంటుంది పరిణీతి. రోజు జిమ్‌కు వెళ్లి, శ్రమించాలన్న నియమం ఏదీ లేదని అంటుంది. అలా విరామం ఇచ్చినప్పుడు ఆమె ఎక్కువగా బ్రిస్క్ వాక్ చేస్తుంది.
- తరచూ చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకొని వర్కవుట్ చేస్తే బోర్ కొట్టకుండా ఉంటుందని, ఇష్టమైన క్రీడను ఫిట్‌నెస్ మెనూలో చేర్చుకొంటే ఉత్సాహం రెట్టింపు అవుతుందనేది ఈ స్టార్ ఆచరించి చెబుతున్న ఫిట్‌నెస్ పాఠం.

ఇదీ మెనూ...

'అమర్‌సింగ్ చంకీలా' కోసం పదిహేను కిలోలు పెరిగే క్రమంలో నచ్చిన వెరైటీలన్నీ తినేసింది పరిణీతి. ఇప్పుడు బరువు తగ్గే క్రమంలో ఆహారం విషయంలో ఎన్నో నియమాలు పెట్టుకుంది. మొదటగా తనకు ఇష్టమైన పిజ్జాతో పాటు ఇతర జంక్‌ఫుడ్స్‌ను పూర్తిగా మానేసింది. పోషకాలు పుష్కలంగా ఉన్న, ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే మెనూలో చేర్చింది.

- ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో బటర్‌తో బ్రౌన్ బ్రెడ్, రెండు ఎగ్‌వైట్స్, గ్లాసుడు పాలు లేదా పండ్ల రసం.
- మధ్యాహ్నం లంచ్‌కు పప్పుతో బ్రౌన్ రైస్, రోటీ, ఆకుకూరల వంటకం, సలాడ్.
- రాత్రి రోటీ, పప్పు లేదా పప్పు దినుసులతో చేసిన వంటకం. నిద్రపోవడానికి రెండు గంటల ముందే డిన్నర్ ముగుస్తుంది.



పాఠాలే కాదు... అవసరాలూ తెలుసు..

"ఆరోగ్యవంతమైన సమాజం అంటే అదెక్కడినుంచో రాదు. మన చుట్టుపక్కల ఉన్న వారందరూ ఆరోగ్యంతో ఉంటేనే అది సాకారమవుతుంది" అంటారు రాఖీ గంగ్వార్. స్కూల్ టీచర్ అయిన ఆమె... గ్రామీణ మహిళల్లో ఋతుక్రమ పరిశుభ్రత కోసం మూడేళ్ళ క్రితం ప్యాడ్ బ్యాంక్ ప్రారంభించారు. తన సేవలను యాభై అయిదు గ్రామాల్లో ఇరవై వేలమందికి పైగా విస్తరించారు.

"మహిళల్లో ఋతుక్రమ సమస్యలు చాలా సున్నితమైన అంశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వాటి గురించి ఇతరులతో మాట్లాడడం అపరాధంగా భావిస్తూ ఉంటారు. ఈ పరిస్థితి మారాలనేది నా తపన. అందుకే నాకు చేతనైనది చేస్తున్నాను" అని చెబుతారు 35 ఏళ్ళ రాఖీ గంగ్వార్. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లా బౌరియాలో... ప్రాథమిక పాఠశాల టీచర్. ఎప్పుడు సెలవు వచ్చినా... గ్రామీణ ప్రాంతాలకు వెళ్తారు. అక్కడ మహిళలతో సమావేశమవుతారు. ఋతుక్రమ ఆరోగ్యం గురించి, పరిశుభ్రత గురించి వివరిస్తారు.



అది ప్రమాదమని వారికి తెలీదు...

"విద్యార్థిగా ఉన్నప్పటి నుంచీ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని" అంటున్న రాఖీ... ఒక దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు. చిన్న వయసులోనే తండ్రి మరణించడంతో తల్లి, చెల్లెళ్ళకు ఆమే ఆధారమయ్యారు. "చదువంటే నాకు ప్రాణం. ప్రతి క్లాస్‌లోనూ ఫస్టే... కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా బాగా చదువుకోవాలనేది నా సంకల్పం. అందుకోసం కుట్లు, అల్లికలు, వస్త్రాలమీద పెయింటింగ్స్ ... ఇలా ఎన్నో పనులు చేశాను" అని ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్నో కష్టాలు పడుతూనే ఎంబిఎ, ఎంఎ చదివారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి, ప్రభుత్వ టీచర్‌గా చేరారు. బడికి వచ్చే బాలికలు తరచూ అనారోగ్యానికి గురికావడం ఆమెను కలవరపరచింది. వారిలో చాలా సమస్యలకు కారణం... ఋతుక్రమ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమేనని ఆమె గ్రహించారు. "మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు అందరు



మహిళలు ఆ సమయంలో వస్త్రాలను ఉపయోగిస్తూ ఉంటారు. కానీ వాటిని శానిటైజ్ చేయకపోతే ప్రమాదమని వారికి తెలీదు. సరైన ప్యాడ్స్ ఉపయోగించడం గురించి, ఋతుక్రమ ఆరోగ్యం గురించి ప్రచారం చెయ్యడం అవసరమనిపించింది" అని ఆమె వివరించారు. మొదట... తన విద్యార్థుల తల్లులతో, గ్రామంలోని మహిళలతో ఆమె ఒక సర్వే జరిపారు. "చాలామంది ఆ విషయం మాట్లాడడానికి ఇష్టపడలేదు. శానిటరీ ప్యాడ్స్ వారికి అందుబాటులో లేవు. ఎక్కువమందిని ఒక చోటికి చేర్చి చర్చిస్తే... వారిలో బెరకు పోతుందని నిర్ణయించుకున్నాను" అని చెప్పారు రాఖీ.

కాస్త కష్టమే, కానీ...

తొలి ప్రయత్నంగా... దాదాపు యాభై మంది మహిళలతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఋతుక్రమ సమయంలో పరిశుభ్రత లేకపోతే... ఆరోగ్యానికి ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించారు. తమ బడిలోనే శానిటరీ 'ప్యాడ్ బ్యాంక్' ఏర్పాటు చేసి... గ్రామంలోని మహిళలందరికీ అవి ఉచితంగా అందేలా చూశారు. ఆమె చేపట్టిన కార్యక్రమాలు పక్క గ్రామాల మహిళలనూ ఆకర్షించాయి. వారి కోరిక మేరకు అక్కడా ఆమె ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం 55 గ్రామాల్లో 20 వేల మందికి పైగా మహిళలకు, బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నారు. ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వైద్యులు, కౌన్సెలర్లు, వాలంటీర్లతో బృందాలను ఏర్పాటు చేశారు. వారు గ్రామాల్లో మహిళలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. "చాలాకాలం సొంత డబ్బులతోనే ఇవన్నీ చేశాను. నా భర్త, కుటుంబం కూడా అండగా నిలిచారు. ఆ తరువాత... నేను చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకొని... గోరఖ్‌పూర్‌కు చెందిన శానిటరీ ప్యాడ్ తయారీ సంస్థ సాయం చెయ్యడానికి ముందుకు వచ్చింది. గ్రామాల్లో కొందరు విరాళాలు కూడా ఇస్తున్నారు. స్కూలు పనులు, ఇంటి పనులు, ప్రచారం, గ్రామాల్లోని వాలంటీర్లతో సమన్వయం... ఇవన్నీ చూసుకోవడం కాస్త కష్టమే. కానీ ఈ పనుల్లో నాకు ఎంతో సంతోషం, సంతృప్తి లభిస్తున్నాయి. మా ప్యాడ్ బ్యాంక్ సేవలను మరిన్ని గ్రామాల్లోని మహిళలకు అందించాలనే ప్రేరణ కలిగిస్తున్నాయి" అంటారు రాఖీ.

వైరల్

ఆమెకు ఆకాశమే హద్దు



జీవితమంటేనే నిత్య పోరాటం. సమస్యలు, సవాళ్లు అందులో భాగం. ఇది రాధాకుమారికి చిన్నప్పుడే అర్థమైంది. ఆమెది బిహార్ రాజధాని పట్నా. పుట్టుకతోనే పోలియో మహమ్మారి రాధాకుమారి జీవితాన్ని చక్రాల కుర్చీకే పరిమితం చేసింది. అయినా ఆమె తన వైకల్యాన్ని సాకుగా చూపి ఇంట్లోనే కూర్చోవాలని అనుకోలేదు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆశావహ దృక్పథంతో ముందడుగు వేయడం అలవాటు చేసుకున్నారు.

పోలియో తన జీవితాన్ని శాసించకూడదని నిర్ణయించుకున్నారు. పట్టుదలతో ప్రయత్నించి ఫుడ్ డెలివరీ యాప్ 'జొమాటో'లో ఉద్యోగం సంపాదించుకున్నారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. అందరిలా నడవలేకపోతున్నందుకు రాధాకుమారి ఎన్నడూ బాధపడలేదు. చక్రాల కుర్చీని కేవలం తన పనులు తాను చేసుకోవడానికే కాకుండా... తన కాళ్లపై తాను నిలబడడానికి ఒక ఆధారంగా మలుచుకున్నారు. 'జానో జంక్షన్' అనే యూట్యూబ్ చానల్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె వీడియోను పోస్ట్ చేశారు. అందులో రాధాకుమారి తన కథను అందరితో పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో లక్షల మందిని కదిలించింది. చూసినవారు ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు. చేసే పనిపట్ల ఆమె అంకితభావానికి, చెదరని ఆత్మవిశ్వాసానికి సెల్యూట్ కొడుతున్నారు. 'మీ నుంచి మాకు స్ఫూర్తి కావాలి' అంటూ రాధాకుమారిని కొనియాడారు.

'మీ పనులన్నీ మీరే చేసుకొంటున్నారు. సాధారణ వ్యక్తులతో పోటీపడి మరీ ఉద్యోగం చేస్తున్నారు. ఇవన్నీ ఎలా సాధ్యం' అని అడిగితే... 'జీవితం అనేది ఉంటే... దాంతోపాటే సమస్యలూ ఉంటాయి' అంటూ చిరునవ్వుతో సమాధానమిస్తారు రాధా కుమారి.

ఆమె అద్భుతమైన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కూడా. ఈ ఏడాది జంషెడ్‌పూర్‌లో జరిగిన 'జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్'లో బిహార్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 'తద్వారా నాలాంటి వికలాంగులకు ప్రేరణగా నిలవాలన్నదే నా కోరిక' అంటారు రాధాకుమారి.

నవ్య | చిత్రజ్యోతి

అందరి మన్ననలు అందుకుంటాడు

పాపులర్ కమెడియన్ గెటప్ శ్రీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ నెల 24న 'రాజుయాదవ్' విడుదలవుతోంది. సినిమా



ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం గెటప్ శ్రీను మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేస్తూ ఓ వీడియోను షేర్ చేశారు.

"ఈతరం కామెడీ నటుల్లో నాకు బాగా ఇష్టమైన నటుడు గెటప్ శ్రీను. ఈ సినిమా ట్రైలర్ చాలా బావుంది. శ్రీనుని చూస్తుంటే నాకు కామెడీ హీరో చలం గుర్తుకువస్తారు. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను. అలాగే తన నటనతో గెటప్ శ్రీను కూడా అందరి మన్ననలు అందుకుంటాడు" అని పేర్కొన్నారు.

సూపర్ స్టార్ బుజ్జి



ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏ.డీ'. జూన్ 27న విడుదలవుతున్న ఈ మూవీ కోసం చిత్ర బృందం ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. ఇటీవలే ప్రభాస్ "డార్లింగ్స్ మీ జీవితాల్లోకి ఒక కొత్త వ్యక్తి రాబోతున్నాడు" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సస్పెన్స్‌ను మరింత పెంచుతూ ప్రభాస్ తర్వాత పోస్టులో "నా బుజ్జిని పరిచయం చేసేందుకు ఎదురుచూస్తున్నా" అని అభిమానుల్లో మరింత ఆసక్తిని క్రియేట్ చేశారు. శనివారం చిత్ర బృందం ఈ సస్పెన్స్‌ను తెరదించుతూ "ఫ్రం స్క్రాచ్ ఎపిసోడ్-4 బిల్డింగ్ ఏ సూపర్ స్టార్ బుజ్జి' పేరుతో ఓ వీడియో రిలీజ్ చేసింది. ఈ వీడియోలో ఓ చిన్న రోబోను అందరూ బుజ్జి అని పిలుస్తుంటారు. బుజ్జి పాత్రకు కీర్తి సురేశ్ వాయిస్ అందించడం విశేషం. ఇందులో బుజ్జి బ్రెయిన్ రోబోలో ఉండగా, బాడీ మాత్రం ఓ కారులో ఉంటుంది. ఆ కారునే ఈ వీడియోలో తయారు చేస్తుంటారు. బుజ్జి తనకు బాడీ లేదని బాధపడుతూ ఉంటే.. బుజ్జి బాడీని ప్రభాస్ రివీల్ చేసేటప్పుడు వీడియో ముగుస్తుంది. ఈ బుజ్జి రోబో గురించి మరిన్ని విశేషాలని మే 22న తెలియజేస్తామని చిత్ర బృందం ప్రకటించింది. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తుండగా అశ్వనీ దత్ నిర్మిస్తున్నారు.

జూలైలో వస్తున్న భారతీయుడు 2



'విక్రమ్' సినిమా తర్వాత కమల్‌హాసన్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. జూలై 12న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు కమల్ హాసన్ ఆదివారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. జూన్ 1న ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించనున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.శ్రీకర ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవివర్మన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.

సూపర్ ఎలివేషన్స్‌తో 'ఫియర్'



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కోసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' అక్టోబర్ 10న విడుదలవుతోంది. సోమవారం తారక్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'ఫియర్' పేరుతో రిలీజైన ఈ రాప్ సాంగ్ ఎన్టీఆర్ పాత్రకు సూపర్ ఎలివేషన్స్ ఇచ్చింది. అద్భుతమైన విజువల్స్ పవర్‌ఫుల్ లిరిక్స్‌తో సాగిన ఈ సాంగ్ సినిమాపై మరిన్ని అంచనాలు పెంచేసింది. రామజోగయ్యశాస్త్రి ఈ పాటను రచించగా, అనిరుధ్ రవిచందర్ పాటకు మ్యూజిక్ అందించి, ఆలపించారు.

సంక్రాంతికి సిద్ధం



అజిత్‌కుమార్ కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం యూనిట్ ఈ చిత్రం నుంచి అజిత్ పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడంతో పాటు రిలీజ్‌డేట్‌ను ప్రకటించింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఫస్ట్‌లుక్‌లో మూడు డిఫరెంట్ వేరియేషన్స్‌లో అజిత్ మేకోవర్ అదిరిపోయింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అభినందన్ రామానుజం.

అంతరంగాన్ని ఆవిష్కరించేలా...



దివంగత సినీ గేయ రచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా రూపొందిన కార్యక్రమం 'నా ఉచ్ఛ్వాసం కవనం'. సిరివెన్నెల పాటల అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ టీవీ షో పరిచయ కార్యక్రమం ఇటీవలే హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు కృష్ణవంశీ ఈ కార్యక్రమం టీజర్‌ను ఆవిష్కరించారు. సీతారామశాస్త్రిగారి మాట, పాట అందరికీ చేరాలని మేము చేసిన చిన్న ప్రయత్నమే ఈ కార్యక్రమం అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీరామ్ చెరువు చెప్పారు. ఈ కార్యక్రమంతో శాస్త్రిగారి మాట, పాట విస్తృతంగా ప్రేక్షకుల చెంతకు చేరాలని సీనియర్ జర్నలిస్ట్ ప్రభు ఆకాంక్షించారు.



థాయ్‌లాండ్ ఓపెన్

విజేత సాత్విక్ జోడీ

బ్యాంకాక్: భారత స్టార్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టికి పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఆత్మవిశ్వాసాన్ని పెంచే విజయం దక్కింది. థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో ఈ జోడీ టైటిల్ అందుకుంది. ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ సాత్విక్/చిరాగ్ ద్వయం 21-15, 21-15తో చెన్ బో/లియుయి (చైనా) జంటను చిత్తు చేసి విజేతగా నిలిచింది. భారత జోడీకిది తొమ్మిదో వరల్డ్ టూర్ డబుల్స్ టైటిల్‌కాగా..థాయ్‌లాండ్‌లో రెండోది. 2019లో సాత్విక్/చిరాగ్ ఇక్కడ చాంపియన్‌గా నిలిచారు. తొలి గేమ్ ఆరంభంనుంచే దూకుడును ప్రదర్శించిన సాత్విక్‌జోడీ 5-1 ఆధిక్యంలో నిలిచింది.. కానీ వరుసగా నాలుగు పాయింట్లు సాధించిన ప్రత్యర్థి జోడీ పుంజుకుంది. 7-7 వద్ద 39 షాట్ల భారీ ర్యాలీలో చైనా జంట పాయింట్ రాబట్టడంతోపాటు 10-7తో ముందంజ వేసింది. కానీ చిరాగ్ బుల్లెట్లలాంటి షాట్లతో భారత జోడీ 10-10 స్కోరు సమం చేసినా..విరామానికి మాత్రం చైనా జంట స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. విరామం తర్వాత జోరు చూపిన భారత జోడీ మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది.. రెండో గేమ్‌లోనూ అదరగొట్టిన సాత్విక్/చిరాగ్ 8-3తో ముందంజ వేశారు. సాత్విక్ దూకుడుతో 15-11తో భారత జంట మరింత ఆధిక్యంలోకి దూసుకు పోయింది. కానీ చైనా జోడీ 14-15తో మ్యాచ్‌లో కొచ్చే ప్రయత్నం చేసినా..సాత్విక్/చిరాగ్ వారికి అవకాశం ఇవ్వకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను చేజిక్కించుకుంది.

ప్లేఆఫ్స్ పోరు ఇలా..

ఐపీఎల్‌లో లీగ్ దశ ఆదివారంతో ముగిసింది. అలాగే ప్లేఆఫ్స్ జట్లు కూడా ఖరారయ్యాయి. 20 పాయింట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ అగ్రస్థానం దక్కించుకోగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ 17 పాయింట్లతో మెరుగైన రన్‌రేట్‌తో రెండో స్థానంలో నిలిచింది. అటు రాజస్థాన్ మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో ఆ జట్టు (17 పాయింట్లు) హైదరాబాద్‌కంటే తక్కువ రన్‌రేట్ కారణంగా మూడో స్థానానికి పరిమితమైంది. ఇక బెంగళూరు ఆఖర్లో ఉంది. ఈ స్థానాలను బట్టి మంగళవారం క్వాలిఫయర్ 1లో కేకేఆర్-సన్‌రైజర్స్ మధ్య అహ్మదాబాద్‌లో మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు నేరుగా 26న జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. కానీ ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఇదే మైదానంలో బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో ఆర్‌సీబీ-రాజస్థాన్ తలపడతాయి. ఇక్కడ ఓడిన జట్టు ఇంటిముఖం పట్టాల్సిందే. ఈ మ్యాచ్ విజేత శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో ఆడాల్సిఉంటుంది. ఇందులో ఆ జట్టుకు క్వాలిఫయర్1లో ఓడిన టీమ్ ప్రత్యర్థిగా ఉంటుంది. ఫైనల్‌కు వెళ్లే రెండో జట్టేదో ఈ మ్యాచ్‌తో తేలిపోతుంది. క్వాలిఫయర్2, ఫైనల్ చెన్నైలో జరుగుతాయి.

షెడ్యూల్

మే 21	క్వాలిఫయర్ 1	కోల్‌కతా × సన్‌రైజర్స్	అహ్మదాబాద్
మే 22	ఎలిమినేటర్	బెంగళూరు × రాజస్థాన్	అహ్మదాబాద్
మే 24	క్వాలిఫయర్ 2	-----	చెన్నై







రాయల్స్‌కు వరుణుడి షాక్

కోల్‌కతాతో మ్యాచ్ రద్దు
టాప్-2లో చాన్స్ మిస్
ఆర్‌సీబీతో ఎలిమినేటర్‌కు సిద్ధం

గువాహటి: ఐపీఎల్‌లో చివరి లీగ్ మ్యాచ్ వర్షార్పణమైంది. దీంతో రెండో స్థానంపై ఆశలు పెట్టుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు నిరాశే ఎదురైంది. ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో ఆలస్యంగా టాస్ వేసినా.. ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. ఇతర జట్లకన్నా చాలా ముందుగానే 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న శాంసన్ సేన ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి టాప్-2 స్థానం గల్లంతు చేసుకుంది. తాజా మ్యాచ్‌లోనైనా విజయం సాధిస్తే ఆ అవకాశం ఉన్నప్పటికీ వరుణుడు కరుణించలేదు. దీంతో ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకుంది. అలాగే మొత్తం 17 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్‌లో ఆర్‌సీబీతో ఆడేందుకు సిద్ధమైంది. ఇక ఆదివారం రాత్రి ఏడు గంటలకు చిరుజల్లులతో ఆరంభమైన వర్షం కుండపోతగా మారింది. దీంతో ఆటగాళ్లంతా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. అటు మైదానాన్ని పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు. రాత్రి 8.30కి కాస్త తగ్గినా కాసేపటికే తిరిగి కొనసాగింది. చివరకు రాత్రి 10 గంటలకు పూర్తిగా ఆగిపోవడంతో కవర్లను తొలగించారు. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు మ్యాచ్‌ను ఏడు ఓవర్లకు కుదించి రాత్రి 10.30కి టాస్ కూడా వేశారు. అటు కోల్‌కతా ఫీల్డింగ్ ఎంచుకుంది. ఆ వెంటనే తిరిగి భారీ వర్షం కురవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహం చెందారు. ఐదు ఓవర్ల మ్యాచ్ కూడా వీలు కాకపోవడంతో చేసేదేమీ లేక అంపైర్లు సైతం మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
కోల్‌కతా	14	9	3	2	20	1.428
హైదరాబాద్	14	8	5	1	17	0.414
రాజస్థాన్	14	8	5	1	17	0.273
బెంగళూరు	14	7	7	0	14	0.459
చెన్నై	14	7	7	0	14	0.392
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లఖ్‌నవూ	14	7	7	0	14	-0.667
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	14	5	9	0	10	-0.353
ముంబై	14	4	10	0	8	-0.318

వద్దని చెప్పినా వినరా?

బ్రాడ్‌కాస్టర్‌పై రోహిత్ ఆగ్రహం

న్యూఢిల్లీ: క్రికెటర్ల గోప్యతను ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇటీవల కేకేఆర్‌తో మ్యాచ్‌కు ముందు తను అభిషేక్ నాయర్‌తో కలిసి మాట్లాడిన ఓ వీడియో నెట్టింట్లో వైరల్ అయ్యింది. అందులో ముంబై కెప్టెన్సీపై అతడు తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడట. 'క్రికెటర్ల జీవితాలకు గోప్యత లేకుండా పోయింది. శిక్షణ లేదా మ్యాచ్ సమయంలో మా సహచరులు, స్నేహితులతో మాట్లాడే ప్రతీ మాటను కెమెరాలు నేరుగా రికార్డు చేస్తూ ప్రసారం కూడా చేస్తున్నాయి. అలాగే మా సంభాషణను రికార్డు చేయవద్దని స్టార్‌స్పోర్ట్స్‌ను కోరినా వినకుండా ప్రసారం కూడా చేశారు. వారికి ఎప్పుడూ ఎక్స్‌క్లూజివ్ దృశ్యాలు మాత్రమే కావాల'ని రోహిత్ ఎక్స్‌లో ఘాటుగా స్పందించాడు.


అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 66)

వి ముగించారు

సన్‌రైజర్స్‌కు రెండో స్థానం ● పంజాబ్ చిత్తు

హైదరాబాద్: లీగ్ దశను సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 66) ధనాధన్ అర్ధ శతకంతో సన్‌రైజర్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 214/5 స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ (71), రొసో (49), అథర్వ తైడ్ (46), జితేష్ శర్మ (32 నాటౌట్) రాణించారు. నటరాజన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం సన్‌రైజర్స్ 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. క్లాసెన్ (42), నితీష్ కుమార్ (37) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అర్ష్‌దీప్ సింగ్, హర్షల్ పటేల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ మొత్తం 17 పాయింట్లు సాధించింది.

హెడ్ గోల్డెన్ డక్‌గా..: ఛేదనలో ఇన్నింగ్స్ తొలి బంతికే హెడ్ (0)ను అర్ష్‌దీప్ అద్భుతమైన బంతికి డకౌట్‌చేశాడు. తర్వాత అభిషేక్..వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్ త్రిపాఠి (33)తో కలసి రెండో వికెట్‌కు 72, నితీష్‌తో కలసి 57 రన్స్ జోడించాడు. 129/2 స్కోరు వద్ద అభిషేక్‌ను శశాంక్ అవుట్ చేశాడు. ఈ దశలో క్లాసెన్ ధాటిగా ఆడాడు. కానీ, చివరి 11 బంతుల్లో 7 పరుగులు కావాల్సి ఉండగా.. క్లాసెన్‌ను హర్‌ప్రీత్ అవుట్ చేశాడు. సన్వీర్ (6 నాటౌట్) 5 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించాడు.

టాపార్డర్ జోరు..: అథర్వ, ప్రభ్‌సిమ్రన్ అదిరే ఆరంభాన్నివ్వడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పంజాబ్ పవర్‌ప్లేలో 61/0తో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో అథర్వను క్యాచవుట్ చేసిన నటరాజన్.. తొలి వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. అనంతరం రొసోతో కలసి ప్రభ్‌సిమ్రన్ రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. ప్రభ్‌సిమ్రన్‌ను 15వ ఓవర్‌లో వియస్‌కాంత్ వెనక్కిపంపాడు. ఈ దశలో సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి జోరుకు కళ్లెం వేశారు. శశాంక్ (2) రనౌట్ కాగా.. రొసోను కమిన్స్ పెవిలియన్ చేర్చాడు. అయితే, చివరి ఓవర్‌లో నితీష్ బౌలింగ్‌లో 19 పరుగులు పిండుకొన్న జితేష్.. టీమ్ స్కోరును 210 దాటించాడు.

పంజాబ్: అథర్వ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 46, ప్రభ్‌సిమ్రన్ (సి) క్లాసెన్ (బి) వియస్‌కాంత్ 71, రొసో (సి) సమద్ (బి) కమిన్స్ 49, శశాంక్ (రనౌట్/నితీష్) 2, జితేష్ (నాటౌట్) 32, అశుతోష్ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 2, శివమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు: **10; మొత్తం: 20 ఓవర్లలో 214/5; వికెట్ల పతనం:** 1-97, 2-151, 3-174, 4-181, 5-187; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-36-0, కమిన్స్ 4-0-36-1, నటరాజన్ 4-0-33-2, వియస్‌కాంత్ 4-0-37-1, షాబాజ్ 1-0-13-0, నితీష్ 3-0-54-0.

సన్‌రైజర్స్: హెడ్ (బి) అర్ష్‌దీప్ 0, అభిషేక్ (సి) శివమ్ (బి) శశాంక్ 66, త్రిపాఠి (సి) అర్ష్‌దీప్ (బి) హర్షల్ 33, నితీష్ (సి) శివమ్ (బి) హర్షల్ 37, క్లాసెన్ (బి) హర్‌ప్రీత్ 42, షాబాజ్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 3, సమద్ (నాటౌట్) 11, సన్వీర్ సింగ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు: **17; మొత్తం: 19.1 ఓవర్లలో 215/6; వికెట్ల పతనం:** 1-0, 2-72, 3-129, 4-176, 5-197, 6-208; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-2, రిషి ధవన్ 3-0-35-0, హర్షల్ 4-0-49-2, చాహర్ 4-0-43-0, హర్‌ప్రీత్ 3-0-36-1, శశాంక్ 1-0-5-1, అథర్వ 0.1-0-4-0.



అదంతా దేవుడి ప్రణాళిక



బెంగళూరు: ఐపీఎల్‌లో బెంగళూరు జట్టు కేవలం ఒక్క శాతం అవకాశం నుంచి ఓ అద్భుతంలా టాప్-4లో నిలిచింది. అందుకే ఇదంతా దైవకృపగా విరాట్ భావిస్తున్నాడు. 'మా జట్టు పురోగతిపై భగవంతుడికి ఓ ప్రణాళిక ఉన్నట్టుంది. నిజాయతీగా మన పని చేసుకుంటూ వెళ్తే ఫలితం వస్తుంది. ఇప్పుడు మా కష్టానికి ప్రతిఫలం దక్కింది' అని విరాట్ తెలిపాడు. ఇక ధోనీ సిక్సర్‌తోనే తాము గెలిచినట్టు దినేశ్ కార్తీక్ వెల్లడించాడు. చివరి ఓవర్‌లో అతడి సిక్సర్ స్టేడియం రూఫ్‌పై పడడంతో అంపైర్లు కొత్త బంతి ఇచ్చారని, అది పొడిగా ఉండడంతో చక్కటి గ్రిప్ దొరికిందని వివరించాడు.

బిజినెస్

పీఎస్‌బీల వ్యాపారం అదుర్స్

అగ్రస్థానంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) తమ వ్యాపారాన్ని (డిపాజిట్ల సేకరణ+రుణ వితరణ) గణనీయంగా పెంచుకున్నాయి. ఈ విషయంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 15.94 శాతం వృద్ధి రేటుతో మిగిలిన బ్యాంకుల కంటే ముందుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 13.12 శాతం వృద్ధి రేటుతో రెండో స్థానంలో ఉంది. వృద్ధి రేటులో ముందున్నా డిపాజిట్లు, అడ్వాన్స్‌లపరంగా చూస్తే ఎస్‌బీఐ-బీఓఎం మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 2023-24లో బీఓఎంతో పోలిస్తే ఎస్‌బీఐ వ్యాపారం 16.7 రెట్లు ఎక్కువ. ఎస్‌బీఐ మొత్తం బిజినెస్ 2023-24లో రూ.79,52,784 కోట్లు ఉంటే బీఓఎం బిజినెస్ రూ.4,74,411 కోట్లు మాత్రమే.

డిపాజిట్ల సేకరణ పరంగా: డిపాజిట్ల సమీకరణ వృద్ధి రేటు పరంగా చూసినా బీఓఎం 15.66 శాతం వృద్ధి రేటుతో అగ్రస్థానంలో ఉంది. 11.07 శాతంతో ఎస్‌బీఐ రెండో స్థానంలో, 11.05 శాతంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) మూడో స్థానంలో, 10.98 శాతం వృద్ధి రేటుతో కెనరా బ్యాంక్ నాలుగో స్థానంలో నిలిచాయి. డిపాజిట్ల సమీకరణ పరంగా చూస్తే గత ఆర్థిక సంవత్సరం ఈ నాలుగు పీఎస్‌బీలు మాత్రమే రెండంకెల వృద్ధి రేటు నమోదు చేశాయి.

సీఐఐ ప్రెసిడెంట్‌గా సంజీవ్ పురి

న్యూఢిల్లీ: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రెసిడెంట్‌గా ఐటీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ పురి బాధ్యతలు స్వీకరించారు. 2024-25 సంవత్సరానికి గాను ఈయన ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఇప్పటి వరకు ప్రెసిడెంట్‌గా ఉన్న ఆర్ దినేశ్ నుంచి సంజీవ్ పురి బాధ్యతలను తీసుకున్నారు. కాగా సీఐఐ ప్రెసిడెంట్-డెసిగ్నేట్‌గా రాజీవ్ మేమానీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈయన ఈవై (ఎర్నెస్ట్ అండ్ యంగ్) ఇండియా రీజియన్ చైర్మన్‌గా ఉన్నారు. సీఐఐ వైస్ ప్రెసిడెంట్‌గా టాటా కెమికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ ఆర్ ముకుందన్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు

సోమవారం ముంబైలో లోక్‌సభ ఎన్నికల కారణంగా స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. కమోడిటీ, బులియన్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం నుంచి స్టాక్ మార్కెట్లతో పాటు ఇతర మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

4 నెలల్లో రూ.1.3 లక్షల కోట్ల పెట్టుబడులు



స్టాక్ మార్కెట్‌పై ఎంఎఫ్‌ల ఆసక్తి

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్ భవిష్యత్‌పై మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అత్యంత నమ్మకంతో ఉన్నాయి. ఈ నమ్మకంతోనే ఈ సంస్థలు ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 16 వరకు దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.1.3 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాయి. ఇదే సమయంలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన మార్కెట్ నుంచి రూ.25,000 కోట్లకుపైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. అంతర్జాతీయ ఆటుపోట్లు, వడ్డీ రేట్ల తగ్గింపుపై అనిశ్చితి, లాభాల స్వీకరణతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుంటే, ఇదే సమయంలో ఎంఎఫ్‌లు, బీమా సంస్థల వంటి దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ మదుపరులు పెద్దమొత్తంలో దేశీయ స్టాక్ మార్కెట్లో మదుపు చేయడం విశేషం.

కారణాలు..

- మిగతా పెట్టుబడులతో పోలిస్తే ఈక్విటీలపై అధిక లాభాలు
- కొన్ని ఆటుపోట్లు ఎదురైనా మార్కెట్ వెంటనే కోలుకోవడం
- సిప్‌ల రూపంలో పెద్ద మొత్తంలో వచ్చిపడుతున్న పెట్టుబడులు
- స్థిరంగా పెరుగుతున్న జీడీపీ వృద్ధి రేటు
- 2023-24 ద్రవ్య లోటు ఐదేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గటం

టాటా మోటార్స్ రూ.43,000 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో టాటా మోటార్స్ గ్రూప్ రూ.43,000 కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. కొత్త ఉత్పత్తులు, టెక్నాలజీల కోసం ఈ మొత్తాలను వెచ్చించనుంది. ఈ పెట్టుబడుల్లో సింహభాగం బ్రిటిష్ విభాగమైన జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్‌ఆర్)లో పెట్టే అవకాశం ఉందని టాటా మోటార్స్ సీఎఫ్ఓ పీబీ బాలాజీ వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జేఎల్‌ఆర్‌లో రూ.30,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ తొలుత తెలిపింది. అయితే ఈ ఏడాది మార్చి ముగిసే నాటికి నిర్దేశిత లక్ష్యాలను మించి జేఎల్‌ఆర్‌లో రూ.33,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,200 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు బాలాజీ తెలిపారు. దీంతో గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.41,200 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లయిందని ఆయన పేర్కొన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జేఎల్‌ఆర్‌లో రూ.35,000 కోట్లు, టాటా మోటార్స్‌లో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా కొత్త ఉత్పత్తుల అభివృద్ధి కోసం ఈ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 2025-26లో రేంజ్ రోవర్ బీఈవీ సహా కొన్ని పాత కార్ల స్థానంలో బ్రాండ్ న్యూ వాహనాలను తీసుకురానున్నట్లు బాలాజీ చెప్పారు. అలాగే ఈ ఏడాది డిఫెండర్ ఓక్టాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ 'లాభాల' రికార్డ్

సిబ్బందికి 8 నెలల జీతం బోనస్



న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యుత్తమ విమానయాన సంస్థల్లో ఒకటిగా చెప్పబడే సింగపూర్ ఎయిర్‌లైన్స్ గత ఆర్థిక సంవత్సరం (2023-24) రికార్డు స్థాయిలో 198 కోట్ల డాలర్ల (సుమారు రూ.16,503 కోట్లు) లాభాలు ఆర్జించింది. దీంతో ఉద్యోగులకు ఎనిమిది నెలల జీతం బోనస్‌గా చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ఒక విమానయాన సంస్థ ఉద్యోగులకు ఇంత పెద్ద మొత్తం బోనస్‌గా చెల్లించాలని నిర్ణయించడం ఇదే మొదటిసారి. కొవిడ్ భయాలు పోయి చైనా, జపాన్, హాంకాంగ్, తైవాన్‌లకు విమాన ప్రయాణం ఊపందుకోవడం గత ఆర్థిక సంవత్సరం సింగపూర్ ఎయిర్‌లైన్స్ లాభాలకు బాగా కలిసొచ్చింది. 'మా ఉద్యోగుల అంకిత భావం వల్లే కొవిడ్ ఉపద్రవాన్ని తట్టుకుని మేము మరింత బలోపేతంగా ఎదిగాము' అని సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈఓ గో చూన్ చెప్పారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మాత్రం పరిస్థితులు అంత బాగుండకపోవచ్చన్నారు.

22,800 ఎగువన బుల్లిష్

(మే 21-24 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,520-21,821 పాయింట్ల మధ్యన కదలాడి అంతకు ముందు వారంతో పోల్చితే 1.99 శాతం లాభంతో 22,503 పాయింట్ల వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో నిఫ్టీ 23,800 ఎగువన క్లోజయితే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి :	22,800
బ్రేక్‌డౌన్ స్థాయి:	22,200
నిరోధ స్థాయిలు:	22,700, 22,380, 22,900 (22,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు:	22,300, 22,200, 22,100 (22,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ



హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550

దజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	150	గోదావరి	154
వరంగల్	150	విజయవాడ	154
కరీంనగర్	150	గుంటూరు	154
మహబూబ్‌నగర్	152	ఒంగోలు	154
కర్నూలు	152	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

పీఎస్‌యూల ఏటీఎఫ్ పైప్‌లైన్లపై రిలయన్స్ కన్ను

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) దేశీయ మార్కెట్లో తన విమాన ఇంధన (ఏటీఎఫ్) సామ్రాజ్యాన్ని విస్తరించాలని యోచిస్తోంది. ఇందుకోసం దేశంలోని విమానాశ్రయాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీలకు ఉన్న పైప్‌లైన్లు, స్టోరేజీ ట్యాంకులను ఉపయోగించుకోవాలని చూస్తోంది. ఇందుకు అనుమతించాలని పెట్రోలియం, నేచరల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ)కు లేఖ రాసింది. దేశీయ విమానాశ్రయాల్లో ఏటీఎఫ్ గిరాకీ ఏటా రెండెంకెల్లో వృద్ధి చెందుతోంది. దీంతో రిలయన్స్ ఈ దిశగా పావులు కదుపుతోందని భావిస్తున్నారు.

బైజూస్‌కి రజనీష్, పాయ్ గుడ్‌బై

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కంపెనీ సలహా మండలి సభ్యత్వానికి ఎస్‌బీఐ మాజీ చైర్మన్ రజనీష్ కుమార్, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ గుడ్‌బై చెప్పారు. బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ బైజూస్‌తో చర్చించాకే వీరిద్దరూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన విధంగా ఏడాది సమయం పూర్తయినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వీరిద్దరూ తెలిపారు. అయితే బైజూస్‌కు ఎప్పుడైనా తమ సలహాలు, సూచనలు కావాల్సి వస్తే, ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు.

ఫార్మా కంపెనీలకు 'రీకాల్' కష్టాలు

పట్టు బిగిస్తున్న అమెరికా ఎఫ్‌డీఏ.. డాక్టర్ రెడ్డీస్, అరబిందో, సన్ ఫార్మాకు నిరాశ

న్యూఢిల్లీ: భారత ఫార్మా కంపెనీలపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) పట్టు బిగిస్తోంది. ఔషధాల తయారీ లేదా నాణ్యతలో ఏ మాత్రం తేడా కనిపించినా కొరడా ఝుళిపిస్తోంది. ఈ కారణంతోనే గత నెలలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, సన్ ఫార్మా, ఎఫ్‌డీసీ కంపెనీలు అమెరికాకు ఎగుమతి చేసిన ఔషధాల్లో కొన్నిటిని వెనక్కి (రీకాల్) తీసుకోవాల్సి వచ్చింది. అమెరికా ఎఫ్‌డీఏ తన తాజా ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలో ఈ విషయం వెల్లడించింది. కంపెనీల వారీగా రీకాల్ చేసిన ఔషధాల వివరాలు ఇలా ఉన్నాయి.

డాక్టర్ రెడ్డీస్: న్యూజెర్సీ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఇంక్ అమెరికాలో జవిగ్టర్ (సప్రోప్టెరిన్ డైహైడ్రోక్లోరైడ్) పౌడర్ ఫర్ ఓరల్ సొల్యూషన్ (100 ఎంజీ) పేరుతో మార్కెట్ చేస్తున్న ఔషధం అంత శక్తివంతంగా లేదని ఎఫ్‌డీఏ తేల్చింది. ఈ ఔషధాన్ని పిల్లలు, పెద్దల రక్తంలో ఫినైల్ అలానైన్‌ని నియంత్రించేందుకు ఉపయోగిస్తారు. ఎఫ్‌డీఏ చర్యతో డాక్టర్ రెడ్డీస్ గత నెల 8న క్లాస్-1 రీకాల్ కింద 20,000 కార్టన్‌ల ఈ ఔషధాన్ని వెనక్కి తీసుకుంది.

సన్ ఫార్మా: అమెరికా ఎఫ్‌డీఏ ప్రభావం సన్ ఫార్మాపైనా పడింది. సరైన నాణ్యతా ప్రమాణాలు లేవనే కారణంతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ ట్రీట్‌మెంట్‌కు ఉపయోగించే అంఫోటెరిసిన్ బి లిపోసమ్ అనే ఇంజెక్షన్లకు సంబంధించి 11,016 వయల్స్‌ను వెనక్కి తీసుకుంది.

అరబిందో ఫార్మా: అరబిందో ఫార్మా తయారు చేసే క్లోరాజెపాటె డిపొటాషియం టాబ్లెట్స్‌పైనా ఎఫ్‌డీఏ వేటు పడింది. 3.75, 7.5 ఎంజీ డోసుల్లో లభించే ఈ టాబ్లెట్లను మానసిక రుగ్మతల చికిత్సలో ఉపయోగిస్తారు. ఎఫ్‌డీఏ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కంపెనీ ఈ టాబ్లెట్లతో కూడిన దాదాపు 13,605 బాటిల్స్‌ను వెనక్కి తీసుకుంది.

22,600 వద్ద నిరోధం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గతవారం నెగటివ్ జోన్‌లో ప్రారంభమై ప్రధాన మద్దతు స్థాయిలైన 22,000 దిగువకు వెళ్లింది. అనంతరం బలమైన రికవరీ సాధించి చివరకు 450 పాయింట్ల లాభంతో వీక్లీ గరిష్ఠ స్థాయిల్లో క్లోజైంది. కనిష్ఠ స్థాయిల నుంచి పుంజుకోవటంతో సత్వర డౌన్‌ట్రెండ్ నుంచి నిఫ్టీ బయటపడింది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ గతవారం ఇటీవలి గరిష్ఠ, స్వల్పకాలిక నిరోధ స్థాయిలకు చేరువలో పటిష్ఠంగా ముగిసింది. నిఫ్టీ గడిచిన మూడు నెలలుగా గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలైన 22,700-21,700 మధ్యన కదలాడుతూ వస్తోంది. గతవారం మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిల్లో క్లోజయ్యాయి. మార్కెట్ తదుపరి దిశను తీసుకునే ముందు ప్రస్తుత నిరోధ స్థాయిలైన 22,600 వద్ద కన్సాలిడేట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,600 ఎగువన తదుపరి నిరోధ స్థాయిలుంటాయి. ఇది ఈ నెల 6న ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఇక్కడ నిలదొక్కుకుంటేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 22,800. ఇది ఈ నెల 3న ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఈ గరిష్ఠ స్థాయిల వద్ద నిలదొక్కుకుంటే అనంతరం 23,000 వద్ద ప్రధాన నిరోధ స్థాయిలు ఉంటాయి.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయి 22,300. ఇది గత వారం ఏర్పడిన కనిష్ఠ స్థాయి. ఒకవేళ ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే తదుపరి మద్దతు స్థాయిలు 22,000 దిగువన ఉంటాయి. అయితే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలిస్తే ఈ స్థాయిల వద్ద పరీక్షను ఎదుర్కొనే అవకాశం కనిపించటం లేదు.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ కనిష్ఠ స్థాయిలైన 47,000 నుంచి రికవరీ సాధించి 780 పాయింట్ల లాభంతో 48,200 వద్ద క్లోజైంది. ఈ వారం మరింత రికవరీ సాధిస్తే 48,700 ఎగువన తదుపరి నిరోధ స్థాయిలుంటాయి. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 26న ఏర్పడిన స్థాయి. మరో ప్రధాన నిరోధం 49,000. అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయి 47,700. ఇక్కడ నిలదొక్కుకోవటంలో విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది.

ప్యాటర్న్: మార్కెట్ గత వారం 100 రోజుల డీఎంఏ ఎగువన రికవరీ సాధించింది. వీక్లీ చార్టుల ప్రకారం చూస్తే 22,600 వద్ద డబుల్ టాప్ ప్యాట్రన్ ఏర్పడింది. తదుపరి పాజిటివ్ ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మూడో ట్రేడింగ్ రోజైన గురువారం రివర్సల్ ఉండే అవకాశాలున్నాయి.

మంగళ వారం స్థాయిలు	
నిరోధం:	22,600, 22,645
మద్దతు:	22, 460, 22, 400

www.sundartrends.in

పక్కా ప్రణాళికతోనే

నాపై హత్యాయత్నం!

- పోలీసు అధికారులకు ముందే తెలుసు
- దాడిపై సమాచారమిచ్చినా స్పందించలేదు
- 40 నిమిషాల తర్వాత వచ్చారు
- చెవిరెడ్డి, కుటుంబీకుల కాల్ డేటా పరిశీలించండి
- సిట్ అధికారులకు పులివర్తి నాని వినతి

తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): పక్కా ప్రణాళికతోనే, ఉద్దేశపూర్వకంగా తనపై హత్యాయత్నం జరిగిందని తిరుపతి జిల్లా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి ఇక్కడ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ వద్ద వారిని ఆయన కలిశారు. హత్యాయత్నంతో పాటు కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణల గురించీ ఆయన్ను వారు అడిగి వివరాలు తెలుసుకున్నారు. తనను అంతమొందించేందుకే ప్రణాళికతో దాడి చేయించారని.. నిందితులుగా నమోదైన భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి కేవలం పాత్రధారులేనని, తెర వెనుక ఉన్న అసలైన దోషులను గుర్తించాలని నాని ఈ సందర్భంగా సిట్ అధికారులను కోరారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి, వైసీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి నడుమ జరిగిన ఫోన్ సంభాషణలను బయట పెట్టాలని, వారి కాల్ డేటాను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వారిని అరెస్టు చేసి విచారణ జరపాలని.. లేదంటే విచారణను ప్రభావితం చేసే అవకాశముందన్నారు. తనపై హత్యాయత్నానికి సంబంధించి పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే తనపై దాడి జరిగిన తర్వాత 40 నిమిషాల వరకు వారు ఘటనా స్థలానికి రాలేదని సిట్ అధికారులకు తెలిపారు. దాడి గురించి వారికి తానే సమాచారం ఇచ్చినా స్పందించలేదన్నారు. దీనిపైనా లోతుగా విచారించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ రోజు వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులే పలుచోట్ల టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టారని ఆరోపించారు. తన స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వైసీపీ అభ్యర్థి 17 వాహనాల్లో అనుచరులను తీసుకెళ్లి గ్రామస్థులను రెచ్చగొట్టారని చెప్పారు. అక్కడి నుంచి కాశిపెంట్ల, కూచివారిపల్లెకు వెళ్లి అక్కడా ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యారని వివరించారు. కూచివారిపల్లిలో ఒకే ఘటనపై మోహిత్ తన కారు డ్రైవరుతో, తన పీఆర్వోతో వేర్వేరుగా ఫిర్యాదులు చేయించి రెండు కేసులు నమోదు చేయించారని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో సంబంధంలేని వారిని నిందితులుగా చేరుస్తున్నారని, ఆ పేర్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా కూడా పులివర్తి నాని సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆ ముగ్గురు ఎస్పీలపై క్రమశిక్షణ చర్యలు

- అభియోగాల నమోదుకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలింగ్ నాడు, ఆ తర్వాత చెలరేగిన హింసను అరికట్టని కారణంగా సస్పెండైన పల్నాడు, తిరుపతి ఎస్పీలు బిందుమాధవ్, అమిత్ బర్దార్, తిరుపతి జిల్లా నుంచి బదిలీ అయిన ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పల్నాడులో విధ్వంసంపై ఇచ్చిన నివేదిక.. తిరుపతిలో టీడీపీ అభ్యర్థిపై వైసీపీ గూండాల హత్యాయత్నం.. తాడిపత్రిలో పోలీసుల వైఫల్యం, ఎస్పీపై రాళ్లు రువ్వే పరిస్థితిపై అనంతపురం రేంజ్ డీఐజీ శేముషి ఇచ్చిన నివేదిక మేరకు ముగ్గురు ఎస్పీలపై అభియోగాలు నమోదు చేయాలని పేర్కొంటూ జీవో ఇచ్చారు. ఆ ఎస్పీలు తమ వివరణ ఇచ్చేందుకు 15 రోజులు గడువిచ్చారు. 60 రోజుల్లోపు వారిపై చర్య తీసుకుని ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంది.

శాంతిభద్రతలను పరిరక్షించకుండా విదేశాలకా?

- పోలింగ్ అనంతర హింస గర్హనీయం
- రాష్ట్రంలో డబ్బే ప్రధానంగా ఎన్నికలు జరిగాయి
- జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ వ్యాఖ్యలు

విశాఖపట్నం, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరుగుతున్న గొడవలపై దృష్టిసారించి శాంతి, భద్రతలను పరిరక్షించాల్సిన ముఖ్యమంత్రి జగన్ విదేశీ పర్యటనలకు వెళ్లడమేమిటని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింస చెలరేగిందని, వీటిని అదుపు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా జగన్‌పై ఉందని చెప్పారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని, ఈ తరుణంలో జగన్ విదేశీ పర్యటనకు వెళ్లడం సమంజసం కాదని అన్నారు. సీఎం, మంత్రులే శాంతి, భద్రతలను కాపాడే బాధ్యతను తీసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత దాడులు జరగడం గర్హనీయమని... రాజకీయ పార్టీలు పగ, ప్రతీకారాలతో వ్యవహరించడం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. రోడ్లపై రాడ్లు పట్టుకుని దండయాత్రలు చేయడం లైవ్‌లో చూశామని, ఈ తరహా దాడులను ఆయా పార్టీల నేతలు నియంత్రించకపోవడం, దాడులకు తెగబడిన వారిని పార్టీల నుంచి సస్పెండ్ చేయకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో పోలింగ్ రోజున 144 సెక్షన్ విధించినా ఎక్కడా అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో డబ్బే ప్రధానంగా ఎన్నికలు జరిగాయని, జూన్ నాలుగో తేదీ ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి గొడవలకూ ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జరిగిన గొడవలపై నియమించిన సిట్ త్వరగా విచారణ పూర్తి చేసి ఎన్నికల కమిషన్‌కు నివేదించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

వైసీపీ ఓటమి ఖాయం: చింతా మోహన్

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. జగన్‌కు పడాల్సిన ఓట్లన్నీ చంద్రబాబుకే పడ్డాయని, ఏపీలో టీడీపీ కూటమికే విజయావకాశాలున్నాయని చెప్పారు. ఆదివారం, ఇక్కడ ఏపీ భవన్ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ రూ.4వేల నుంచి రూ.5వేల కోట్లు ఖర్చుపెట్టిందని ఆరోపించారు. అసలు అంత డబ్బు ఆ పార్టీకి ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన నిలదీశారు. తిరుపతి అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి రూ.80 కోట్లు, గూడూరు వైసీపీ అభ్యర్థి రూ.45 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. పోలీసులు కూడా వైసీపీకి అండగా నిలిచారన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్న వైసీపీది అంతా భ్రమేనన్నారు. యాంటీ జగన్, యాంటీ మోదీ వేవ్ ఉందన్నారు. కేంద్రంలో బీజేపీకి 150 కంటే ఎక్కువ సీట్లు రావని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- సీఈవోకు టీడీపీ నేత షరీఫ్ లేఖ

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): పర్చూరు నియోజకవర్గంలోని రంగప్పనాయుడువారిపాలెంలో టీడీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్‌పై దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ఈమేరకు ఆదివారం సీఈవోకు ఆయన లేఖ రాశారు. ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా కురిచేడు మండలం రంగప్పనాయుడువారిపాలెంలోని బూత్ నంబర్ 204లో టీడీపీ ఏజెంట్‌పై వైసీపీ దాడి జరిగిందని, పరిస్థితి తీవ్రతను తెలియజేసే వీడియోను సీఈవోకు పంపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు నమోదు

- స్టేషన్‌లోనే సీఐకు బెదిరింపుల ఫలితం..

ప్రొద్దుటూరు, మే 19 : కడప జిల్లా ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీకాంత్‌యాదవ్‌ను బెదిరించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారని సీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే రాచమల్లు, అతడి బావమరిది, ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితో పాటు అతడి అనుచరులు కుండా రవి, ద్వార్శల గురునాథరెడ్డిలపై క్రైమ్ నెంబరు 166/ 2024, 353, 506 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల మేరకు రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ప్రొద్దుటూరులోని రౌడీషీటర్ నవీన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు, బంగారు మునిరెడ్డి తమ అనుచరులతో స్టేషన్‌కు వచ్చి.. మీకు ఎంత ధైర్యం ఉంటే.. నా మనిషిని స్టేషనుకు పిలిపిస్తారా.. అంటూ వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను బెదిరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనపై సీఐ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, వైస్ ఛైర్మన్‌తో పాటు వారి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

కర్రలతో వెంటపడి కొట్టి.. ట్రాక్టర్‌తో దూసుకొచ్చి..

- టీడీపీలో చేరారని తండ్రీకొడుకులపై వైసీపీ మూకల దాష్టీకం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెంకటనాగేశ్వరరావు, గాయాలతో చీరాల వైద్యశాలలో ఉన్న శ్రీనివాసరావు

చీరాలటౌన్, మే 19: తెలుగుదేశం పార్టీలో చేరిన తండ్రీ కొడుకులపై వైసీపీ వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. అయిన వాళ్లని కూడా చూడకుండా వెంటబడి కర్రలతో కొట్టారు. వదిలేయమని వేడుకుంటున్నా వినకుండా ట్రాక్టర్‌తో ఢీకొట్టించేందుకు ప్రయత్నించారు. తప్పించుకున్న బాధితులు చీరాల వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణలోని శివాలయం సమీపానికి చెందిన ఉదయగిరి వెంకట నాగేశ్వరరావు, ఆయన తండ్రి శ్రీనివాసరావు గతంలో వైసీపీలో ఉన్నారు. ఆ సమయంలో బంధువులై ఉండి ప్రస్తుతం వైసీపీ కార్యకర్తలైన ఉదయగిరి నాగరాజు, ఉదయగిరి శేషయ్య, అమ్మిశెట్టి నవీన్, అమ్మిశెట్టి వెంకటరావుతో స్థలం సరిహద్దుల విషయంలో వివాదాలు జరిగాయి. ఇటీవల ఎన్నికల సమయంలో నాగేశ్వరరావు, శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారు టీడీపీలో చేరారన్న అక్కసుతోపాటు గతంలో ఉన్న గొడవలను మనసులో పెట్టుకున్న నాగరాజు, శేషయ్య, నవీన్, వెంకటరావు ఆదివారం ఉదయం పథకం ప్రకారం తండ్రీకొడుకులపై దాడికి తెగబడ్డారు. బాధితులు రోదిస్తూ ప్రాధేయపడినా వినకుండా ట్రాక్టర్‌తో తొక్కించబోయారు. దీంతో బాధితులిద్దరూ అక్కడి నుంచి పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నారు. తల, శరీరంపై తీవ్ర గాయాలైన ఇద్దరినీ కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, రెండో వర్గం కూడా ఏరియా ఆస్పత్రిలో చేరి పోలీసులకు సమాచారం అందించారు.

అధికార పక్షంతో అంటకాగారు!

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ ఏజెంట్‌ను బయటకు రప్పించడం.. నరసరావుపేటలో ఏకంగా టీడీపీ అభ్యర్థి వాహనంపైనే దాడిచేసి హత్యాయత్నానికి దిగడం వంటివి పెద్ద తీవ్రమైనవిగా పోలీసులు పరిగణించలేదు. మారణాయుధాలతో దాడులకు దిగిన వ్యక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయలేదు. మాచర్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో సిట్ దీనిని గమనించింది. మరోవైపు.. తాడిపత్రిలోనూ పోలీసుల వైఫల్యం, ఏకపక్షంగా వ్యవహరించిన తీరు బయటపడ్డాయి. అక్కడ ఇరు వర్గాల దాడుల్లో బాలింత సైతం గాయపడినా మహిళలపై దాడులకు సంబంధించిన సెక్షన్లు నమోదు కాలేదు. ఇక తిరుపతిలో పోలీసులు మరీ ప్రేక్షక పాత్ర వహించారు. ప్రశాంతమైన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే వైసీపీ రౌడీలు రాడ్లు, కర్రలు, మద్యం సీసాలు, సమ్మెటతో వచ్చి టీడీపీ అభ్యర్థిని అంతమొందించేందుకు చేసిన ప్రయత్నం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. అక్కడ కూడా తగిన సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సిట్ గుర్తించినట్లు సమాచారం. ఎంత మంది రాళ్ల దాడుల్లో పాల్గొన్నారు.. ఇనుప రాడ్లు పట్టుకుని ఎందరు స్వైర విహారం చేశారు.. వారిని ప్రోత్సహించిన వ్యక్తులెవరు.. ఈ సమాచారాన్ని పోలీసులు పొందుపరచలేదు. నాలుగు చోట్లా పోలీసులు అధికార పార్టీలో అంటకాగినట్లు తేలింది. కొందరిని మాత్రమే అరెస్టు చేసి ఎక్కువ మంది బాధ్యులను వదిలిపెట్టడాన్ని సిట్ బృందాలు గుర్తించాయి. సిట్ ఏర్పడ్డాక అరెస్టవడం ఖాయమని తెలియడంతో.. పై నుంచి వచ్చిన సలహాల మేరకు ఆకస్మికంగా పరారైనట్లు బట్టబయలైంది. కీలకమైన కుట్రదారులు, క్రియాశీలంగా దాడులు చేసిన వారిని వైసీపీ అభ్యర్థులు డబ్బిచ్చి ఊళ్లు దాటించినట్లు.. కొందరినైతే సుదూర ప్రాంతాలకే పంపినట్లు తేలింది. వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసు బృందాలు సిద్ధమవుతున్నాయి. అన్నిటికీ మించి.. పోలింగ్ రోజు అల్లర్లకు సంబంధించి ప్రజాప్రాతినిధ్య (ఆర్‌పీ) చట్టం సెక్షన్లు ఎందుకు పెట్టలేదన్న ప్రశ్నకు స్థానిక పోలీసుల నుంచి సమాధానం లేదు. సిట్ గుర్తించిన లోపాల్లో ఇది ప్రధానమైనది. ఈ వివరాలతోపాటు ఎక్కడెక్కడ ఏ పోలీసు అధికారి తప్పు చేశారు.. ఉద్దేశపూర్వకంగా పక్షపాతంతో పనిచేసిన వారెవరు.. మొదలైన అంశాలతో సిట్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఎన్నికల సంఘానికి నివేదిక పంపినట్లు తెలిసింది.


ఆదివారం పల్నాడు జిల్లా దాచేపల్లి స్టేషన్‌లో సిట్ బృందం

తాడిపత్రిలో బందోబస్తుపై శ్రద్ధపెట్టలేదేం?

అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాళ్ల దాడికి సంబంధించి సస్పెండైన పట్టణ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ గౌస్‌బాషాను సిట్ విచారించింది. పోలింగ్ రోజున పట్టణంలోని ఓంశాంతి నగర్, పాతకోట ప్రాంతాల్లో రాళ్ల దాడికి కారణం ఎవరు.. ఎవరెవరి ప్రమేయం ఉంది.. ఎందుకు కట్టడి చేయలేకపోయారని వారిని సిట్ సభ్యులు డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ ప్రశ్నించినట్లు సమాచారం. దాడి జరిగాక కూడా బందోబస్తు పెంచడంపై ఎందుకు శ్రద్ధ పెట్టలేదని సూటిగా అడిగినట్లు తెలుస్తోంది. చాలినంత మంది సిబ్బందిని నియమించి ఉండి ఉంటే రెండోరోజు అల్లర్లు జరిగి ఉండేవి కాదనీ, ఆ మేరకు ఉన్నతాధికారులకు ఎందుకు నివేదించలేకపోయారని నిలదీసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ బృందం తాడిపత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపింది. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు జరిగిన హింసాకాండకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రాళ్లదాడిలో ఎంతమంది పాల్గొన్నారు, ఎంత మందిని అదుపులోకి తీసుకున్నారో ఆరాతీశారు. 11-12 గంటలపాటు నిలదీయడంతో పోలీసు అధికారులు వణికిపోయారు. అనంతరం సిట్ సభ్యులు.. డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఇంకోవైపు.. రూరల్ స్టేషన్‌లో సిట్ బృందాన్ని వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భార్య రమాదేవి కలిశారు. తన ఇంట్లో, కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలు, ఫర్నిచర్‌ను పోలీసులు ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు.

దాడుల ప్రదేశాల్లో పరిశీలన

సిట్ బృందం తిరుపతి జిల్లాలో ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. రాత్రికే ప్రాథమిక నివేదికను సిట్ సారథి ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌కు సమర్పించినట్లు తెలిసింది. సిట్ సభ్యులైన ఏసీబీ డీఎస్పీ కె.రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ శనివారం రాత్రి 10.30కు తిరుపతి చేరుకున్నారు. ఆలోపే వివిధ మార్గాల్లో చాలామటుకు సమాచారం సేకరించారు. ఆదివారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. తొలుత తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. పోలింగ్ మర్నాడు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనం ధ్వంసం వంటి ఘటనలకు సంబంధించిన కేసుల ఎఫ్ఐఆర్‌లు పరిశీలించారు. ఆ స్టేషన్ సీఐ మురళీమోహన్ నుంచీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రదేశాలనూ పరిశీలించారు. తర్వాత చంద్రగిరి మండలం కూచివారిపల్లి వెళ్లి పోలింగ్ రోజు రాత్రి హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాలను చూశారు. టీడీపీ వర్గీయులు తగులబెట్టిన వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని, కారును పరిశీలించారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గ్రామస్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

200 మందిని రప్పించి దాడులు!

పోలింగ్ రోజు వికలాంగుడితో ఓటు వేయించేందుకు యత్నించిన టీడీపీ ఏజెంట్ మురళీధర్‌ను రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేసి కొట్టారని కూచివారిపల్లి గ్రామస్థులు ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రావడంతో ఆ పార్టీ సర్పంచ్ రామిరెడ్డిపల్లి నుంచి 200 మందిని రప్పించి తమపై దాడి చేయించారని సిట్ దృష్టికి తీసుకొచ్చారు. పలువురు తమ గాయాలను కూడా చూపించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపైనా కేసులు పెట్టారని ఆ గ్రామ మాజీ సర్పంచ్ కవిత చెప్పారు. పెద్దఎత్తున ఘర్షణ జరిగిందని, ఆ కారణంగా సర్పంచ్ ఇల్లు, కారు ఎవరు తగులబెట్టారో, మరో కారు ఎవరు ధ్వంసం చేశారో గుర్తించలేకపోయామని స్థానికులు వివరించారు. అనంతరం సిట్ అధికారులు పొరుగునే ఉన్న రామిరెడ్డిపల్లికి వెళ్లి మోహిత్‌రెడ్డి కారు డ్రైవర్ ఈశ్వరయ్యను విచారించారు. అలాగే చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, సీఐ రామయ్యలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను సిట్ బృందం గుర్తించినట్లు సమాచారం. అలాగే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలో, హింసాత్మక ఘటనల నియంత్రణ, కేసుల నమోదులో బాధ్యతారహితంగా వ్యవహరించిన కొందరు అధికారులపై చర్యలకు సిఫారసు చేసినట్లు తెలిసింది. సిట్ చీఫ్ అనుమతితో ఈ ఘటనలపై మరింత లోతుగా విచారణ జరపాలని భావిస్తున్నట్లు సమాచారం. సుమారు 70-80 మందిని ప్రశ్నించాల్సి ఉందని, అప్పుడే ఏయే పోలీసు అధికారులు ఏ స్థాయిలో విఫలమయ్యారో అంచనా వేయడానికి వీలవుతుందని వారు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది.

పల్నాడు స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌ల పరిశీలన

పోలింగ్ రోజున, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో పలుచోట్ల సిట్ బృందం విచారణ చేపట్టింది. జిల్లా కేంద్రంలో నరసరావుపేట ఒకటో పట్టణం, రూరల్, మాచర్ల నియోజకవర్గం కారంపూడి, గురజాల నియోజకవర్గం దాచేపల్లి పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను, హింసాత్మక సంఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌ను సిట్ సభ్యులు పరిశీలించారు. జరిగిన అరాచక సంఘటనలపై నమోదుచేసిన ఎఫ్ఐఆర్ వివరాలను స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసులకు సంబంధించిన సెక్షన్లు, ఎంత మందిపై కేసులు నమోదు చేశారో వివరాలు సేకరించారు. కారంపూడిలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి స్వయంగా దాడులు చేయించారు. మారణాయుధాలతో స్వైరవిహారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సిట్ పరిశీలించింది. నరసరావుపేట మండలం దొండపాడులో వైసీపీ మూకలు ఎంపీ, టీడీపీ లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడి చేశాయి. రెండు కార్లను పూర్తిగా ధ్వంసం చేశారు. సిట్ సభ్యులు ఈ వివరాలనూ సేకరించారు. నరసరావుపేట దాడులకు సంబంధించి పూర్తిస్థాయిలో కేసులు నమోదు చేయకపోవడాన్ని గుర్తించినట్లు సమాచారం. దాచేపల్లి మండలం తంగెడలో పోలింగ్ కేంద్రంపై వైసీపీ గూండాలు పెట్రోలు బాంబులతో దాడులు చేశారు. 13 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదుచేసినా.. తేలికపాటి సెక్షన్లు నమోదుచేసినట్లు తెలిసింది. ఇరికేపల్లిలో జరిగిన అల్లర్లపై దాచేపల్లి స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లను సిట్ సభ్యులు పరిశీలించారు. జిల్లాలో హింసాత్మక సంఘటనలపై స్థానిక అధికారుల వైఫల్యాలపై కూడా వారు ప్రశ్నించినట్లు తెలిసింది. సిట్ దర్యాప్తు ముమ్మరం కావడంతో కేసుల్లో ఉన్న వైసీపీ నేతలు పలువురు స్వస్థలాలను విడిచి పరారైనట్లు సమాచారం.

వాస్తవాల గుట్టువిప్పని పోలీసు అధికారులు

పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ముఖ్యంగా చంద్రగిరి మండలం కూచివారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు వాస్తవంగా ఏం జరిగింది.. ఆ రోజు రాత్రి కూచివారిపల్లిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరన్నది ఇంతవరకూ వెల్లడించలేదు. పోలింగ్ మరుసటి రోజు పద్మావతి వర్సిటీలో టీడీపీ అభ్యర్థి నానిపై హత్యాయత్నం జరిగిన సందర్భంలో ఆయన గన్‌మన్ జరిపిన కాల్పుల్లో.. దాడికి యత్నించిన ఇద్దరు వైసీపీ నేతలు గాయపడిన విషయాన్ని కూడా బయటపెట్టలేదు. అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారంటూ కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దానిపైనా పోలీసు స్పందించలేదు. అసలు దాడి జరిగిందో లేదో కూడా స్పష్టత ఇవ్వలేదు. చిన్నపాటి కేసులపై కూడా ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివరాలు వెల్లడించే అధికారులు.. ఇంత తీవ్ర ఘటనలు జరిగినపుడు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించారా అనేది చూడాల్సి ఉంది.

పరువు పోయె!

భ్రష్టుపట్టిన రాష్ట్ర పోలీసు వ్యవస్థ

పోలీసు శాఖకే మాయని మచ్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు ఏపీ పోలీసు అంటే దేశంలోనే ఎంతో గౌరవం ఉండేది. ఇతర రాష్ట్రాల్లో పోలీసులు అధికార పార్టీకి వంత పాడినా.. ఏపీలో పరిధి దాటి వ్యవహరించేవారు కాదు. అలాంటిది... జగన్ సర్కారు వచ్చాక అంతా 'రివర్స్'. అనుకూలమైన అధికారులకు కీలక పోస్టింగ్‌లు కట్టబెట్టి తమకు గిట్టనివారిని వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించారు. ఐపీసీ చట్టాన్ని కాకుండా వైసీపీ కోడ్ అమలు చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు, వేధింపులు. ప్రతిపక్షాల నేతలపై అడ్డగోలుగా అక్రమ కేసులు, అరెస్టులు. నిందితుడు అధికార పక్షమైతే చర్యలు ఉండవు. బాధితులపైనే ఎదురు కేసులు పెడతారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో పోలీసుల తీరు ఇది. ఎన్నికల సమయంలో అయితే మరింత వికృతరూపం దాల్చింది. పోస్టింగ్‌లు ఇచ్చిన అధికార పార్టీ రుణం తీర్చుకునేందుకు పూర్తిగా ఏకపక్షంగా నడుచుకున్నారు. పారదర్శకత అన్న విషయాన్నే పూర్తిగా మరచిపోయారు. అధికార పార్టీ నేతల అక్రమాలకు సహకరించారు. ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నా అడ్డుకోలేదు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలకు సమాచారం చేరవేస్తూ, దాడులకు ఉసిగొల్పారు. కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేయడంతో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వరుసగా బదిలీలు, సస్పెన్షన్లు.. పోలీసు శాఖకే మాయని మచ్చ తెచ్చాయి. ఒక పోలీసు అధికారి పాత్రపై మరో పోలీసు అధికారి విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సి రావడం విచారకరం. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని డీజీపీ నుంచి ఎస్ఐ వరకు ఈసీ వేటు వేయడం పోలీసు శాఖకు అప్రతిష్ఠ. ఒకప్పుడు పోస్టింగ్‌ల కోసం అధికార పార్టీ నేతలతో పోలీసు అధికారులు సన్నిహితంగా మెలిగినా చట్టం ప్రకారం నడుచుకునేవారు. అక్కడక్కడా తమకు కావాల్సిన వారి విషయంలో పక్షపాతం చూపిన సంఘటనలు ఉండొచ్చు కానీ ఏకపక్షంగా వ్యవహరించిన దాఖలాలు లేవు. ఇప్పుడు అన్ని హద్దులూ చెరిపేశారు.

దిగజారిన ప్రతిష్ఠ

ఒకప్పుడు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొగల సత్తా ఆంధ్రప్రదేశ్ ఖాకీల సొంతం. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను, మధ్యాంధ్రలో రౌడీయిజం.. ఉత్తరాంధ్రలో మావోయిజం.. ఏదైనా దీటుగా ఎదుర్కొన్నారు. జగన్ సర్కారు వచ్చాక పోలీసు శాఖ ప్రతిష్ఠ దిగజారిపోయింది. రోడ్డుపై వీరంగం సృష్టించినా.. వైసీపీ అయితే వదిలేయ్! భూమి కబ్జా చేసినా.. ఎమ్మెల్యే మనిషైతే అడ్డుకోవద్దు! బాధితులు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వస్తే... ప్రతిపక్షమైతే రివర్స్ కేసు పెట్టి లాకప్‌లో పడేయ్! రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకుంటే.. ప్రతిపక్షానికి చెందిన వారిపైనే హత్యాయత్నం కేసు పెట్టి కనీసం రెండు నెలలు బెయిల్ రాకుండా చూడండి!.. గత ఐదేళ్లుగా చాలా పోలీస్ స్టేషన్లలో జరిగిన వ్యవహారం ఇది. పోలీసు స్టేషన్‌కే వచ్చి మహిళా కానిస్టేబుల్, ఎస్ఐపై రౌడీ షీటర్ దాడి చేసినా చర్యలుండవు. మంత్రి తాలుకా అయితే రాజీపడాలని డిపార్ట్‌మెంట్‌వారికే చెబుతారు. గతంలో ఎన్నడూలేని విధంగా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. రాష్ట్రంలో సామాన్యుడి నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు రక్షణ లేని పరిస్థితి. దక్షిణాది రాష్ట్రాల్లోనే జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబుపై వైసీపీ మూకలు దాడి చేస్తే 'ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంది' అని డీజీపీ కుర్చీలో కూర్చుని గౌతమ్ సవాంగ్ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. డీజీపీ కార్యాలయం పక్కనే టీడీపీ ఆఫీసుపై వైసీపీ గూండాలు పట్టపగలు దాడులు చేస్తే కనీస చర్యలు తీసుకోలేని దుస్థితి. హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో వైసీపీ కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేసినా చర్యల్లేవు. హైకోర్టు రిజిస్ట్రీ స్వయంగా ఫిర్యాదు చేసినా నిందితుల ఆచూకీ లభించలేదని కోర్టుకు చెప్పిన ఘనత సీఐడీ సొంతం. అదే కేసును సీబీఐకి అప్పగించగానే వరుస అరెస్టులు చేసింది. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై దారుణమైన ట్రోలింగ్‌కు పాల్పడినా ఏపీ పోలీసులు వారివైపు కన్నెత్తి చూడలేదు. అదే అధికార పార్టీ నేతలపై చిన్న పోస్టు పెట్టినా, ఈగ వాలినా పోలీసులు రెచ్చిపోతారు. 'భారతి పేటీఎమ్' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం దారుణమని అధికార పార్టీ నేతలందరూ వరుస బెట్టి కేకలేయడంతో వెంటనే రంగంలోకి దిగిపోయారు. టీడీపీ సోషల్ మీడియాపై కేసు పెట్టారు. హైదరాబాద్‌లో చింతకాయల విజయ్ ఇంటికెళ్లి ఆయన కుమార్తెలను భయపెట్టిన ఘన చరిత్ర సీఐడీ సొంతం. ఇసుక దోచుకెళుతున్న వైసీపీ నేతల లారీల గురించి చెప్పిన దళిత యువకుడిని అభినందించాల్సింది పోయి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి అరగుండు కొట్టించిన ఖాకీలు రాజమహేంద్రవరంలో ఉన్నారు. 'నీకు పోస్టింగ్ ఇప్పిస్తాం. ప్రజల్ని పీడించుకు తినుకో. మా వాళ్లు చేసే కబ్జాలు, అరాచకాలకు మాత్రం వంత పాడాలి. మా నేతలపై బాధితులు కేసు పెడితే వారిపై రివర్స్ కేసులు పెట్టాలి.' అన్నట్టుగా వైసీపీ నేతలు, పోలీసులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ చట్టాన్ని అమలు చేసిన ఖాకీలు ఎన్నికల్లో అధికార పార్టీకి ఎక్కడికక్కడ టోకున అమ్ముడుపోయారు.

ఈసీ కొరడాతో అవాక్కు...

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసుల తీరు మరీ అధ్వానంగా ఉందంటూ ప్రతిపక్షాలు, పాత్రికేయులు, ప్రజా సంఘాలు ఎంత మొత్తుకున్నా మొన్నటి వరకూ పట్టించుకోలేదు. ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించడంతో దారుణాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. 'నా మండలంలో వైసీపీకి మూడువేల ఓట్ల మెజారిటీ తీసుకొస్తా' అంటూ బహిరంగంగా ప్రకటించిన పల్నాడు ఎస్ఐ నుంచి.. 'ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలీదా?' అంటూ నిజాయితీ అధికారులకు చీవాట్లు పెట్టిన డీజీపీ వరకూ ఈసీ బదిలీ వేటు వేసింది. రాష్ట్రంలోని సగం జిల్లాల పోలీసు అధికారులు, అనంతపురం డీఐజీ, గుంటూరు ఐజీ, విజయవాడ పోలీస్ కమిషనర్, ఏకంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ సైతం బదిలీ అయ్యారు. ఏపీ పోలీసులు ఎంతగా దిగజారిపోయారో తెలిసి ఇతర రాష్ట్రాల పోలీసులు అవాక్కయ్యారు. దేశ నలుమూలల్లో ఐపీఎస్ వర్గాల్లో ఇదే చర్చ జరిగింది. ఏపీ కేడర్ ఐపీఎస్‌లకు ఇతర రాష్ట్రాల్లోని బ్యాచ్‌మేట్లు ఫోన్లు చేసి వాకబు చేశారు. 'మీ రాష్ట్రంలో పరిస్థితి అంత దారుణంగా ఉందా? తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా ఇతర ఏ రాష్ట్రంలోనూ ఇంత మంది ఐపీఎస్ అధికారులను ఈసీ పక్కన పెట్టలేదే' అంటూ ఆరా తీశారు. 'ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటనకు వస్తే సెక్యూరిటీ ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? ఒకప్పుడు ఏపీ గ్రేహౌండ్స్ అంటే దేశంలోనే టాప్. వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు లేకుండా చేసిన ఏకైక రాష్ట్రం మీదేగా?' అంటూ మరో రాష్ట్రానికి చెందిన ఒక ఐపీఎస్ మన రాష్ట్ర ఐపీఎస్‌ను అడిగారంటే ఎంత అవమానమో అర్థం చేసుకోవచ్చు.

హింసకు వంత పాడి...

పోలింగ్ రోజు, ఆ తర్వాత పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలో హింసకు వంత పాడిన పోలీసులపై సహచర పోలీసులే ప్రత్యేక దర్యాప్తు మొదలెట్టడం ఆ శాఖకు మాయని మచ్చ. 'మేం ఐపీఎస్ అధికారులమే అయినా వైసీపీ భక్తులం' అనేలా ప్రవర్తించిన పలువురు ఐపీఎస్‌లను ఈసీ బదిలీ చేసింది. పల్నాడు, అనంతపురం ఎస్పీలను ఏకంగా సస్పెండ్ చేసి ఒక్కసారిగా ఖాకీల వెన్నులో వణుకు పుట్టించింది. అంతకుముందు కోడ్ అమలు చేయడం కూడా చేతగాని నంద్యాల జిల్లా పోలీసులపై విచారణకు ఆదేశించింది. రాష్ట్రంలో శాంతిభద్రతల దుస్థితిపై సీఎస్, డీజీపీలు ఢిల్లీకి వెళ్లి ఈసీకి సంజాయిషీ ఇచ్చుకోవడంతో దేశవ్యాప్తంగా ఏపీ పోలీసు పరువు పోయింది. ఎన్నికల సందర్భంగా పోలీసుల పక్షపాత ధోరణి, అధికార పార్టీకి కొమ్ముకాయడం, అరాచకాలను పట్టించుకోక పోవడం తదితర ఆరోపణలపై పదుల సంఖ్యలో పోలీసులపై సిట్ దర్యాప్తు చేస్తుండటం మరింత దారుణం. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి పోలీసు అధికారిని మరో పోలీసు అధికారి విచారిస్తున్నారు. 'సీడీ ఫైల్స్ తీసుకురా? ఎఫ్ఐఆర్‌లో ఏయే సెక్షన్లు వేశారు? దర్యాప్తు తీరు ఇదేనా? డ్యూటీ చేయడం ఇలాగేనా?' అని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా చూసి యూనిఫామ్‌లో ఉన్న ఇతర పోలీసులు నలిగిపోతున్నారు.

రాష్ట్రాన్ని గబ్బులేపిన

వైఎస్ఆర్ పార్టీ

- నోరుజారిన వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి


శ్రీవారి ఆలయం ముందు వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి

తిరుమల, మే 19(ఆంధ్రజ్యోతి): ఈ రాష్ట్రాన్ని గబ్బులేపిన పార్టీ వైఎస్ఆర్ పార్టీ అంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే, సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కడప బరిలో షర్మిల నిలబడినా, ఇంకెవరు నిలబడినా కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసని.. ఒక శాతం కాదు కదా 0.2శాతం కూడా కడపలో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. అవినాశ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని.. వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. 'రాష్ట్రాన్ని విభజించి అధోగతి పాల్జేశారు. ఈ రాష్ట్రాన్ని గబ్బులేపిన పార్టీ వైఎస్ఆర్ పార్టీ' అంటూ వెంటనే కాంగ్రెస్ పార్టీ అంటూ సరిదిద్దుకొనే ప్రయత్నం చేశారు. 175 స్థానాల్లో వైసీపీ విజయం సాధిస్తుందని, సైలెంట్ ఓటింగ్ ఏ విధంగా ఉంటుందో వచ్చే నెల 4వ తేదీ మధ్యాహ్నానికి ప్రజలందరికీ తెలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ మెజార్టీని ప్రపంచం మొత్తం చూస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో అధికార మార్పిడి ఖాయం

- మోదీ కూడా దిగిపోతారు: నారాయణ



గుంటూరు(తూర్పు), మే 19: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అందరికీ తెలిసిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ అన్నారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమని నారాయణ చెప్పారు. అయితే టీడీపీకి అధికారం వస్తే అది బీజేపీతో పొత్తువల్ల కాదని... కేవలం జగన్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతోనే టీడీపీకి అధికారం రావొచ్చని అన్నారు. పెరిగిన ఓటింగ్ శాతం చంద్రబాబుకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓటమి భయంతోనే రాష్ట్రంలో వైసీపీ దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. డీజీపీని మార్పు చేయకపోతే కౌంటింగ్ సమయంలో పూర్తిస్థాయిలో దాడులు జరిగేవని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను అభినందిస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతాన కేవలం చంద్రబాబుపైనే మోదీ ఆశలు పెట్టుకున్నారన్నారు.


తగలబడుతున్న బస్సు.. మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టైరుకు నిప్పంటుకుని..
ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

- బెంగళూరు నుంచి భీమవరం వెళ్తుండగా ఘటన

రేణిగుంట, మే 19: టైరుకు నిప్పంటుకుని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కాలిపోయింది. బెంగళూరు నుంచి భీమవరం వెళ్తుండగా తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదుళ్లచెరువు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య కథనం మేరకు.. శనివారం రాత్రి బెంగళూరు నుంచి భీమవరానికి 12 మంది ప్రయాణికులతో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. ఆదివారం తెల్లవారుజామున తిరుపతి సమీప వెదుళ్లచెరువు వద్ద టైరుకు నిప్పంటుకుంది. పక్కన వెళుతున్న మరో వాహన డ్రైవర్ గుర్తించి బస్సు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే రోడ్డుపక్కన బస్సును నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దింపేశారు. ఈ లోపు మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. బస్సు పూర్తిగా కాలిపోవడంతో రూ.40లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని రమణయ్య తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో దానికి సంబంధించిన ఏదేని వస్తువు టైరుకు గుచ్చుకొని.. రాపిడికి మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

మేం భారత్‌కు తిరిగి వచ్చేస్తాం!

- కిర్గిస్థాన్‌లో చిక్కుకున్న విద్యార్థుల వేడుకోలు


కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో పెందుర్తి ప్రాంత వైద్య విద్యార్థులు

పుణె/హైదరాబాద్, పెందుర్తి, మే 19: విదేశీ విద్యార్థులే లక్ష్యంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలతో భారతీయులు వణికిపోతున్నారు. హాస్టల్ గదులు వదిలి బయటకు రావడం లేదు. అక్కడి విద్యాసంస్థలు పరీక్షలను వాయిదా వేశాయి. చాలా మంది భారత్‌కు తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని భారత విద్యార్థులు వాపోతున్నారు. 'బిష్కెక్‌లోని యూనివర్సిటీ హాస్టల్ నుంచి నన్ను, మరికొంత మంది విద్యార్థులను 30 కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు వసతి గృహానికి తరలించారు' అని తెలంగాణలోని నల్లగొండకు చెందిన ఓ విద్యార్థిని ఫోన్‌లో తెలిపారు. యూనివర్సిటీలో భద్రత ఉన్నప్పటికీ బిష్కెక్‌లో విద్వేషాలు పెరిగిపోవడంతో తీవ్ర భయాందోళనకు గురైనట్లు చెప్పారు. ఏపీ, విశాఖపట్నంలోని పెందుర్తి ప్రాంతానికి చెందిన పది మంది వైద్య విద్యార్థులు కూడా బిష్కెక్‌లో ఇరుక్కుపోయారు. వారం రోజుల్లోగా కళాశాలకు సెలవులనగా అల్లర్లు చోటు చేసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక, శుక్రవారం రాత్రి తాను ఉంటున్న ప్రాంతానికి 2.5 కిలోమీటర్ల దూరంలో ఓ హాస్టల్‌పై స్థానికులు దాడి చేశారని మహారాష్ట్రలోని బీడ్‌కు చెందిన ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వెల్లడించారు. హింసాత్మక ఘటనల వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయని, భయానక పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. అదే కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఇండోర్ విద్యార్థి స్పందిస్తూ.. తమ హాస్టల్‌లో లైట్లు ఆపేసి 24 గంటలుపైగా అవుతోందని చెప్పారు. చాలా మంది అల్పాహారం చేసేందుకు క్యాంటీన్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని, కాలేజీ సిబ్బందే తమ గదులకు ఆహారాన్ని సరఫరా చేస్తున్నారని వివరించారు.

మేం మీ వాళ్లమే!

- అనుమానించొద్దు.. అపోహలొద్దు
- టీడీపీ నేతలకు కొందరు అధికారుల మొర
- వైసీపీ ప్రభుత్వం చెప్పిన పనులే
- సొంతగా మేమేమీ చేయలేదు
- ప్రాధాన్యమిస్తామంటే 'సమాచారం' అందిస్తాం
- అవకాశమిస్తే అధినేతతోనే మాట్లాడుకుంటాం
- కొందరు అధికారుల రాయబారాలు
- ఉత్తరాది బీజేపీ నేతలతో ఫోన్లు చేయించిన ఇద్దరు ఉన్నతాధికారులు
- ఆచితూచి వ్యవహరిస్తున్న టీడీపీ నేతలు
- ఫలితాలొచ్చేదాకా మౌనమే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలింగ్ ముగిసి.. ఎన్నికల ఫలితాల కోసం పార్టీలు, ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారు. జూన్ 4 ఎప్పుడు వస్తుందా.. లెక్కలు ఎప్పుడు తేలతాయా అని కళ్లలో వత్తులు వేసుకుని మరీ చూస్తున్నారు. ఈలోపే రాష్ట్రంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఓటింగ్ సందర్భంగా ప్రజల నాడిని బేరీజు వేసుకున్న అధికార వర్గాలు.. నెమ్మదిగా విపక్ష టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాయి. గత ప్రభుత్వంలో తమపై ఉన్న ఒత్తిడి వల్ల దూరంగా ఉండాల్సి వచ్చిందని, తాము టీడీపీకి అనుకూలంగా ఉండేవాళ్లమేనంటూ కొందరు అధికారులు సంకేతాలు పంపుతున్నారు. సీఎం జగన్‌కు, ప్రభుత్వ పెద్దలకు బాగా సన్నిహితులని భావిస్తున్న అధికారులు సైతం ఇలాంటి సంకేతాలు పంపుతుండటం విశేషం. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి కొద్ది రోజుల క్రితం ఒక టీడీపీ నేతతో ఫోన్లో మాట్లాడారు. 'నన్ను మీరు అనవసరంగా అనుమానిస్తున్నారు. నేను సర్వీసు చివరి దశలో ఉన్నాను. నేను మీకు వ్యతిరేకం కాదు. ప్రభుత్వం చెప్పిన పనులు చేయడం తప్ప నేను సొంతంగా చేస్తున్నవి ఏమీ లేవు. నాపై అపోహలు పెట్టుకోవద్దు. మీకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాను. అవకాశం ఇస్తే చంద్రబాబు గారితో కూడా మాట్లాడతాను. నన్ను టార్గెట్ చేస్తూ ప్రచారం చేయవద్దు' అని విజ్ఞప్తి చేశారు. మరి కొందరు అధికారులు కూడా ఇదే తరహా వాదనలు వినిపిస్తున్నట్లు సమాచారం. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ఒక సీనియర్ నేతకు వరుసగా రెండ్రోజుల్లో ఇద్దరు ఐపీఎస్ అధికారులు ఫోన్లు చేశారు. తమను వ్యతిరేకుల జాబితాలో చేర్చవద్దని, అధికారులుగా తమకు పార్టీలు ఉండవన్నారు. చంద్రబాబుకు తమ విషయం చెబితే ఆయనతో ఫోన్లో మాట్లాడుకుంటామని చెప్పారు. మరి కొందరు అధికారులు చంద్రబాబుకు సన్నిహితులెవరో ఆరా తీసే పనిలో పడ్డారు. తమకు తెలిసిన వారికి ఫోన్లు చేసి ఎవరి ద్వారా వెళ్తే కొత్త ప్రభుత్వంలో తమకు ఇబ్బందులు రాకుండా ఉంటాయో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు అధికారులు టీడీపీ నేతల ముందు కొత్త కొత్త ప్రతిపాదనలు పెడుతున్నారు. జగన్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న వ్యవహారాలపై తమ వద్ద కొంత సమాచారం ఉందని, తమకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తే ఆ సమాచారం మొత్తం చేతికి ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారు. శాంపిల్ చూడాలంటూ కొన్ని అంశాలను చెబుతున్నారు. ఒక మహిళా అధికారి రెండ్రోజుల కింద ఓ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడికి ఫోన్ చేసి అవీ ఇవీ మాట్లాడారు. తన విషయం ఎప్పుడైనా చర్చకు వస్తోందా.. తనపై పార్టీ అధినేతకు ఎటువంటి అభిప్రాయం ఉందో తెలుసుకోవడానికి ఆమె ప్రయత్నించారు. ఉత్తర భారతానికి చెందిన ఇద్దరు అధికారులు కూటమిలోని బీజేపీ నేతలకు తమ సొంత రాష్ట్ర బీజేపీ నేతలతో ఫోన్లు చేయించారు. తమను కొత్త ప్రభుత్వంలో ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని వారితో చెప్పించారు. ఈ అంశాలన్నీ ప్రస్తుతం టీడీపీ ముఖ్య నేతల మధ్య చర్చకు వస్తున్నాయి. 'వారి పని వారు చేసుకుంటూ వెళ్లిన అధికారులతో మాకు ఇబ్బంది లేదు. కానీ జగన్ ప్రభుత్వంలో తీవ్ర ఆర్థిక అవకతవకల్లో భాగస్వాములుగా ఉన్న వారు... అడ్డగోలుగా అధికార పార్టీకి సహకరించిన వారి విషయంలో కఠినంగా ఉంటాం. టీడీపీ ప్రభుత్వాలు ఎప్పుడూ అధికారులను ఇబ్బంది పెట్టలేదు. కానీ ఈ ఐదేళ్ల అనుభవాలతో కొందరు అధికారుల విషయంలో మేం కటువుగా ఉండక తప్పని పరిస్థితి' అని ఒక మాజీ మంత్రి వ్యాఖ్యానించారు. అయితే ఎక్కువ మంది టీడీపీ నేతలు మాత్రం ఫలితాలు వచ్చే వరకూ అధికారుల విషయంలో మౌనం వహించడం ఉత్తమమని భావిస్తున్నారు.

మీ ఖచ్చితమైన ఊహ!
మిమ్మల్ని గెలిపిస్తుంది
లక్షాధికారిని చేస్తుంది !!
QR స్కాన్ చేయండి

కన్నకూతురుని కడతేర్చిన తల్లిదండ్రులు

- మానసిక స్థితి బాగోలేని కుమార్తెను వదిలించుకోవాలని హత్య

సిరిసిల్ల క్రైం, మే 19: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న కూతురు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తట్టుకోలేక కన్నవాళ్లే ఆమెను హత్యచేశారు. ఆ తప్పు బయటపడకుండా ఉండాలని తమ బిడ్డ అనారోగ్యంతో మరణించిందని కూతురి అత్తింటి వారిని నమ్మించి అంత్యక్రియలు చేశారు. పోలీసుల కథనం మేరకు... తెలంగాణలోని రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతుల ఏకైక కుమార్తె ప్రియాంక(24) ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించగా కొంతవరకు నయమైంది. దీంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం దర్గపల్లికి చెందిన పృథ్వీతో ప్రియాంకకు 2020లో పెళ్లి చేశారు. ప్రియాంక దంపతులకు ఓ కుమారుడు(13 నెలలు) ఉన్నాడు. మానసిక సమస్యలు తిరగబెట్టడంతో ప్రియాంక నెల రోజులుగా కుటుంబసభ్యులందరినీ ఇబ్బంది పెడుతుంది. పసివాడని కూడా చూడకుండా కన్నకొడుకును కొట్టి కింద పడేస్తుందేది. పృథ్వీ ఈ విషయాన్ని అత్తమామల దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రియాంకను పుట్టింటికి తీసుకెళ్లారు. ఆమెకు చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు మళ్లీ కొంత ఖర్చుపెట్టగా అప్పులు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రియాంకను వదిలించుకోవాలని భావించిన తల్లిదండ్రులు 14న అర్ధరాత్రి తమ ఇంట్లోనే ఉరివేసి కూతురిని హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఆమె అత్తింటికి తరలించారు. ప్రియాంక మానసిక వ్యాధితో మరణించిందని భర్త పృథ్విని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయించారు. అయితే, ప్రియాంక మరణంపై నేరెళ్ల గ్రామానికి చెందిన పలువురు అనుమానాలు వ్యక్తం చేయడంతో గ్రామ కార్యదర్శి ద్వారా ఫిర్యాదు స్వీకరించిన ఎస్పీ విచారణకు ఆదేశించారు. దీంతో ప్రియాంక తల్లిదండ్రులను విచారించగా అసలు విషయం బయటపెడింది. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈసీ దెబ్బతో..
జగన్ పేరు మాయం!

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చే బ్యాగులు, పుస్తకాలపైనా జగన్ పేరు వేసుకుని ప్రచారం చేసుకున్నారు. అవన్నీ తానే ఇస్తున్నట్లు ప్రచారం జరిగేలా ఏటా దాదాపు 40లక్షల కిట్లపై జగన్ పేరును ముద్రించారు. బ్యాగులు, నోట్ పుస్తకాలు, బెల్టులపై 'జగనన్న విద్యా కానుక' అని ముద్రిస్తున్నారు. ఈసారి జగన్ పేరు తొలగించి కిట్లు తయారుచేశారు. కోడ్ అమల్లో ఉన్నందున వాటిని ఇంకా పాఠశాలలకు పంపలేదు. పోలింగ్ ముగిసినందున కిట్ల సరఫరాకు అనుమతి ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ ఈసీని కోరనుంది. వచ్చేవారం నుంచి స్కూల్ కాంప్లెక్స్‌లు, పాఠశాలలకు విద్యా కానుక కిట్లు రవాణా చేస్తారు.

టెండర్లు లేకుండా కమీషన్లు

ఏటా దాదాపు రూ.వెయ్యి కోట్లతో ప్రభుత్వం విద్యా కానుక కిట్లు కొనుగోలు చేస్తోంది. ప్రతి సంవత్సరం వీటి కొనుగోలుకు టెండర్లు పిలుస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యా కానుక పంపిణీ కోసం టెండర్లు పిలవకుండా నేరుగా కాంట్రాక్టులు కట్టబెట్టింది. 2023-24లో కిట్లు సరఫరా చేసిన 19మంది కాంట్రాక్టర్లకే మరోసారి కాంట్రాక్టు అప్పగించింది. పాఠ్యపుస్తకాల వరకు రూ.253 కోట్లతో టెండర్లు పిలిచింది. అయితే బ్యాగులు, బెల్టులు, బూట్లు, సాక్సులు, నోట్ పుస్తకాలకు మాత్రం నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు ఇచ్చింది. 36.7 లక్షల కిట్లను రూ.630 కోట్లతో నేరుగా కొనుగోలు చేసుకునేందుకు ఒప్పందం చేసుకుంది. టెండర్లు అవసరం లేదంటూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఏకంగా జీవో జారీచేశారు. రూ.వందల కోట్ల వ్యవహారంలో టెండర్లు ఎందుకు పిలవట్లేదనే విషయాన్ని ఆయన వివరించలేదు. పాతవారికే కాంట్రాక్టును అప్పగించడం వల్ల రూ.50కోట్లకు పైగా కమీషన్లు ప్రభుత్వ పెద్దలకు ముట్టినట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారితే దీనిపై విచారణ చేయించే అవకాశం ఉంది. రాజకీయ నాయకులే కాకుండా ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ ఉంటుందని ప్రచారం జరుగుతోంది.

బకాయిలిచ్చి మరీ కాంట్రాక్టు

టెండర్ల విషయంలో ప్రభుత్వం డ్రామాలాడింది. గతేడాది సరఫరా చేసిన కానుకలో బకాయిలు ఉన్నందున ఈ ఏడాది పంపిణీకి తాము ముందుకు రాలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు తొలుత ప్రచారం చేసింది. గతేడాది కాంట్రాక్టుకు సంబంధించిన బకాయిల్లో 50శాతం అయినా ఇప్పుడు చెల్లిస్తే చూస్తామన్నారని సాకు చూపిస్తూ హడావిడిగా రూ.300 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత అనేకమంది కాంట్రాక్టర్లతో చర్చలు జరిపిన సమగ్రశిక్ష అధికారులు కాంట్రాక్టును సరిగ్గా అదే 19మంది కాంట్రాక్టర్లకు చేతిలో పెట్టారు. ప్రభుత్వం బకాయిలు పెడుతుందన్న భయం ఉన్నవారు మళ్లీ ఇందులోకి ఎలా వచ్చారో జగన్ సర్కారుకే తెలియాలి. టెండర్లు పిలిస్తే పోటీతో ఖర్చు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ ఆ మాటే లేకుండా కేవలం చర్చలతోనే రూ.630 కోట్ల కాంట్రాక్టును అప్పనంగా కట్టబెట్టింది. రూ.వంద కోట్లు దాటితే న్యాయ సమీక్షకు టెండర్ల ఫైలును పంపుతామన్న ప్రభుత్వం, అసలు టెండరు ఫైలే లేకుండా రూ.వందల కోట్ల కాంట్రాక్టులో మాయ చేసింది. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఉన్నతాధికారులెవరూ అభ్యంతరం వ్యక్తంచేయలేదు. దీనివల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయనే ఆలోచన కూడా లేకుండా ప్రభుత్వం ఆదేశించిందని ఇష్టానుసారంగా కాంట్రాక్టులు కట్టబెట్టారు.

జగన్ అండ్‌కోకు మైండ్ బ్లాంక్!

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఆ చట్టాన్ని కూడా రాజకీయ అవసరాలకు వాడుకుందామని వైసీపీ ప్లాన్ చేసిందనే వాదన రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇక, ఈ చట్టంలోని అనేక అంశాలు రైతులకు ఇబ్బందిగా ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో ముఖ్యమంత్రి జగన్, ఆయన సలహాదారులు, రాజకీయ వ్యూహకర్తలు తర్జన భర్జన పడ్డారు. దీంతో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. తమ సొంత ప్రయోజనాల కోసం చట్టం తీసుకురాలేదని, కేంద్రం, నీతి ఆయోగ్ ఒత్తిడి చేస్తేనే చట్టం చేశామని అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేశారు. సరిగ్గా పోలింగ్‌కు వారం రోజుల ముందు నాగిళ్ల వెంకటేశ్ అనే వ్యక్తి ఆర్టీఐ కింద ఏపీ ల్యాండ్ టైటిల్ చట్టం గురించి నీతి ఆయోగ్‌ను సమాచారం కోరారు. పోలింగ్ ముగిసిన మూడు రోజులకు అంటే ఈ నెల 16న నీతి ఆయోగ్ స్పందించింది. ఆరు ప్రశ్నలకు నీతి ఆయోగ్ అండర్ సెక్రెటరీ రవీందర్ కౌర్ బైన్స్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

నీతి ఆయోగ్ ఏం చెప్పిందంటే

1 నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం ఎలా ఉంది? అని అడిగిన ప్రశ్నకు 'మా దగ్గర ఎలాంటి సమాచారం లేదు' అని తెలిపింది.

1 రైతులు భూములు అమ్ముకోవడానికి రాష్ట్రం అనుమతి తీసుకోవాలా? అన్న ప్రశ్నకు "ఏపీ ల్యాండ్ టైటిల్ చట్టంలో ఏముందో మాకు తెలియదు. దానికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదు" అని నీతి ఆయోగ్ తేల్చి చెప్పింది.

1 దేశంలోని అన్ని రాష్ట్రాల్లో టైటిలింగ్ చట్టం అమలుకు నీతి ఆయోగ్, కేంద్రం ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి? అన్న ప్రశ్నకు "మేం భూ వనరుల విభాగంతోపాటు రాష్ట్రాలకు కేవలం ముసాయిదాను మాత్రమే పంపించాం" అని నీతి ఆయోగ్ పేర్కొంది.

అన్నీ అబద్ధాలే!

చట్టం గురించి నీతి ఆయోగ్ చెప్పిన వాస్తవాలు ఇలా ఉంటే, జగన్ సర్కారు మాత్రం పచ్చి అబద్ధాలు, అవాస్తవాలను ప్రచారం చేసింది. రైతులను మభ్యపెట్టేందుకు కేంద్రం, నీతి ఆయోగ్‌పై నిందలు మోపింది. ఈ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం, నీతి ఆయోగ్‌లు తమపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చాయని, ఇది తమ సొంత ఆలోచన కానేకాదని ముఖ్యమంత్రి జగన్, ఆయన సలహాదారులు పదేపదే చెప్పారు. ఎన్నికల సభల్లోనూ అవే అబద్ధాలు వల్లించారు. ఇక, సజ్జల రామకృష్ణారెడ్డి అబద్ధాలే సిగ్గుపడేలా వ్యాఖ్యానాలు చేశారు. టైటిలింగ్ చట్టం దేశంలోని 24 రాష్ట్రాల్లో అమల్లో ఉందని, బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని సీఎం రోత పత్రిక అచ్చేయడం గమనార్హం. ఎన్నికల సమయంలో ఏది మాట్లాడినా జనం నమ్మేస్తారన్న అభిప్రాయంతో ఇలా అబద్ధాలు ప్రచారం చేశారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కానీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై 'ఆంధ్రజ్యోతి' రాసిన వార్తలు అక్షరసత్యమని తాజా ఆర్టీఐ సమాచారంతో నిర్ధారణ అయింది.

ముందే కూసి!

జగన్ సర్కారు ల్యాండ్ టైటిలింగ్ బిల్లును 2019, జూలై 26నే కేంద్రం ఆమోదం కోసం పంపింది. కానీ, నీతి ఆయోగ్ ముసాయిదాను 2019 డిసెంబరు 26న పంపించింది. అంటే, నీతి ఆయోగ్ నుంచి ముసాయిదా రావడానికి ఆరు నెలలకు ముందే జగన్ సర్కారు టైటిలింగ్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రం పరిశీలనకు పంపించింది. ఈ వాస్తవం ఎవ్వరికీ తెలియదని వైసీపీ నేతలు భావించారు. కేంద్రం ఒత్తిడి చేయబట్టే చట్టం తీసుకొచ్చామని జగన్ పదేపదే చెప్పారు. కానీ, అది అబద్ధమని ఇప్పుడు తేలిపోయింది. నిజంగా నీతి ఆయోగ్ పదేపదే ఏపీపై ఒత్తిడిచేసి ఉంటే, ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టంలో ఏముందో? ఏయే అంశాలు అందులో ఉన్నాయో సవివరంగా తెలియజేసేది. కానీ, రాష్ట్రం చేసిన చట్టం గురించి తెలియదు కాబట్టే ఆ చట్టంలో ఏముందో తమకు తెలియనే తెలియదని కుండబద్దలు కొట్టింది.

ఇప్పుడు ఏం చెబుతారు?

ల్యాండ్ టైటిలింగ్ చట్టం విషయాన్ని నీతి ఆయోగ్ తేల్చిసిన దరిమిలా.. సీఎం జగన్, ఆయన సలహాదారులు ఇప్పుడు ఏం చెబుతారు? పాత అబద్ధాలే వల్లిస్తారా? లేక కొత్త అబద్ధాలను వండివారుస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఏం చెప్పినా సరే.. టైటిలింగ్ చట్టం కేంద్రంతో సంబంధం లేకుండానే జగన్ తీసుకొచ్చారన్నది నీతి ఆయోగ్ సమాధానంతో విస్పష్టంగా బయటపడింది. పైగా, కేంద్రానికి 2019లో పంపిన బిల్లును ఆమోదించలేదు. 2021, 2022లో అసెంబ్లీలో బిల్లులను సవరించి కేంద్రానికి పంపించారు. ఆ బిల్లును ఆమోదించేలా ఇక్కడి అధికారులు ఢిల్లీలో మకాం వేసి పెద్ద లాబీయింగ్ చేశారు. ఒక రకంగా ఆ బిల్లును ఆమోదించాలని జగన్ సర్కారే కేంద్రంపై పదేపదే ఒత్తిడిలు తీసుకొచ్చింది. దీన్ని బట్టి ఈ చట్టం గురించి, ప్రజల్లో నెలకొన్న భయాందోళనల పట్ల జగన్ సర్కారు చెప్పినవన్నీ డొల్లమాటలేనని స్పష్టమవుతోంది.

రోదసిలోకి గోపి తోటకూర

- తొలి భారతీయ అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు
- రాకేశ్‌శర్మ తర్వాత మళ్లీ ఇప్పుడే రోదసిలోకి..
- బ్లూ ఆరిజిన్ న్యూషెఫర్డ్-25 విజయవంతం



వాషింగ్టన్, మే 19: రోదసిలోకి వెళ్లిన తొలి భారతీయ పర్యాటకుడిగా గోపి తోటకూర రికార్డు నెలకొల్పారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజో నెలకొల్పిన బ్లూ ఆరిజన్ సంస్థ ఆదివారం నిర్వహించిన అంతరిక్షయాత్రలో గోపి పాలుపంచుకున్నారు. న్యూషెపర్డ్-25 పేరుతో బ్లూ ఆరిజన్ ఆదివారం ఉదయం తమ 7వ మానవసహిత రోదసి యాత్రను నిర్వహించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల 37 నిమిషాలకు పశ్చిమ టెక్సాస్‌లోని ప్రయోగకేంద్రం నుంచి వ్యోమనౌక (క్యాప్సూల్) రోదసిలోకి దూసుకెళ్లి పది నిమిషాల్లో భూమి మీదకు సురక్షితంగా తిరిగి వచ్చింది. ధ్వని వేగానికి మూడింతల వేగంతో వ్యోమనౌక ప్రయాణించింది. భూమికి 105 కి.మీ.ల ఎత్తు వరకు వెళ్లింది. దాంట్లో ఉన్న ఆరుగురు ప్రయాణికులు కొద్దిసేపు భారరహిత స్థితిని అనుభవించారు. అంతరిక్షం నుంచి భూవిని వీక్షించారు. ఈ రోదసియాత్రలో మొత్తం ఆరుగురు ప్రయాణికులు పాల్గొన్నారు. వీరిలో గోపి తోటకూర ఒకరు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోపి.. ఎంబ్రీ రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేశారు. పైలట్‌గా, ఏవియేటర్‌గా పని చేస్తున్నారు. విమానాలతోపాటు సీప్లేన్‌లను, గ్లైడర్లను, హాట్ ఎయిర్ బెలూన్లను కూడా ఆయన నడిపిస్తారు. 1984లో భారత సైన్యానికి చెందిన వింగ్ కమాండర్ రాకేశ్‌శర్మ రోదసిలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర నమోదు చేశారు. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా గోపి తోటకూర రికార్డు నెలకొల్పారు. బ్లూ ఆరిజిన్ అంతరిక్షయాత్రలో పాల్గొన్న ఆరుగురిలో.. అమెరికాకు చెందిన తొలి నల్లజాతి వ్యోమగామి, 90 ఏళ్ల వయసున్న ఎడ్ డ్వైట్ కూడా ఉండటం విశేషం. డ్వైట్‌ను 1963లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ నాసా వ్యోమగాముల బృందంలో ఒకరిగా ప్రకటించినప్పటికీ.. తుది బృందంలో ఆయన ఎంపిక కాలేదు. తర్వాత కాలంలో పలువురు నల్లజాతీయులు రోదసికి వెళ్లారు కానీ డ్వైట్‌కు అవకాశం రాలేదు. ఇన్నేళ్ల తర్వాత బ్లూ ఆరిజిన్ ద్వారా ఆయన రోదసిలోకి వెళ్లొచ్చారు. తద్వారా, అంతరిక్ష యాత్ర చేసిన అత్యధిక వయస్కుడిగా నిలిచారు. అంతరిక్ష యాత్రకు గాను ఒక్కొక్కరి నుంచి బ్లూ ఆరిజిన్ ఎంత టికెట్ మొత్తం వసూలు చేసిందన్నది వెల్లడి కాలేదు. డ్వైట్ టికెట్‌ను మాత్రం కొన్ని సంస్థలు స్పాన్సర్ చేసినట్లు సమాచారం.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.